


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

వెల: రూ.5.00




సోమవారం | 7-8-2017 | పేజీలు: 16 + 20 | సంపుటి: 58 సంచిక: 113 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పూర్ణిమ రా.11.41 తదుపరి పాడ్యమి; నక్షత్రం: శ్రవణం తె. 3.33 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 6.04-7.47; దుర్ముహూర్తం: మ. 12.47-1.38; మ. 3.19-4.10; అమృతఘడియలు: సా. 4.23-6.06; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.43 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



14

## ఆ 3 గంటలు

సూర్య కుమారి మృతిపై మిస్టరీ

విద్యాసాగర్ చుట్టూ ఉచ్చు.. అరెస్టు

అర్ధరాత్రి ఆయన ఇంటికెళ్లిన డాక్టర్

అక్కడ వాగ్వాదం... ఆపై అదృశ్యం

## ఇనుప మెట్ల నిర్మాణంపై వెనక్కి


భక్తుల మనోభావాల మేరకే నిర్ణయం: ఈవో 14

## కాగ్నిజెంట్‌లో 400 మంది ఇంటికి 12

సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు వీఆర్ఎస్

• ఆలమట్టి కళకళ

కర్ణాటకలోని ఆలమట్టి నిండుగా నీటితో..



• శ్రీశైలం వెలవెల

స్పిలు దిగువకు పోయిన నీటితో శ్రీశైలం

# కృష్ణమ్మకు షరీఫ్ దెబ్బ!

## కృష్ణా జలాల కష్టాలకు కారకుడాయనే

1973లో రాష్ట్రపతి పాలనలో రాష్ట్రం

నాడు గవర్నర్ సలహాదారుగా షరీఫ్

బచావత్ తీర్పుపై ఆయన ప్రభావం

స్కీమ్-బిలో చేరుతామన్న ఆంధ్రప్రదేశ్

స్కీమ్-ఎ అన్న గవర్నర్ సలహాదారు

ఫలితం గుక్కెడు నీరూ దక్కని వైనం

*కాసిన్ని నీళ్లున్నాయి! ముగ్గురు దాహంతో అలమటిస్తున్నారు. ఉన్న నీటిని తలా గుక్కెడు తాగితే ధర్మం! కానీ, 'మా దాహం తీర్చుకున్నాకే, నీకు నీళ్లిస్తాం' అని ఇద్దరు చెబితే... మూడో వ్యక్తికి అన్యాయం! ఇక్కడ... తెలుగు రాష్ట్రాలది మూడో వ్యక్తి పరిస్థితి. కృష్ణా జలాలపై ఇదీ మన దుస్థితి! దీనికి కారణం.. షరీఫ్ అనే వ్యక్తి!*

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి ఎగువన కర్ణాటకలోని ప్రాజెక్టులన్నీ జలకళతో కళకళలాడుతున్నాయి. నదికి దిగువన తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులు మాత్రం రాళ్లు దేలి నీటి కోసం అర్రులు చాస్తున్నాయి. 'మా నేలలు బీడువారుతున్నాయి.. మా పంటలు ఎండిపోతున్నాయి.. కాసిన్ని నీళ్లు వదిలి పుణ్యం కట్టుకోండి' అని

మిగతా 2వ పేజీలో...

నంద్యాల బరిపై

# కాయ్ రాజా కాయ్

## ఉప ఎన్నికపై బెట్టింగ్‌ల జోరు

హైదరాబాద్‌లోనూ ఆసక్తి

ఎన్నారైలకూ పాకిన ఫీవర్

సొంతంగా సర్వేలు, విశ్లేషణలు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అగ్రనేతల ప్రచారాలు... పోటాపోటీగా విమర్శలు... ఇరు పార్టీలకూ ప్రతిష్ఠాత్మకమైన పోరు! కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికపై అందరిలోనూ ఆసక్తి! రాజకీయ విశ్లేషకులు, సామాన్యులు మాత్రమే కాదు... 'నంద్యాల'పై పందెంరాయుళ్ల కన్ను కూడా పడింది. అక్కడ ఏ పార్టీ గెలుస్తుంది? పరిస్థితి ఎటువైపు మళ్లుతుంది? ఏ వర్గం ఓట్లు ఎటు? సీఎం చంద్రబాబు వరాలు, ప్రతిపక్ష నేత జగన్ వ్యాఖ్యలు ఎంతమేరకు ప్రభావం చూపిస్తాయి? గత ఎన్నికల లెక్కలేంటి? కొత్త రాజకీయ

మిగతా 11వ పేజీలో...

• ఎనిమిదోస్సారి..



15

# భారత్ జైత్రయాత్ర

## టీమిండియాదే సిరీస్

రెండో టెస్టులో శ్రీలంక చిత్తు.. 2-0తో సిరీస్ భారత్ కైవసం

*శ్రీలంక గడ్డపై తిరుగులేని ప్రదర్శనతో టీమిండియా మరో ఘన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆదివారం ముగిసిన రెండో టెస్టులో భారత్ ఇన్నింగ్స్ **53** పరుగుల తేడాతో లంకను చిత్తుగా ఓడించి సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు **209/2**తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా **(5/152)** దెబ్బకు **386** పరుగులకే ఆలౌటైంది. దాంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే **3** టెస్టుల సిరీస్‌ను భారత్ **2-0**తో సొంతం చేసుకుంది. కోహ్లీ సేనకు ఇది వరుసగా ఎనిమిదో సిరీస్ విజయం కావడం విశేషం.*

## విదేశీ పెట్టుబడులకు వేళాయె!



16

ఈ నెలలో ఆరు సంస్థలకు పునాది రాళ్లు

3 మెగా ప్రాజెక్టులకు ముహూర్తాలు ఖరారు

మొత్తం ప్రాజెక్టుల విలువ 11,819 కోట్లు










# చీట్ ఫండ్స్!

## ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్ల స్వీకరణ

పెట్టుబడులుగా గ్రూప్ సంస్థలకు మళ్లింపు.. ఐటీ, సీఐడీ, సెబీ విచారణ 14

నోట్ల రద్దు సమయంలో 100 కోట్లపైనే సేకరించిన గ్రూపు గుట్టును పసిగట్టిన ఆర్బీఐ

జాబితాలో మరో 3 ప్రముఖ కంపెనీలు.. జనం సొమ్ముతో మరో గ్రూప్ రియల్ పెట్టుబడులు








మాతాశిశు సంరక్షణ కేంద్రం కోసం కేటాయించిన స్థలం

## తెరపైకి ట్విన్ టవర్స్ ప్రతిపాదన

ప్రభుత్వానికి డబ్బులిస్తే నిర్మాణం ఆలస్యమవుతుందని ఎన్నారైలు భావిస్తున్నారు. ఎన్నారైలకు ప్రభుత్వ గ్రాంట్ అందించేందుకు నిబంధనలు ఒప్పుకోవని ప్రభుత్వం వాదిస్తోంది. దీంతో బ్లాక్ నిర్మాణమే వెనక్కిపోయింది. దీనికి పరిష్కారంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజు నాయుడు ట్విన్ టవర్స్ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. రూ.35 కోట్లతో ప్రభుత్వం నిర్మించే భవనానికి సమాంతరంగా రూ.30 కోట్లతో ఎన్నారైలు మరో భవనాన్ని నిర్మిస్తే రెండింటికి మధ్య కారిడార్ ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ఈ సూచనపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు దానిపై దృష్టి సారించడం లేదు. ఆదివారం నాడు ఆరోగ్య శాఖ మంత్రి నాట్కో సంస్థ నిర్మించ తలపెట్టిన క్యాన్సర్ యూనిట్ శంకుస్థాపనకు జీజీహెచ్‌కు వస్తున్నారు. ఈ సందర్భంగానైనా ఎంసీహెచ్ నిర్మాణంపై చర్చిస్తే ఫలితం ఉంటుందని బాలింతల కష్టాలు కాస్తయినా తీరే అవకాశం ఉంటుంది.



జీజీహెచ్‌లోని కాన్పుల వార్డులో పరిస్థితి

# కాన్పు కష్టాలు!

## ఇద్దరు తల్లులు.. ఇద్దరు బిడ్డలు.. ఒకే మంచం.. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇదీ దుస్థితి

గుంటూరు (సంగడిగుంట), ఆగస్టు 6: పచ్చి బాలింతలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.. తల్లివెచ్చని ఒడిలో సేదదీరాల్సిన పసిగుడ్డులు ఇరుకిరుకు మంచాలపై అల్లాడుతున్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి(జీజీహెచ్)లో కాన్పుల వార్డులో దుస్థితి ఇది. తగిన సంఖ్యలో మంచాలు లేక.. మంచాలు ఉన్నా సరిపడా స్థలం లేక.. ఒకే మంచంపై ఇద్దరు తల్లులు, ఇద్దరు బిడ్డలను ఆస్పత్రి సిబ్బంది సర్దుబాటు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్వాకంతో జీజీహెచ్‌కు కాన్పుల కోసం వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీజీహెచ్‌లో 650 పడకలతో అత్యాధునిక వసతులతో ఆరు అంతస్థుల్లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని రూ.65 కోట్లతో నిర్మిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మూడేళ్లు. నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఈ భవన నిర్మాణానికి వీలుగా అప్పటికే ఉన్న 200 పడకల మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని కూల్చివేశారు. ఆ భవనంలోని పడకలను ఆస్పత్రిలోని 106, 112 వార్డుల్లో సర్దుబాటు చేశారు. ఒక్కో వార్డులో 50 మంచాలపై 200 మంది గర్భిణులను పడుకోబెడుతున్నారు. పచ్చి బాలింతలను సిజేరియన్ చేసిన గంటలోనే ఒకే మంచంపై ఇద్దరిని సర్దుబాటు చేస్తున్నారు. ఒకే మంచంపై ఇద్దరు తల్లులు, ఇద్దరు పిల్లలు పడుకోవాల్సి వస్తోంది.

### నాడు ఆంధ్రజ్యోతి హెచ్చరికతో కదలిక

జీజీహెచ్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో తగినన్ని సంఖ్యలో పడకలు లేవని 2013 అక్టోబరులో 'ఆంధ్రజ్యోతి' ఒకే బెడ్డుపై ఇద్దరు తల్లులు, ఇద్దరు పిల్లలు పడుకొని ఉన్న చిత్రాలతో కథనాన్ని ప్రచురించింది. దీనికి చలించిన అప్పటి జిల్లా కలెక్టర్ సురేష్ కుమార్ జాతీయ ఆరోగ్య మిషన్‌కు ప్రతిపాదనలు పంపించారు. అంతే వేగంగా స్పందించిన ఎన్‌హెచ్‌ఎం వారంలో రూ.20 కోట్లను విడుదల చేసి 200 పడకలతో ఎంసీహెచ్ (మెటర్నల్, చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్- మాతాశిశు సంరక్షణ కేంద్రం)ని నిర్మించాలని ఆదేశించింది. అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో రూ.15 కోట్లు జత చేసి రూ.35 కోట్లతో ఆధునిక భవనాన్ని నిర్మించాలని 2014 ఆగస్టు 2న జీవో విడుదల చేసింది. భవన నిర్మాణాన్ని ప్రారంభించే క్రమంలో ఎన్నారై వైద్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. రూ.35 కోట్లకు తాము కూడా మరో రూ.30 కోట్లు అందిస్తామని, మొత్తం రూ.65 కోట్లతో 650 పడకలతో ఆరు అంతస్థుల భవనాన్ని నిర్మించాలని వారు ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఎవరు నిర్మాణం చేపట్టాలన్న దానిపై ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఎన్నారైలు ఇస్తామంటున్న రూ.30 కోట్లను ఇస్తే భవనాన్ని నిర్మిద్దామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి ఎన్నారైలు స్పందిస్తూ.. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.35 కోట్లు తమకు అప్పగిస్తే తామే భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. అలా ఇవ్వడం కుదరదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో దుస్థితిపై వచ్చిన కథనంతో మంత్రి పుల్లారావు జీజీహెచ్‌లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం చర్చకు వచ్చింది. మరుసటి రోజు ఎన్నారై ప్రతినిధి డాక్టర్ త్రిపురనేని రవిని కూడా పిలిపించి ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ సమక్షంలో ఈ విషయంపై ఓ నిర్ణయం తీసుకొని ఎంవోయు కుదుర్చుకోవాలని నిర్ణయించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు.



ఒకే మంచంపై ఇద్దరు తల్లులు, ఇద్దరు పిల్లలు



## విశాఖలో వికసించిన రాఖీ పుష్పాలు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన పుష్పాలు విశాఖ బయోడైవర్సిటీ పార్కులో వికసించాయి. నగరంలోని పెదవాల్తేర్ రాణీచంద్రమతిదేవి (ఆర్సీడీ) ఆస్పత్రి ఆవరణలో కొలువుతీరిన జీవవైవిధ్య ఉద్యానవనంలో ఈ పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. వీటి శాస్త్రీయ నామం పస్సిఫ్లోరా. కానీ ప్రజలు రాఖీ ఫ్లవర్స్‌గా గుర్తిస్తారు. అతి కొద్ది రోజులు మాత్రమే ఈ పుష్పాలు వుంటాయి. తర్వాత మళ్లీ ఎన్నో నెలల తర్వాత వికసిస్తాయి. అచ్చం రాఖీని తలపించేలా వివిధ రంగుల్లో ఆకట్టుకుంటున్నాయి. పార్కులో రెండు పుష్పాలు మాత్రమే వికసించాయి. సోమవారం రాఖీ పండుగ కావడంతో ఈ పుష్పాలను తిలకించేందుకు ఆసక్తి చూపుతారని డాక్టర్ మంధా రామమూర్తి, సొసైటీ కార్యదర్శి పావని, ఉషశ్రీ తెలిపారు.



# వరుస సెలవుల పండగ!

- 12 నుంచి 15 వరకు అందరికీ సెలవు
- ఒక ఓహెచ్, మరో సీఎల్‌తో మరిన్ని
- ప్రభుత్వ ఉద్యోగులకు బంపర్ చాన్స్

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 'వరుస సెలవుల పండగ' వచ్చేస్తోంది. విహార యాత్రకో, సొంత ఊరికో ఎంచక్కా చెక్కేయడానికి బ్యాగులు సర్దుకోవడమే ఆలస్యం. ఇక రాజధాని పరిధిలోని సచివాలయం, ప్రధాన కార్యాలయాల సిబ్బందికి మరిన్ని సెలవులు బోనస్! ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సెలవులే. 12 రెండో శనివారం కాగా, 13 ఆదివారం. 14వ తేదీ కృష్ణ జన్మాష్టమి, 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం వచ్చాయి. ఇక... 16వ తేదీ సెలవు పెట్టుకుంటే... 17న (గురువారం) ఆప్షనల్ వాడుకోవచ్చు. రాజధానిలోని సచివాలయం, హెచ్‌వోడీల సిబ్బంది 18వ తేదీ (శుక్రవారం) కూడా సెలవు పెడితే... శని, ఆదివారాలు కలిసి వస్తాయి. వెరసి... వీరు 16, 17, 18 తేదీల్లో సెలవులు వాడుకోగలిగితే... వరుసగా 12 నుంచి 20వ తేదీ వరకు సెలవులే సెలవులు. ఇక... ఆగస్టు చివరి వారంలోనూ సచివాలయ ఉద్యోగులకు మరో దఫా వరుస సెలవులు రానున్నాయి. ఆగస్టు 25వ తేదీ శుక్రవారం వినాయక చవితి. ఆ తర్వాత శని, ఆదివారాలు కూడా సెలవులే! చాలామంది ఉద్యోగులు ఇప్పటినుంచే ఈ సెలవులకు అనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇక... బ్యాంకు ఉద్యోగులకు కూడా రెండు విడతల్లో వరుస సెలవులు వస్తున్నాయి. ఈనెల 12 నుంచి 15 మధ్య... ఒక్క 14వ తేదీ మాత్రమే బ్యాంకులు పని చేస్తాయి. ఇక... 25న వినాయక చవితి (శుక్రవారం), ఆ తర్వాత నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులు పని చేయవు.

### తిరుమలలో ముందు జాగ్రత్త

తిరుమల: వరుస సెలవుల నేపథ్యంలో ఈనెల 12 నుంచి 15 వరకు కేవలం ప్రొటోకాల్ వీఐపీలకే బ్రేకు దర్శనం కల్పించనున్నట్టు జేఈవో శ్రీనివాసరాజు స్పష్టం చేశారు. సామాన్య భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారని... అందుకే ఆ నాలుగు రోజులు సిఫారసు లేఖలను అనుమతించబోమని తెలిపారు. మరో వైపు... శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో స్వయంగా వచ్చే కాటేజీ దాతలకే గదులు కేటాయించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. గరుడసేవ సందర్భంగా సెప్టెంబర్ 26, 27 తేదీల్లో దాతలకు కూడా గదుల కేటాయింపు ఉండదని స్పష్టం చేసింది.

# కృష్ణమ్మకు షరీమ్ దెబ్బ!

(మొదటి పేజీ తరువాయి)

అడిగే హక్కు కూడా లేక తెలుగు రాష్ట్రాలు చేష్టలుడిగి నిల్చోవాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం కానీ.. న్యాయస్థానాలు కానీ జోక్యం చేసుకోలేవా? దిగువనున్న తెలుగు రాష్ట్రాలకు కాసిన్ని నీళ్లు ఇవ్వండని కర్ణాటకను ఆదేశించలేవా? ఇవే సందేహాలు జలవనరులశాఖ అధికారులకూ వచ్చాయి. రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితిపై కేంద్రం జోక్యం కోరే వెసులుబాటు కానీ.. న్యాయ స్థానాలను ఆశ్రయించే వీలు కానీ ఉందా అన్న అంశంపై చర్చించేందుకు ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు భేటీ అయ్యారు. బచావత్ ట్రిబ్యునల్ ఆదేశాల్లో... కరువు సమయంలో పైనుంచి కిందకు నీళ్లు వదిలేందుకు ఏమైనా మార్గదర్శకాలు జారీ చేశారేమోనని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఓ దిగ్భ్రాంతికరమైన విషయం వెలుగు చూసింది.

### అసలేం జరిగిందంటే...

జై ఆంధ్ర ఉద్యమ సమయంలో... 1973 జనవరి 11 నుంచి డిసెంబరు 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపతి పాలనలో ఉంది. గవర్నర్ సలహాదారులుగా షరీమ్, వీకే రావు ఉండేవారు. అదే సమయంలో కృష్ణా జలాల పంపిణీపై ట్రిబ్యునల్ తన తీర్పును ఇచ్చేందుకు సిద్ధమైంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు నీటి కేటాయింపులకు రెండు 'ఆప్షన్ల'ను ఇచ్చింది. ఇందులో 'స్కీమ్-ఎ' ప్రకారం... కృష్ణా నదిలో నికర జలాలను 2060 టీఎంసీలుగా తేల్చారు. మహారాష్ట్రకు 560, కర్ణాటకకు 700, ఆంధ్రప్రదేశ్‌కు 800 టీఎంసీల చొప్పున కేటాయించారు. ఇక, స్కీమ్-బీ ప్రకారం... కృష్ణా జలాల్లో 330 టీఎంసీల అదనపు జలాలు ఉంటాయని అంచనా వేసి, వాటిని మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు 25:50:25 నిష్పత్తిలో కేటాయించారు. అదే సమయంలో, ఎప్పుడైనా 2060 టీఎంసీలకంటే తక్కువ జలాలు అందుబాటులో ఉంటే మూడు రాష్ట్రాలు స్కీమ్-ఏలోని కేటాయింపుల నిష్పత్తి ప్రకారమే పంచుకోవాలి. వర్షాభావ పరిస్థితుల్లో కృష్ణా జలాల లభ్యత తక్కువగా ఉన్నప్పుడు... స్కీమ్-బి వల్ల ఆంధ్రప్రదేశ్‌కు మేలు జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని... అప్పట్లో రాష్ట్రం తరపున ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ రామచంద్రారెడ్డి, జల వనరుల శాఖ ఈఎన్‌సీ సీతారామ శాస్త్రి ముందుచూపుతో 'స్కీమ్-బి'ని ఎంచుకున్నారు. ట్రిబ్యునల్ పత్రాలపై సంతకాలు కూడా చేశారు. గవర్నర్ సలహాదారుగా ఉన్న షరీమ్‌కు స్కీమ్-ఎ, స్కీమ్-బీ గురించి వివరించి, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాము స్కీమ్-బీని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. అయితే, షరీమ్ ఆ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఎవరినడిగి నిర్ణయం తీసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కీమ్-ఏను ఎంచుకోవాలని హుకుం జారీ చేశారు. వర్షాభావ పరిస్థితులను షరీమ్ ఊహించలేకపోయారు. చివరికి... ఆయన ఆదేశాల ప్రకారం అడ్వకేట్ జనరల్, ఈఎన్‌సీ ట్రిబ్యునల్ ముందుకు వెళ్లి స్కీమ్-బీకి బదులుగా స్కీమ్-ఏ ఎంచుకుంటామని తెలిపారు. అదే ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు శాపంగా మారింది. కృష్ణా నదిపై ఎగువ రాష్ట్రమైన కర్ణాటక ఆలమట్టిని నిర్మించింది. 'మాకు కేటాయించిన నీటిని వాడుకున్నాకే మీకు నీళ్లు' అంటోంది. తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులు నీళ్లులేక నోళ్లు తెరుస్తున్నాయి. అదే స్కీమ్-బీని ఎంచుకుని ఉంటే... నీరు తక్కువగా ఉన్నా నీళ్లు విడుదల చేయాల్సి వచ్చేది. ట్రిబ్యునల్ తీర్పుల్లో కేంద్రం కానీ, న్యాయస్థానాలు కానీ జోక్యం చేసుకోజాలవు. వెరసి... కరువు సమయంలో తమకు నీటిని విడుదల చేయాలని కోరేందుకు దిగువన ఉన్న తెలుగు రాష్ట్రాలకు అవకాశం లేకుండా పోయింది.

**కృష్ణా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి ఇదీ**

| ప్రాజెక్టు | సామర్థ్యం | ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీల్లో) |
|---|---|---|
| ఆలమట్టి | 129.72 | 128.19 |
| నారాయణపూర్ | 37.65 | 37.12 |
| శ్రీశైలం | 215.81 | 19.62 |
| నాగార్జున సాగర్ | 312.05 | 116.10 |


# న్యాయానికి 24 ఏళ్లు!

- కొడుకును కోల్పోయిన తల్లికి పరిహారంలో తీవ్రజాప్యం
- క్షమాపణ చెప్పిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కొడుకును కోల్పోయిన తల్లికి 24 ఏళ్ల తర్వాత నష్టపరిహారం చెల్లించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ మాతృమూర్తికి న్యాయం చేయడంలో జరిగిన జాప్యానికి న్యాయమూర్తి స్వయంగా క్షమాపణలు చెప్పడం సంచలనం కలిగించింది. 1993 మే 18న తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో లోకేశ్వరన్ అనే యువకుడు మృతి చెందాడు. అతడి తల్లి భాగ్యం నష్టపరిహారం కోరుతూ వాహన ప్రమాదాల చట్టం కింద పిటిషన్ వేయడానికి బదులుగా కార్మిక చట్టం కింద నష్టపరిహారం కోరుతూ పిటిషన్ వేయడంతో దానిని తోసిపుచ్చారు. ఆ తర్వాత ఆమె వాహన ప్రమాదాల ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. ప్రమాదానికి కారణమైన లారీకి ఇన్సూరెన్స్ అందించాల్సిన బీమా సంస్థ మాత్రం ఆ పిటిషన్ చెల్లదంటూ వాదించింది. ఆ వాదనను తిరస్కరించిన ట్రిబ్యునల్ రూ.3.47 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. ఆ తీర్పును సవాలు చేస్తూ బీమా సంస్థ మద్రాసు హైకోర్టుకు వెళ్లింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్. శేషసాయి ట్రిబ్యునల్ తీర్పును ఖరారు చేస్తూ కన్నబిడ్డను పోగొట్టుకున్న భాగ్యంకు బీమా సంస్థ రూ.3.47 లక్షలను నష్టపరిహారంగా నాలుగు వారాలలోపు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అంతే కాకుండా నష్టపరిహారం కోసం 24 ఏళ్ల పాటు నిరీక్షణకు గురిచేసినందుకు క్షమాపణలు తెలిపారు.

## ప్రాణం తీసిన పిల్లల గొడవ!

- పది విద్యార్థిపై 8వ తరగతి విద్యార్థి, అతడి మిత్రుల దాడి
- తీవ్ర గాయాలతో టెన్త్ క్లాస్ విద్యార్థి మృతి



సిద్ధనాతి చిన్నా

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బడి పిల్లల మధ్య జరిగిన గొడవ... చివరకు ఒక విద్యార్థి మృతికి కారణమైంది. విశాఖలోని సీతంపేట ప్రాంతం శాంతిపురానికి చెందిన సిద్ధనాతి చిన్నా(15) మధురానగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సీతంపేటకు చెందిన 13 ఏళ్ల విద్యార్థి అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు చిన్న విషయమై పాఠశాలలో పది రోజుల క్రితం గొడవ పడ్డారు. తర్వాత ఎక్కడ తారసపడినా ఒకరినొకరు దూషించుకోసాగారు. ఈ విషయం ఉపాధ్యాయుల దృష్టికి రావడంతో వారిని పిలిచి సర్ది చెప్పారు. అయినా వారు తీరు మార్చుకోకపోవడంతో వారి తల్లిదండ్రులకూ చెప్పారు. అయినా తీరు మారని ఆ విద్యార్థులు శనివారం మరోసారి పాఠశాల వద్ద గొడవపడ్డారు. తోటి విద్యార్థులు కలగజేసుకుని వారిని విడదీయడంతో గొడవ ఆగిపోయింది. మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్తున్న సమయంలో ఎనిమిదో తరగతి చదువున్న విద్యార్థి తన సోదరుడికి ఫోన్‌చేసి, చిన్నాతో జరిగిన గొడవ గురించి చెప్పాడు. అతను తన స్నేహితుడిని వెంటబెట్టుకుని పాఠశాల వద్దకు వచ్చాడు. ముగ్గురూ కలిసి చిన్నాతో ఘర్షణకు దిగారు. దీంతో చిన్నా తన బంధువైన ఇంటర్ చదువుతున్న ఒక విద్యార్థికి కబురు చేశాడు. కొద్దిసేపట్లో అతడూ అక్కడికి చేరుకున్నాడు. అనంతరం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో చిన్నా తలకు బలమైన గాయమైంది. దీంతో చిన్నాను కొట్టిన విద్యార్థులే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ చిన్నా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతిచెందాడు. చిన్నా తండ్రి సిద్ధనాతి రాము పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడి చేసి ముగ్గురినీ అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. వీరంతా మైనర్లు కావడంతో జువెనైల్ హోంకు తరలించనున్నట్టు పోలీసులు తెలిపారు.

## చుక్కలు చూపించిన గ్రూప్-3 పేపర్-2

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ కార్యదర్శుల నియామకాల్లో భాగంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-3 పరీక్షల్లో పేపర్-2 అభ్యర్థులకు చుక్కలు చూపించింది. పేపర్-1 కొంత పరవాలేదనిపించినా పేపర్-2లో మాత్రం ప్రశ్నలు మరీ కఠినంగా ఉన్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. గ్రూప్-3 పరీక్ష ఆదివారం రాష్ట్రంలోని 9 జిల్లాల్లో జరిగింది. మొత్తం 35,150 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 31,847 (90.6%) మంది పరీక్ష రాశారు. మరో నాలుగు జిల్లాల్లో సోమవారం పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షను పూర్తి కంప్యూటర్ బేస్డ్ తరహాలో నిర్వహించారు. ఈ పరీక్షలో గ్రామీణాభివృద్ధి ప్రశ్నలకు సంబంధించిన పథకాలపై లోతయిన ప్రశ్నలు అడిగినట్లు అభ్యర్థులు తెలిపారు. పథకాల ప్రారంభ తేదీలతో సహా అడగడం వల్ల కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు సైతం ఖంగుతిన్నారని అంటున్నారు.

## నేడు చంద్ర గ్రహణం... ఆలయాల మూత

తిరుమల/విజయవాడ/అసరవల్లి (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా సోమవారం తిరుమల శ్రీవారి ఆలయం సహా పలు ఆలయాలను మూసివేస్తున్నారు. సోమవారం రాత్రి 10.52 గంటలకు చంద్ర గ్రహణం మొదలై అర్ధరాత్రి 12.48 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సాయంత్రం 4.30 గంటలకు మూసివేస్తున్నట్లు జేఈవో తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూసివేయనున్నారు. శ్రీకాకుళం జిల్లా అసరవల్లిలోని సూర్యదేవాలయాన్ని సోమవారం రాత్రి 7 గంటల నుంచి మూసేస్తున్నారు.

## లోకం తీరు



రాఖీ కట్టడానికి వచ్చారా...అర్రెర్రె .. సారు ఇప్పుడే బయటికెళ్లారే!

### ఉష్ణోగ్రతలు

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 24.0 | 34.0 |
| హైదరాబాద్ | 24.8 | 33.2 |
| విజయవాడ | 25.2 | 36.4 |
| కర్నూలు | 25.3 | 36.0 |
| విశాఖపట్నం | 25.4 | 35.2 |
| చిత్తూరు | 27.5 | 37.5 |

## జార్ఖండ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో వుండే ఉపరితల ఆవర్తనం ఆదివారానికి జార్ఖండ్ పరిసరాల్లో కేంద్రీకృతమైంది. దీని నుంచి ఒడిశా, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉపరితలద్రోణి ఆవరించింది. వీటి ప్రభావంతో కోస్తా, తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయంతో ముగిసిన 24 గంటల్లో పలాసలో ఎనిమిది, ఇచ్ఛాపురం, దుమ్ముగూడెంలో నాలుగు, విశాఖపట్నంలో మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అనేక చోట్ల, తెలంగాణ, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



## రజనీ, కమల్... పగటి కలలు మానండి

కోట్లాదిమంది ప్రజాభిమానం కలిగిన సినీ నటుడు, అన్నాడీఎంకే వ్యవసాపకుడు ఎంజీఆర్‌లా అధికారంలోకి రావాలని తమిళ సినీనటులు కమల్‌హాసన్, రజనీకాంత్ పగటి కలలు కంటున్నారు.సినీ రంగం నుండి రాజకీయాల్లోకి వచ్చి సెయింట్‌జార్జి కోట (సచివాలయ భవనం)లో పాగా వేయాలని కలలు కంటున్న హీరోలు ముందుగా ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకోవాలి. అంతేకాని, ఉన్నపళంగా అధికారంలోకి రావాలని ఆశపడటం విడ్డూరమే.

- ఎడప్పాడి పళనిస్వామి, తమిళనాడు సీఎం



## హిందీయేతర భాషలను ప్రాంతీయ భాషలనడం తప్పు

హిందీ మినహా తెలుగు, తమిళ్, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ వంటి భాషలను ప్రాంతీయ భాషలు అనడం సరికాదు. అవి దేశంలో ప్రధాన భాషలు. అవి కూడా జాతీయ భాషలే. మన కాలేజీల్లో పారడైజ్ లాస్ట్ వంటి వాటిని బోధిస్తున్నప్పుడు.. కాళిదాస, యుధిష్ఠిర అండ్ ద్రౌపది వంటి వాటిని ఎందుకు బోధించరు. ఇటువంటివి మన సంస్కృతికి చాలా దగ్గరగా ఉంటాయి.

- ప్రముఖ కవి గుల్జార్



## చెమట పుట్టించే బయోసెన్సర్

వాషింగ్టన్, ఆగస్టు 6: రోగి భౌతికంగా ఆరోగ్యంగా లేకున్నా, చెమట రాకున్నా చెమటను పుట్టించే బయోసెన్సర్‌ను అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటి పరిశోధకులు అభివృద్ధి చేశారు. బ్యాండెయిడ్ ఆకారంలో ఉండే ఈ సెన్సర్.. చెమట పుట్టేలా స్వేద గ్రంథుల్ని ఉత్తేజపరుస్తుందట. అంతేకాదు.. సదరు వ్యక్తి ఎంత చెమటను చిందిస్తున్నాడనేదీ లెక్కకడుతుందట. వైద్యులు రోగిని పరీక్షించేందుకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు వెంటనే చెమట రావడానికే తాము ఈ బయోసెన్సర్‌ను రూపొందించామని తెలిపారు. కొన్ని రోజుల పాటు విజయవంతంగా స్వేదం వచ్చేలా ఇది ఉపయోగపడుతుందని వెల్లడించారు.



## తిరుమలేశుడి సేవలో సీఎస్

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ దర్శించుకున్నారు. ఉదయం ప్రారంభ సమయంలో మొదటి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి చేరుకుని మూలవర్లను దర్శించుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించి రంగనాయకుల మండపానికి చేరుకున్నారు. అక్కడ వేదపండితులు ఆశీర్వాదం పలకగా టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్ లడ్డూ ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు.

## తిరుపతి ప్రసాదాలకు అనకాపల్లి బెల్లం



అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీలో అనకాపల్లి బెల్లం వినియోగించనున్నారు. స్వామివారి ప్రసాదంలో ఈ బెల్లం వినియోగించాలని ఇక్కడి వ్యాపారులు టీటీడీని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇదే అంశంపై ఈ ఏడాది ఆరంభంలోనే టీటీడీ అధికారులు అనకాపల్లి మార్కెట్‌లోని వర్తకులను తిరుమల పిలిపించి సమీక్ష నిర్వహించారు. వారి సూచనల ప్రకారం పది రోజుల క్రితం మార్కెట్ యార్డులోని లక్ష్మీగణపతి ట్రేడింగ్ కంపెనీ నుంచి ఒకటో రకం బెల్లం 21 టన్నులు తిరుమలకు తరలించారు.

## మంత్రాలయంలో ఆరాధనోత్సవాలు

మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో 346వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు స్వామివారి బృందావనానికి, మూలరాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ, గోపూజ, లక్ష్మీపూజ, ధాన్య పూజ, అశ్వపూజ నిర్వహించారు. యోగీంద్ర కళాపంటపంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చారు.



## గోరటి, సుద్దాల అశోకతేజకు జాలాది పురస్కారం

- 9న అందజేయనున్న జాలాది కళాపరిషత్

సీతంపేట(విశాఖపట్నం), ఆగస్టు 6: ప్రఖ్యాత సినీకవి జాలాది పేరిట నెలకొల్పిన జాతీయ ప్రతిభా పురస్కారాలు-2017కు ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్న, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక తేజను ఎంపిక చేసినట్టు రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. జాలాది కళాపరిషత్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ డాక్టర్ జాలాది విజయ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం పురస్కారాలకు సంబంధించిన పోస్టర్‌ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక మహాకవి పేరిట సంస్థ ఏర్పాటు చేసి, ఏటా ఆయన జయంతి రోజైన ఆగస్టు 9న అవార్డులు అందజేయడం ముదావహమన్నారు. జాలాది విజయ మాట్లాడుతూ... 9వ తేదీ సాయంత్రం సిరిపురంలోని ఉడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహిం చే జాలాది పురస్కార మహోత్సవంలో సినీ నటి శారద, పలువురు సినీ, టీవీ కళాకారులకు జా లాది ఆత్మీయ సత్కారాలు అందజేస్తున్నట్టు తెలిపారు.

## గౌతమ్ సవాంగ్ పర్యవేక్షణ వద్దు

- అయేషా కేసులో సిట్‌పై నన్నపనేని

విజయవాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అయేషా మీరా కేసులో వేసిన సిట్ దర్యాప్తు పర్యవేక్షణ బాధ్యతలను విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్‌కు అప్పగించవద్దని, ఆయన స్థానంలో మహిళా అధికారిణిని నియమించాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. విజయవాడ ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ... గౌతమ్ సవాంగ్ ఈ కేసు విషయంలో మొదటి నుంచీ వివాదాస్పదంగా మాట్లాడుతున్నారన్నారు. సీఎం దృష్టికి విషయాన్ని తీసుకువెళతామని చెప్పారు. అయేషామీరా కేసులో అమాయకుడైన సత్యంబాబు జీవితాన్ని నాశనం చేశారని, అసలు దోషులెవరో తేలేంత వరకూ పోరాడతామని ఆమె అన్నారు.

# రేషన్‌కు ఈపోస్ గండం!

## తరచూ మొరాయిస్తున్న మిషన్లు.. బియ్యం పంపిణీలో తిప్పలు



అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం కోసం చౌక డిపోలకు వెళ్లేవారికి సర్వర్ చుక్కలు చూపిస్తోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఈపోస్ యంత్రాలు తరచూ మొరాయిస్తున్నాయి. ఈనెలలో 1, 2 తేదీ ల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండటంతో పంపిణీ స్వల్పంగా జరిగింది. 3, 4 తేదీల్లో పరిస్థితి కొంత మెరుగుపడినా 5న పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్‌లో సమస్యలు రావడంతో పంపిణీ సాధ్యం కాలేదు. సాధారణంగా ప్రతినెలా 5వ తేదీ నాటికే 85శాతం వరకు పంపిణీ పూర్తవుతుంది. కానీ ఆగస్టులో కేవలం 45శాతం మాత్రమే పంపిణీ జరిగింది. ప్రస్తుతం రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నందున పంపిణీ ఇంకా వేగంగా జరగాల్సి ఉంది. కానీ సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరుగుతుండటంతో కార్డుదారుల్లో అసహనం పెరుగుతోంది. పలుచోట్ల వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. డీలర్లు ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారని కార్డుదారులు ఆరోపిస్తుండగా... సర్వర్ సమస్య వల్ల కార్డుదారులతో తిట్లు తినాల్సి వస్తోందని డీలర్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ వల్లే...

ఈపోస్ మిషన్ వర్షన్‌ను అప్‌డేట్ చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. ప్రతినెలా 15 రోజుల ఖాళీ ఉంటుంది. ఆ సమయంలో కాకుండా రేషన్ పంపిణీ చేస్తున్నప్పుడే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఏముందని డీలర్లు ప్రశ్నిస్తున్నారు.

### చక్కెరపై వెనకడుగు

కేంద్రం చక్కెరపై ఇస్తున్న రాయితీని నిలిపివేయడంతో రేషన్ షాపుల్లో చెక్కెర పంపిణీ నిలిపివేశారు. ఈ రాయితీ మొత్తం రూ.290 కోట్లు భరించి కార్డుదారులకు చెక్కెర ఇవ్వాలని ప్రభుత్వం గతంలో భావించింది. కానీ, మినీ సూపర్ బజార్లపై కసరత్తు వేగవంతం కావడంతో వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. రేషన్ షాపుల్లో అన్నిరకాల నిత్యావసరాలు అందుబాటులో ఉంచి తక్కువ ధరకు పంపిణీ చేయాలనేది మినీ సూపర్ బజార్ల ఉద్దేశం. ఎలాగూ ఇందులో తక్కువ ధరలకే నిత్యావసరాలు పంపిణీ చేస్తారు కాబట్టి ఇక చెక్కెరపై ప్రత్యేకంగా రాయితీ అవసరం లేదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

## ముద్రగడను అడ్డుకున్న పోలీసులు



పోలీసులకు నమస్కారం పెడుతున్న ముద్రగడ

కిర్లంపూడి, ఆగస్టు 6: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభాన్ని ఆదివారం కూడా పోలీసులు అడ్డుకున్నారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, చొక్కాలకు నల్లరిబ్బన్లు ధరించి ముద్రగడ వస్తుండడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ... 'పాదయాత్రకు అనుమతివ్వకపోతే అరెస్టు చేయండి. ఇంట్లో మేము... బయటమీరు. రోజూ ఇదే పరిస్థితేనా?' అని పోలీసులను ప్రశ్నించారు. చంద్రబాబు పాదయాత్ర నకలు ఇప్పిస్తే అదేమాదిరి అనుమతి కోరతామని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లాలని అన్నారు. కాగా, హోంమంత్రి రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని జేఏసీ నాయకులు అన్నారు. కాపులు, మహిళలు ముద్రగడ ఇంటికి చేరుకుని కంచాలు, గరిటెలతో ఆకలికేకలు వినిపించారు. కిర్లంపూడి సెంటర్‌లో కాపు నాయకులు రోడ్డుపై బైఠాయించి అర్థనగ్న ప్రదర్శన నిర్వహించారు.



## కర్నూలులో నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్టు

- ప్రధాన నిందితుడు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు



నకిలీ స్టాంపులను చూపుతున్న ఎస్పీ

కర్నూలు, ఆగస్టు 6: నకిలీసర్టిఫికెట్ల దందాకు కర్నూలు జిల్లా ఆదోని పోలీసులు 'సంకెళ్లు' వేశారు. ముఠా నాయకుడు, ఆదోని మండలం పర్వతాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సహా 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పలు నకిలీ సర్టిఫికెట్లను, స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం ఎస్పీ గోపినాథ్ మీడియా ముందు హాజరుపరిచారు. ఈ నెల 3న వాల్మీకి రామన్న అనే వ్యక్తి కౌతాళం పోలీస్‌స్టేషన్‌లో నకిలీ సర్టిఫికెట్లపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పర్వతాపురం స్కూలు హెచ్‌ఎం శ్రీనివాసులు కర్నూలులోని తేజ డీలక్స్ లాడ్జి కేంద్రంగా ఈ సర్టిఫికెట్ల దందాను నడుపుతున్నాడు. తన ముఖ్య అనుచరుడు ఆంజనేయులు (కంప్యూటర్ ఆపరేటర్)తో కలిసి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి ఏజెంట్లను నియమించుకుని విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం ఆంజనేయులు పరారీలో ఉన్నాడు. కాగా, శ్రీనివాసులు కేడీసీసీ బ్యాంక్, మణప్పురం గోల్డ్ లోన్ సంస్థలను మోసం చేసిన కేసుల్లో జైలు శిక్ష అనుభవించి ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడు.

# వివిధ
ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక

# అలనాటి సాహిత్య మేఖల

అది 1934వ సంవత్సరం. సురవరం ప్రతాపరెడ్డి 'తెలంగాణలో కవులే లేరా?' అన్నందుకు గోలకొండ కవుల సంచికను తెచ్చిన సంవత్సరం. ఒక ప్రక్క ఆచార్య వినోబా భావే భూదానోద్యమం, మరో ప్రక్క తెలంగాణ సాయుధ పోరాట ప్రభావాలు ప్రజలను బాగా ప్రభావితం చేస్తున్న రోజులు. అలాంటి పరిస్థితులలో తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎన్నో సాంఘిక, సాహిత్య సంస్థలు వెలిశాయి. అందులో తెలంగాణలో రచనా వ్యాసంగానికి దోహదపడిన సంస్థలు రెండు: ఒకటి సాహితీ మేఖల, రెండోది సాధన సమితి. సాహితీ మేఖల 1934లో చండూరులో ఏర్పడితే, సాధన సమితి 1936లో సికింద్రాబాద్‌లో ఏర్పడింది. ఈ రెండు సంస్థలు అటు ప్రాచీన సంప్రదాయాన్నీ ఇటు ఆధునిక నవ్యతను మేళవించుకొని ఆనాటి తెలంగాణలో సంచలనం కల్గించి ఉత్తమ సాహిత్యానికి బాటలు వేశాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు కంటే ముందే తెలంగాణ ప్రాంతంలో 'సాహితీ మేఖల' అనే ఒక సాహిత్య సంస్థ ఎంతో కృషి చేసిందనడానికి చారిత్రక ఆధారాలున్నాయి. శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి శిష్యుడైన అంబటిపూడి వెంకటరత్నం శాస్త్రి గుంటూరు జిల్లా ఏదుబాడుకు చెందినవారు. బీఏ చదివి పల్నాడంతా కాలి నడకన తిరుగుతూ చివరికి నల్లగొండ జిల్లా చండూరు చేరారు. అప్పుడాయన అర్పిరాల సుబ్బరామయ్యశర్మ ఇంట్లో బస చేసి మొదటగా 'దరిద్రనారాయణ సమితి' పేరుతో ఒక సాంఘిక వ్యవస్థను ఏర్పాటు చేశారు. కుల మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యం లేకుండా సహపంక్తి భోజనాలు, హరిజనులకు విద్యాదానం, పేదలకు అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలను ఆనాటి ఎం.పి రావి నారాయణరెడ్డి సహకారంతో చేశారు. కృష్ణతత్త్వంపై ఉన్న ప్రేమతో ప్రతి శుక్రవారం 'రాధే గోవింద కృష్ణ - రాధే గోపాలకృష్ణ' అనే మంత్రాన్ని పఠిస్తూ కృష్ణ స్మరణ చేయించేవారు. జాతర ఉత్సవాలలో నిమ్న జాతులవారు పాల్గొనేటట్లు సంస్కరణ కార్యకలాపాలు చేశారు. ఇవన్నీ తెలుగు సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తే, తెలుగు భాషాభివృద్ధికి 'సాహితీ మేఖల' ఆవిర్భావం తోవ చూపింది

ఆనాడు గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి, కృష్ణా పత్రికా సంపాదకులైప ముట్నూరి కృష్ణారావు, ఆంధ్ర పత్రిక సంపాదకులైన కాశీనాధుని నాగేశ్వరరావు, ప్రజామిత్ర సంపాదకులైన గూడవల్లి రామబ్రహ్మం తదితరుల ప్రోత్సాహం వలన 'సాహితీ మేఖల' రచనల పరంపర కొనసాగింది. అప్పుడు భావ కవిత్యోద్యమ పితామహులైన రాయప్రోలు సుబ్బారావుగారి ప్రభావం అంబటిపూడిపై బలంగా పడింది. ఫలితంగా ప్రణయ వాహిని, మైనాదేవి, మొరాన్ కన్య, వత్సలుగు, వనవాటి, మధురయాత్ర, వీరాంజలి, చంద్రశాల మొదలైన కావ్యాలు ధారాపాతంగా వెలువడ్డాయి. సాహితీ మేఖల రచనలపై ప్రసిద్ధ కవులైన రాయప్రోలు, జాషువా, విశ్వనాథ, వేలూరి, మధునాపంతుల, సురవరం తదితరుల పీఠికలూ, ప్రశంసలూ ఉన్నాయి. 'సాహితీ మేఖల' కృషిని గురించి ఆచార్య కురుగంటి సీతారామయ్య తమ నవ్య సాహితీ వీధుల్లోను, దేవులపల్లి రామానుజరావు తమ సారస్వత నవనీతములోనూ, గొల్లపూడి ప్రకాశరావు తమ ప్రకాశంజిల్లా సాహిత్య ప్రకాశికలోనూ వివరించారు.

ఆంధ్రా యూనివర్సిటీవారు ఈ విధంగా ఆంగ్ల పత్రికలో ప్రశంసించారు:



అంబటిపూడి వెంకటరత్నం శాస్త్రి

"తెలువుల్లల్లియు లేని వారి వలె హృత్తేజంబు గోల్పోయి మూ
లల పన్నుండిన మా తెలుంగు కవులన్ లాలించి పాలించు త
ల్లుల తేవన్ మధురాంధ్ర కావ్య రసమున్ గ్రోలింపగా జేసి ము
ద్దుల పల్కుల్ బలికించి కుల్కెదవుగాదో సాహితీ మేఖలా"
- దేవులపల్లి రామానుజరావు

"Sahiti Mekhala deserves the gratitude of all Andhras and lovers of Telugu for publishing these sumless treasures in a little room".

'సాహితీ మేఖల'కు పట్టుగొమ్మల్లాంటి వారిలో ధవళ శ్రీనివాసరావు (కోటయ్యగూడెం), పులిజాల హనుమంతరావు (కొండాపురం), సిరిప్రెగడ భార్గవరావు (గంద్రేపల్లి), మద్దోజు సత్యనారాయణ (చండూరు), పులిజాల గోపాల్రావు (దోనిపాముల)ల కృషి ఎంతో ఉంది.

"నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని ఎలుగెత్తి చాటిచెప్పిన దాశరథి తొలి కావ్యమైన 'అగ్నిధార'ను 'సాహితీ మేఖల' ప్రచురించింది. అలాగే దేవులపల్లి రామానుజరావు 'తెలుగు దేశం', 'నెహ్రూ' రచనలు; వేలూరి వారి 'గుంటూరు కాలేజి శతావధానం' మొదలైన ఉత్తమ రచనలే కాకుండా ఈ సంస్థ సభ్యులైన సిరిప్రెగడ భార్గవరావు 'భార్గవానందలహరి'; ధవళా శ్రీనివాసరావు 'ధవళశ్రీ' కావ్యం; మద్దోజు సత్యనారాయణ 'మధుర స్మృతులు'; పులిజాల గోపాలరావు 'ఖడ్గ తిక్కన', 'తెలుగు పొలం', 'శతకమంజరి'; అంబటిపూడి నరసింహశర్మ రచించిన 'తెలుగు సిరి'; వి.వి. చలపతిరావు 'అహల్య', 'ఉన్మాది', 'కాశీవిశ్వనాథ శతకం'; చింతలపాటి వెంకట్రామశర్మ 'ధర్మపథం'; డా. రామడుగు వీరనారాయణ శర్మ 'రాగవీణ'; డా. తిరునగరి 'వానా-వాడు'; పున్న అంజయ్య 'నీలగిరి కవుల సంచిక' మొదలైన అనేక రచనలు ఈ సంస్థ పక్షాన అచ్చయ్యాయి.

'తెలుగు దేశం' గ్రంథకర్త అయిన దేవులపల్లి రామానుజరావు తన గ్రంథంలో 'సాహితీ మేఖల'ను ఇలా ప్రస్తుతించారు:

తెలువుల్లల్లియు లేని వారి వలె హృత్తేజంబు గోల్పోయి మూ
లల పన్నుండిన మా తెలుంగు కవులన్ లాలించి పాలించు త
ల్లుల తేవన్ మధురాంధ్ర కావ్య రసమున్ గ్రోలింపగా జేసి ము
ద్దుల పల్కుల్ బలికించి కుల్కెదవుగాదో సాహితీ మేఖలా

చండూరులో 1946లో మూడు రోజుల పాటు సాహితీ తిరునాళ్ళలా జరిగిన 'సాహితీ మేఖల' దశమ వార్షికోత్సవాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయి. అవి పేరుకు సాహిత్య సభలే ఐనా రాజకీయ సభల కన్నా మిన్నగా జరిగాయంటే అతిశయోక్తి కాదు. మూడు రోజుల పాటు కవి సమ్మేళనాలు, కథక సమ్మేళనాలు, చర్చా గోష్ఠులు, అవధానాలు జరిగాయి.

ఈ సభలకు అభినవ పోతన వానమామలై వరదాచార్యులు, దేవులపల్లి రామానుజరావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కాళోజీ, కాంచనపల్లి, కొప్పరపు కవులు, సత్యదుర్గేశ్వర కవులు, బిరుదురాజు రామరాజు తదితరులు హాజరయ్యారు. అంబటిపూడి అధ్యక్షతన కాళోజీకి ఘనసన్మానం జరిగింది. దాశరథి ప్రవాసంలో ఉండటం చేత ఈ సభలకు రాలేకపోయారు.

'సాహితీ మేఖల' సాహిత్యాన్ని విషయపరంగా విభజిస్తే- సాహిత్య రచనలు, సాంఘిక రచనలు, ఆధ్యాత్మిక రచనలు, ఆంగ్ల రచనలు గాను; భాషా దృష్టితో పరిశీలిస్తే- ఆంధ్ర రచనలు, సంస్కృత రచనలు, ఆంగ్ల రచనలు గాను, అనువాద రచనలుగాను విభజింపవచ్చును. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే 'శాంతి తీరాలు', 'తెలుగు సిరి కావ్యాలు' 1975లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలువడటం విశేషం.

ఈ విధంగా 'సాహితీ మేఖల' సంస్థ పుస్తక ప్రచురణల తోపాటు సారస్వత సభలు నిర్వహించి తెలంగాణలో సాహిత్యాభిరుచిని, తెలుగు భాషాభిమానమును రేకెత్తించింది. మరుగున పడిన ఈ సంస్థ సాహిత్య సంపదను భావితరాల కోసం భద్రపరచాల్సిన ఆవశ్యకత నేడెంతో ఉంది.

■ పున్న అంజయ్య
93966 10639

## ఇషికవ తకుబొకు తంకాలు కొన్ని



'ఇషికవా టకుబొకు తన లోతైన జపానీ గొంతుతో గానం చేస్తున్నాడు... "నేనొక దుఃఖభాజనుడ్ని. నేను బలహీనుడ్ని. కానీ నా చేతిలో ఒక అద్వితీయమైన భయం కరఖడ్గం ఉంది. నేను యుద్ధం చేయకపోతే దాన్ని నేను సహించలేను. కానీ నేను జయించలేకపోతున్నాను. అంటే ఇక మరణమే నాకు శరణమన్న మాట. కానీ నాకు చావంటే పరమరోత. నాకు చావడం ఇష్టం లేదు. మరి బ్రతకటం ఎలా?" '

(శేషేంద్ర 'ఆధునిక మహాభారతం', 1985)

ఇషికవ తకుబొకు (1886-1912) జపానులోని ఒక పల్లెటూళ్లో పుట్టాడు. చదువు మధ్యలోనే ఆగిపోయింది. ప్రేమించిన అమ్మాయిని పందొమ్మిదో ఏట పెళ్లి చేసుకున్నాడు. రకరకాల ఉద్యోగాలు చేశాడు. ఏ ఉద్యోగంలో స్థిరంగా ఉండలేకపోయాడు. దారిద్ర్యం, అనారోగ్యం, కాపురంలో కలతలు, తండ్రి పలాయనం, తల్లి మరణం- నానాటికి జీవితం దుర్భరమైపోయింది. ఇరవయ్యేడో ఏట క్షయతో కన్నుమూశాడు.

మొదట కాల్పనికవాది అయిన తకుబొకు తర్వాత స్వాభావికవాదిగా మారి, చివరికి సామ్యవాది అయ్యాడు. ఒక సందర్భంలో సాహిత్య సృజనని మాస్టర్బేషన్‌తో పోల్చిన తకుబొకు కవిత్వంతోపాటు కథలు, నవలలు, వ్యాసాలు, డైరీలు కూడా రాశాడు. అతని కవిత్వంలో అధిక భాగం తంకాలే. "His popularity, however, seems to depend less on his poetry than on the life that produced it"అంటాడు మకొతొ ఉయెద.

**తకుబొకు తంకాలు కొన్ని చూడండి:**

నా మిత్రులంతా నా కంటె ఉన్నతంగా కనిపించిన రోజు
ఇంటికి పువ్వుతో వచ్చి
మా ఆవిడపై ప్రేమ చూపాను

ఆమె ఒడిలో తలపెట్టుకున్నపుడు సైతం
నా ఆలోచనలన్నీ
నా గురించే

బాట పక్క కుక్క దీర్ఘంగా ఆవులించింది
దాన్ని అనుకరించాను
ఈర్ష్యతో

కళ్లు మూసుకున్నాను
మనస్సులో ఏమీ మెదలలేదు
ఒంటరితనంతో మళ్లీ కళ్లు తెరిచాను

ఒక్క క్షణం నా అస్వస్థతను మర్చిపోయి
ఎద్దులా రంకె వేయడానికి ప్రయత్నించాను
మా ఆవిడా, పాపా ఇంట్లో లేనప్పుడు

తిట్టాను,
ఏడుస్తూ నిద్రపోయింది పాప
కొద్దిగా నోరు తెరిచి నిద్రిస్తున్న తన ముఖాన్ని స్పృశించాను

**పరిచయం, అనువాదం ■ గాలి నాసరరెడ్డి**

## రెప్పల వెనుక ప్రయాణం



మూసుకున్న కనుల వెనుక
చీకటిలో వెలుగు
మూసుకున్న రెప్పల వెనుక
అంధకార విచ్ఛేదనం

రెప్పల వెనుక
విస్తరిస్తున్న వెలుగు
ఒక కాంతి ప్రయాణం

రెప్పల వెనుక నా లోలోపలికి
వెన్నెల రహదారుల మధ్య
సూర్యుడి వెచ్చటి కిరణాల మధ్య
అంతులేని గమనం

రెప్పల వెనుక
పక్షుల కళ్లలో వెలుగు
పచ్చగడ్డిపై మెరుస్తున్న
బిందువులో అనంత ప్రపంచం
రెప్పల వెనుక
ఆకుకు తగిలీ తగలని చుక్క
నాలో లేని నేను

రెప్పల వెనుక నడక
ఎప్పుడూ ప్రశాంతమే
రెప్పలు తెరిస్తే
వెలుగులో చీకటి
రెక్కలు తెగిన పక్షుల
మిన్నంటిన హాహాకార ధ్వనులు

ఝళిపిస్తున్న కరవాలాల నుంచి
రాలుతున్న నెత్తుటి చుక్కలు
పసికందుల గొంతు తొక్కిన
పాదముద్రల పదఘట్టనలు
నిస్సహాయ నినాదాల

ఉక్రోషాల వృథా ప్రేలాపనలు
నికృష్ట జీవితాల
నిరర్థక ఆరాటాలు

రెప్పల వెనుక నీవు లేవు

నీ అన్వేషణ తప్ప
నీ వెలుగులోకి
ప్రయాణం తప్ప

■ కృష్ణుడు

## ఆంతర్యం



అతడెక్కడ వున్నాడో ఎప్పుడూ వెతకలేదు
ఎవరో చెప్పారు సముద్రాల అడుగున
అగాధాల్లో తపస్సు చేస్తుంటాడని

కత్తుల అంచున నడుస్తూ
లోయల్లో దారి తప్పినప్పుడనుకుంటా ఎదురయ్యాడు
నేనంత పట్టింపుగా చూడలేదుకాని అందగాడే

నడుస్తానడుస్తా ఎప్పుడు కలిశాయో అడుగులు గమనించలేదు
అప్పుడు అడవి చాలా యిష్టంగా తోచింది
దాన్నిదాటడం పెద్దకష్టంగా అనిపించలేదు

ఆత్మదుఃఖ సౌందర్యాల్లో మునిగి మాటైనా చెప్పకుండా
కొండంచున పారుతున్న నదిలోకి పారిపోయానా
ఈతరాని నేను ఒడ్డుకెలా చిక్కానో తెలియదు కానీ

ఎప్పుడైనా అనిపిస్తది, ఎలావున్నావని ఒక్కసారైనా అడక్కపోతినని.


■ శ్రీసుధ మోదుగు
sudhamodugu@gmail.com

## చదివిన పుస్తకం

# మలయాళంలో తెలుగు కవిత (1900-1980)

మన తెలుగు సాహిత్యం ఇతర భారతీయ భాషల్లోకి అంతగా వెళ్ళడంలేదని కొందరు అంటూ వుంటారు. ఈ మాటల్లో కొంత నిజం లేకపోలేదు. సాహిత్య అకాడమి అవార్డు అందుకున్న తెలుగు రచనలన్నీ ఇతర భారతీయ భాషల్లోకీ ఆంగ్లంలోకి కూడా అనువదింపబడుతున్నాయి. అంతే కాదు వివిధ సాహిత్య సంస్థలు, అనువాదకులు కూడా తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి అనువదించి ప్రచురించడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈమధ్య కాలంలో అనువాదాల జోరు (తెలుగు నుంచి ఇతర భాషల్లోకి కూడా) బాగా పెరిగిందనే చెప్పాలి. నేనే తెలుగు నుంచి మలయాళంలోకి గురజాడ వారి కథలతో సహా 15 పుస్తకాలు అనువాదం చేసి వున్నాను. బహుశా తెలుగు నుంచి ఇతర భారతీయ భాషల్లోకి చేసిన అనువాదాల గురించి అందవలసినంత సమాచారం మనకు అందడం లేదేమోననీ అందువల్లనే మన తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి అంతగా వెళ్ళడం లేదనే మాట వచ్చిందనీ అనిపిస్తుంది నాకు. ఈ నేపథ్యంలోనే, ఈమధ్య కాలంలో నేను చదివిన ఈ తెలుగు కవితల మలయాళ అనువాదం గురించి పాఠకులకు తెలియపరచాలనుకున్నాను.

తెలుగు కవిత (1900-1980) అనే ఈ పుస్తకంలో ఎంపిక చేయబడిన 86 కవితలున్నాయి. గురజాడ అప్పారావు మొదలుకొని కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ వరకు తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధులైన వారి కవితలు ఈ పుస్తకంలో దర్శనమిస్తాయి. గురజాడ, రాయిప్రోలు, విశ్వనాథ, దేవులపల్లి , వెంకట పార్వతీశ కవులు, నాయని సుబ్బారావు, దువ్వూరి, నండూరి, పింగళి - కాటూరి, పఠాభి, జాషువా, శ్రీ శ్రీ, ఆరుద్ర, కాళోజీ ఇలా ఎందరివో చెరో రెండు కవితలున్నాయి. కరుణశ్రీ గారి రచన 'పుష్పవిలాపం' తాలూకు అనువాదం కూడా వుంది. దిగంబర కవుల కవితలు కూడా ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. సరే 1980 లోగా మంచి కవిత్వం వ్రాసి ప్రసిద్ధులైన వారి కవితలు కూడా వున్నాయి.



ఈ కవితలను మలయాళం లోకి అనువాదం చేసిన వాళ్ళు సుప్రసిద్ధ మలయాళ కవులే. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఒ.ఎన్. వి. కుర్రుప్ తో సహా, డాక్టర్ అయ్యప్ప పనికర్, పుత్తుస్సేరి రామచంద్రన్, కిలిమానూర్ మధు మొదలైన వాళ్ళు కూడా అనువాదాలు చేసారు, కానీ ఎక్కువ కవితలను అనువాదం చేసినవారు దేశమంగలం రామకృష్ణన్ అనే అలనాటి మలయాళ యువ కవి. భక్తవత్సల రెడ్డి గారితో కలిసి సంయుక్తంగా అనువాదం చేసారు దేశమంగలం.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. అనువాదం చేసిన ఏ ఒక మలయాళ కవికీ తెలుగు రాదు. కేరళ విశ్వవిద్యాలయంలో అప్పట్లో పనిచేసిన భక్తవత్సలరెడ్డిగారు తెలుగు కవితలు చదివి వివరణ ఇస్తే ఆ వివరణను బట్టి మలయాళంలో వ్రాసారు అనువాదకులు. అయినా ఎక్కువ కవితలు మూల తెలుగు కవితలకు అతి దగ్గరగా వచ్చాయి. ఒ. ఎన్. వి. కుర్రుప్ అనువాదం చేసిన శ్రీ శ్రీ కవితలు (మహాప్రస్థానం, ప్రతిజ్ఞ అనే రెండు కవితలు) నడకలో కూడా శ్రీ శ్రీ కవితలను జ్ఞప్తికి తెచ్చాయి. మూల కవితలను తెలుగులో చదివిన తరువాత ఆ కవిత తాలూకు మలయాళ అనువాదం చదివినప్పుడు నాకు గొప్ప సంతృప్తి అనిపించింది. ఒక మంచి అనువాదానికి దీనికి మించిన కొలత ఏముంది?

తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారు ఈ పుస్తకాన్ని 1991లో ప్రచురించారు. ఈ అనువాద సంకలనానికి శిల్పి అప్పటి తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు. కవితలు ఎంపిక చేసిన వారు డాక్టర్ ఎన్.గోపి గారు, డాక్టర్ జయధీర్ తిరుమలరావు గారు

బహుశా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వున్న విశ్వవిద్యాలయాలు ఈ ప్రయత్నాన్ని ఒక మాతృకగా తీసుకోవాలేమో. ఇప్పుడు తెలుగు నుంచి మలయాళంలోకే కాదు ఇతర భారతీయ భాషల్లోకి కూడా నేరుగా అనువాదం చేయగలిగే అనువాదకులు ఎందరో వున్నారు కనుక, అనువాదం కోసం 1991 లో పడినంత శ్రమ పడనక్కర లేదిప్పుడు.

మనసు అంటూ వుంటే ఎన్నో మార్గాలు!

■ ఎల్. ఆర్. స్వామి
99490 75859

### సవరణ

ఘర్‌వాపసీ కవిత (వివిధ, జూలై 27)లో ప్రస్తావించిన 'హోమ్ కమింగ్' ఎన్గూగీ వాథియాంగో నాటకం కాదు. 1972లో వచ్చిన ఆఫ్రికన్, కరేబియన్ సాహిత్యం, సంస్కృతి, రాజకీయాలపై వ్యాసాల సంపుటి. పొరబాటుకు చింతిస్తున్నాను.

- వరవరరావు

## ముడేసే ఖాళీ



ఖాళీ అయితాన్నా
నాకు తూటు పడ్డది
కారిపోతున్న
అంతకంతకు ఖాళీ అయితాన్నా

ఆకాశం ఊదిన
వేడి బుగ్గ
చల్లని బుగ్గ నా తూటును
అతుకుపెట్టాలని...

అంచుల్లేని ఆకాశం లెక్కనే
నా తూటుకు అంచుల్లేవట...

ఉరుకుతుంట
కాలంలేని కాలంలో
చీకటి బిలంలో
ఊగుతున్న ఉయ్యాలలో

అంచుల్లేని సంచిని ముడేసేదెవరు?!

■ ఆదేశ్ రవి
95055 98590

### బాల సాహిత్య రచనల పోటీ విజేతలు

తానా, మంచి పుస్తకం నిర్వహించిన బాల సాహిత్య రచనల పోటీ-2017లో ఎంపికైన విజేతలకు బహుమతి ప్రదానం, వారి పుస్తకాల ఆవిష్కరణ ఆగస్ట్ 8 సా.5.30గం.లకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నందు జరుగుతుంది. ముఖ్య అతిథి నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథి సతీష్ వేమన, 11 పుస్తకాల ఆవిష్కర్త ఎస్.ఆర్. పరిమి, అధ్యక్షులు వేదాంత సూరి, పుస్తక పరిచయం సీతారామ్, నిర్వహణ మంచి పుస్తకం సురేష్, వాసిరెడ్డి నవీన్.

- వాసిరెడ్డి నవీన్

### సాహిత్యంతో కరచాలనం

ప్రొద్దుటూరు సాహిత్య పాఠశాలలో ఆవిష్కరించిన పుస్తకాల పరిచయ సభ ఆగస్టు 13 ఉ.10గం.ల నుంచి బుక్ ఫెస్టివల్ సొసైటి హాలు, సివిల్ కోర్టుల ఎదుట, విజయవాడ - 520002 నందు జరుగుతుంది. అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ.

- విప్లవ రచయితల సంఘం

### సోమసుందర్ విగ్రహావిష్కరణ

సోమసుందర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణ ఆగస్టు 13 సా.6.30ని.లకు సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పాత బస్టాండ్ వద్ద, పిఠాపురం నందు జరుగుతుంది. విగ్రహావిష్కర్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. అధ్యక్షత కె.వెంకటరావు, ముఖ్యఅతిథి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆత్మీయ అతిథి చందుసుబ్బారావు. ప్రసంగాలు- సన్నిధానం నరసింహశర్మ, వాడ్రేవు వీరలక్ష్మీదేవి తదితరులు.

- సోమసుందర్ లిటరరీ ట్రస్ట్

### రష్యన్ జానపద కథల అనువాదం

రష్యన్ జానపద కథలకు అనిల్ బత్తుల స్వేచ్ఛానువాదం ఆవిష్కరణ సభ ఆగస్టు 19 ఉ.10.30ని.లకు ప్రెస్ క్లబ్, సోమాజిగూడ, హైదరాబాద్ నందు జరుగుతుంది. ఆవిష్కర్తలు చిన్నారి, బబ్లు. అతిథులు ఆర్టిస్టు మోహన్, కుమార్ కూనపరాజు, చైతన్య పింగళి.

- తెలుగు రీడర్స్ క్లబ్

### పద్య రచనలకు ఆహ్వానం

'అనంతపురం జిల్లా పద్య సాహిత్య వికాసం' అనే గ్రంథంలో పొందుపరచడం కోసం అనంతపురం జిల్లాలో జన్మించిన, నివసించిన పద్యకవులు వారి పద్య రచనలను ఆగస్టు 31లోగా అమళ్ళదిన్నె వేంకటరమణప్రసాద్, 3/696, సోమనాథనగర్, అనంతపురం-515004కు పంపాలి. వివరాలకు 94405 96127. ఈమెయిల్: avemrapra@gmail.com

- అమళ్ళదిన్నె వేంకట రమణప్రసాద్

### కన్యాశుల్కం నూట పాతికేళ్ళ ఉత్సవాలు

గురజాడ కన్యాశుల్కం నాటక ప్రదర్శనకు 125ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ప్రచురించనున్న సావనీర్‌కు 'కన్యాశుల్కం నాటకం-సమాజంపై ప్రభావం' విషయంపై రెండు వారాలలోపు రచనలు పంపాల్సిందిగా కోరుతున్నాం. చిరునామా: మొజాయిక్ సాహిత్యసంస్థ, ఎంఐజి-88, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, విశాఖపట్నం - 530013.

- రామతీర్థ

# ఎడ్యు యాప్స్

## లెర్నింగ్ మేడ్ ఈజీ

ఇప్పుడంతా యాప్‌ల యుగం. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, ప్రపంచాన్ని చక్కపెట్టే రోజులు వచ్చాయి. అయితే అందులో ఏవి, ఎందుకు, ఎంత మేరకు ఉపకరిస్తాయో తెలుసుకోవడం ముఖ్యం. అలాగే అవసరాలకు అనుగుణంగా వాటి వినియోగంలోనే వ్యక్తుల సత్తా బయటపడుతుంది. బ్యాంకు నుంచి నగదు లావాదేవీలు జరపడంతో మొదలు పెట్టి ప్రయాణానికి కారు బుకింగ్ వరకు నేడు యాప్‌లు అందుబాటులోకి వచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలోనే విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని యాప్‌లు వచ్చాయి. ముఖ్యంగా కింది యాప్‌లు నేటి విద్యార్థులకు చాలా ఉపయోగం.

### ఓల్ట్




ఇంగ్లీష్‌లో కష్టంగా అనిపించే పదాలను గుర్తుంచుకునేందుకు ఉపకరించే యాప్ ఇది. వీడియోలు, జిఐఎఫ్ (గ్రాఫిక్ ఇంటర్‌ఛేంజ్ ఫార్మేట్) ఇమేజెస్, స్టాటిక్ (కదలికలేని) ఇమేజెస్‌ని ఉపయోగించుకునేలా దీన్ని రూపొందించారు. ఈ యాప్ ఉంటే పదాలను గుర్తుంచుకునేందుకు పదేపదే చదవాల్సిన పని ఉండదు. ఇందులో ఉన్న టెక్నిక్స్, పిక్చర్స్, మెమరీ టిప్స్ పాటిస్తే చాలు విద్యార్థికి అన్నీ గుర్తుంటాయి. ఇదంతా మెదడులో అంతర్గతంగా జరిగే ప్రక్రియ. ఇంటర్న్‌షిప్ నుంచి ఇంటర్వ్యూల వరకు పలు విధాలుగా ఈ యాప్ ప్రయోజనకరంగా ఉందని సాక్షాత్తు ఐఐటి విద్యార్థులే చెబుతుండటం విశేషం.
https://play.google.com/store/apps/details?id=com.rrpublication.volt.volt&hl=en

### సోక్రటిక్




హోంవర్క్ ఆన్సర్స్ యాప్ ఇది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ - తెలివితేటలు ఇందులోని యంత్రాలతో కలగలుస్తాయి. మనిషి మెదడు ముఖ్యంగా నాడీవ్యవస్థను ఆధారంగా చేసుకుని రూపొందించిన యాప్ ఇది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది మనిషి మెదడును అనుకరిస్తుంది. లోతుగా నేర్చుకోవడం, తద్వారా డేటా పోగుపడి అంతిమంగా నిర్ణయం తీసుకునేందుకు అవసరమైన ప్యాటర్న్‌లను రూపొందిస్తుంది. ఒకరకంగా లోతుగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు ఉపయోగపడుతుంది. ట్యూటర్, టీచర్ మాదిరిగా వివరంగా జవాబులు రాసేందుకు వీలుగా సబ్జెక్టును ఇందులో రూపొందించారు.
https://play.google.com/store/apps/details?id=org.socratic.android&hl=en

### ఎలివేట్




కమ్యూనికేషన్, అనలిటికల్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకునేందుకు ఈ యాప్‌ను అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఉపయోగిస్తారు. ఒకాబులరీ పెంచుకోవచ్చు. వ్యాకరణ దోషాలకు ఆస్కారం ఇవ్వకుండా మెరుగైన వాక్యాలు రాసేందుకూ ఉపయోగపడుతుంది. రీడింగ్ కాంప్రహెన్షన్ స్కిల్స్ అలవడతాయి. ఇందుకు అవసరమైన కంటెంట్ రిచ్ గేమ్స్ ఇందులో ఉంటాయి. అంటే ఒకాబులరీ, ఫోకస్ అదే విధంగా సంక్షిప్తీకరణ వంటి నైపుణ్యాలను పెంచుకునేందుకు దారితీసే గేమ్స్ ఉంటాయి. కంటికి ఎదురుగా కనిపించడమే కాదు, తెలివితేటలను స్టిమ్యులేట్ చేసేందుకు తమ యాప్ ఉపకరిస్తుందని దీని సృష్టికర్త చెబుతున్నారు. ఈ యాప్‌ను వినియోగించే విద్యార్థులు కనబరిచే ప్రతిభపై వెలువరించే సమీక్షలే వారి మెరుగుదలకు దారితీస్తుంది.
https://play.google.com/store/apps/details?id=com.wonder&hl=en

### హలో ఇంగ్లీష్




ఇదో ఇంగ్లీష్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్. రీడింగ్, రైటింగ్, లిజనింగ్, స్పీకింగ్‌పై ఈ యాప్ మాడ్యూల్స్‌ను అందిస్తోంది. గేమ్స్‌తో కూడిన ఇంటరాక్టివ్ పాఠాలు ఉంటాయి. స్పీకింగ్ ప్రాక్టీసింగ్‌కు అనువైంది. తెలుగు సహా వివిధ భారతీయ భాషలకు చెందిన వ్యక్తులు ఇంగ్లీషు నేర్చుకునేందుకు అనువైన యాప్ ఇది. 18-34 మధ్య వయస్కులకు ఉపయోగపడేలా కామన్ యురోపియన్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ రిఫరెన్స్ ఆధారంగా రూపొందించారు. లెర్నర్స్ లాంగ్వేజ్ స్కిల్‌గా ఈ యాప్‌ను అభివర్ధిస్తున్నారు.
https://play.google.com/store/apps/details?id=com.CultureAlley.japanese.english&hl=en

### కహూత్




ఇదో ఫ్రీ ప్లాట్‌ఫామ్. గేమ్‌షో ఫార్మేట్‌లో రూపొందించారు. తద్వారా లెర్నింగ్ ప్రక్రియను ఫన్ ఆధారితంగా మార్చారు. టీచర్ లేదంటే విద్యార్థి ఒక గేమ్‌ను ఆరంభిస్తే, కేవలం పిన్ నంబర్ కొట్టి ఇతర విద్యార్థులూ పాల్గొనవచ్చు. పదిహేను మిలియన్ల మేర పబ్లిక్ క్విజ్‌లు ఉన్నాయంటే ఇదెంత పాపులరో అర్థం చేసుకోవచ్చు. ఒకరకంగా ఈ యాప్ గేమ్ ఆధారిత లెర్నింగ్ వేదిక. తరగతి గదిలో, బైటా దీన్ని ఉపయోగించవచ్చు. ఒకరు ఆరంభిస్తే, పలువురు అందులో చేరి ఆటను రక్తికట్టించవచ్చు, నేర్చుకోనూవచ్చు.
https://play.google.com/store/apps/details?id=no.mobitroll.kahoot.android&hl=en

# CAT ప్రిపరేషన్



పరీక్ష ఏదైనా సరే, ప్రిపరేషన్ అంటే మొదట 'గతం'లో ఏమి జరిగిందన్నది ఒకసారి తవ్వి తీయాలి. క్యాట్‌లాంటి పరీక్షల్లోనైతే ఇది మరీ అవసరం. గడచిన ఇరవై సంవత్సరాల్లో అడిగిన క్యాట్ పేపర్లను అవగాహన చేసుకుని సాల్వ్ చేయగలిగితే చాలు, విజయానికి చాలా దగ్గరకు వచ్చినట్లే. క్యాట్‌ను నిర్వహించే తేదీ, రిజిస్ట్రేషన్ వివరాలు ఇప్పటికే వెల్లడయ్యాయి. నోటిఫికేషన్‌లోని వివరాలను బట్టి టెస్ట్ ప్యాటర్న్‌లో పెద్దగా మార్పులు ఏవీ ఉన్నట్టు అనిపించడం లేదు. సమయపాలన విషయంలో మాత్రం జాగ్రత్త తప్పనిసరి. అది ఎలా మేనేజ్ చేసుకోవాలో కూడా తెలుసుకోవాలి.



**సంక్షిప్తంగా**

- టైమ్ మేనేజ్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అందుకు అనుగుణంగా అభ్యర్థులు ప్రాక్టీస్ చేయాలి.
- క్యాట్‌లో ఎలాంటి మార్పులు లేవు. పరీక్షలో విభాగాలు, సమయం తదితరాలన్నీ గత ఏడాది మాదిరిగానే ఉన్నాయి.
- వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగాల్లో సాల్వింగ్ కోసం ఒక్కోదానికి గంట సమయం కేటాయించాలి. అలా సమయాన్ని నిక్కచ్చిగా విభజించుకోవాలి.
- గడచిన రెండేళ్ళ మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అభ్యర్థులు ఆన్‌లైన్ కాలిక్యులేటర్‌ను ఉపయోగించుకోవచ్చు.
- ప్రిపరేషన్‌కు సంబంధించి గడచిన రెండు మూడేళ్ళ క్యాట్ పేపర్లకే పరిమితం కావద్దు. గడచిన ఇరవై ఏళ్ళను దృష్టిలో పెట్టుకుని ప్రిపేరైతే మంచి ప్రయోజనం పొందవచ్చు.

క్యాట్‌లో 99 శాతం పర్సంటైల్ కోసం అనువైన నైపుణ్యాలు డెవలప్ చేసుకునేందుకు ఇప్పుడు ఉన్న ఈ సమయం చక్కగా సరిపోతుంది. అలాగే గత ఏడాది అనుభవాలు తీసుకుంటే టెస్ట్ స్ట్రక్చర్, అటెంప్ట్ చేయాల్సిన సెక్షన్లు, టైమ్ లిమిట్ విషయంలో ఎలాంటి మార్పులు లేవు. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ సెక్షన్లు ఒక్కోదానికి గంట గడువు ఇచ్చారు. ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ కాలిక్యులేటర్‌ను అభ్యర్థులు ఉపయోగించుకోవచ్చు. టెస్ట్ కూడా గత ఏడాది మాదిరిగానే ఉంది. అయితే డిఫికల్టీ స్థాయిలో కొంత తేడా కనిపించవచ్చని అకడమిక్ నిపుణులు అంటున్నారు. ఇందుకుగాను మూడేళ్ళకు బదులు ఇరవై సంవత్సరాల క్యాట్ పేపర్లను పరిశీలించడం మంచిదని కూడా సలహా ఇస్తున్నారు. అడుగడుగనా ఆశ్చర్యం కలిగించేలా క్యాట్ ఉండదన్న విషయాన్ని అభ్యర్థి మొదట అర్థం చేసుకోవాలి. అందుకోసం వివిధ ప్యాటర్న్‌లు అంటే ప్రశ్నించే విధానాల్లో అభ్యాసం చేస్తే చాలు, ఆశ్చర్యాలకు గురికావాల్సిన అవసరం అస్సలు ఉండదు.

క్యాట్ నోటిఫికేషన్‌లో అడిగే ప్రశ్నల సంఖ్య లేదు. అంటే వివిధ సెక్షన్లు లేదా మొత్తంగా పరీక్షలో ఇచ్చే ప్రశ్నల సంఖ్యలో మార్పు ఉండొచ్చు. అలాగే ఒక ప్రశ్న కింద ఎన్ని ఆప్షన్స్ ఉంటాయన్నది కూడా లేదు. ఉదాహరణకు అంతకు మునుపు సంవత్సరం వెర్బల్ ఎబిలిటీ నుంచి 10, రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు అడిగారు. అదే విధంగా లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్‌ల్లో ఒక్కోదానిలో 16 ప్రశ్నలు అడిగారు. 100 ప్రశ్నల్లో 33కి అంటే మూడో వంతుకు మల్టిపుల్ ఛాయిస్‌ల్లేవు. ఈ సంఖ్య ఇంకా పెరిగినా, తగ్గినా డిఫికల్టీ లెవెల్లో ఆ మార్పు స్పష్టంగా ఉంటుంది. మూడు సబ్ టెస్ట్‌లు కలగలిసిన ఒక పూర్తి పరీక్షగా క్యాట్‌ను భావించామని గతంలో సక్సెస్ సాధించిన అభ్యర్థులు తెలిపారు. దేనికదిగా సమయం నిర్దేశించి ఉండటంతో అభ్యర్థులు ఎక్కువ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయగలిగారు. ప్రాబ్లమ్స్ ఎంపికలోనూ జాగ్రత్త తీసుకున్నారు. ఆక్యురసీ అదే సమయంలో వేగానికి ప్రాధాన్యం ఇచ్చారు. పలు అటెంప్ట్‌లకు తావివ్వని వ్యూహాన్ని అమలు చేశారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని అనుసరించి విజయం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.



క్యాట్ - 2016 మాదిరిగానే ఈ ఏడాది ఎగ్జామ్ ప్యాటర్న్ ఉంది. ఒక్కో విభాగానికి అరవై నిమిషాలు, ఆన్ స్క్రీన్ కాలిక్యులేటర్, నాన్-ఎంసిక్యు ప్రశ్నలు అన్నీ గత ఏడాదిలానే ఉన్నాయి. అయితే ఒక్కో విభాగంలో, మొత్తమ్మీద అడిగే ప్రశ్నల సంఖ్య ఎన్ని అన్నది మాత్రం స్పష్టంగా తెలియజేయలేదు.
చెప్పుకోదగ్గ మార్పులు ఏవీ లేనందున అభ్యర్థులు హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు. క్యాట్-16ను అనుసరించి ప్రిపరేషన్ వ్యూహాలను అమలు చేస్తున్నవారు వాటిని కొనసాగించవచ్చు. రానున్న నాలుగు నెలలూ మాక్ టెస్టులు రాయడం ద్వారా తమ వ్యూహాలను పాలిష్ చేసుకోవచ్చు. ప్రత్యేకించి వీక్‌గా ఉన్న ఏరియాలపై పట్టు సాధించవచ్చు.

**- రామనాథ్ కనకదండి,**
కోర్సు డైరెక్టర్, టైమ్

### నోటిఫికేషన్ వివరాలు

దేశంలోని ఇరవై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) & ఇతర మేనేజ్‌మెంట్ సంస్థల్లో ప్రవేశానికి ఉద్దేశించిన **కామన్ అడ్మిషన్ టెస్ట్** (క్యాట్) 2017కు ప్రకటన విడుదలైంది. ఎండిఐ, ఎన్ఐటిఐఇ, ఎస్‌పిజెఐఎంఆర్, ఎక్స్‌ఎల్ఆర్ఐ వంటి బిజినెస్ స్కూల్స్ క్యాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2018 డిసెంబరు 31 వరకు క్యాట్ స్కోర్‌కు వ్యాలిడిటీ ఉంటుంది. షార్ట్ లిస్ట్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరగుతుంది. నవంబరు 26న(రెండు స్లాట్లు) క్యాట్ నిర్వహిస్తారు. అక్టోబరు 18 నుంచి అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫీజు కింద రూ.1800(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.900) చెల్లించాలి. దరఖాస్తు ప్రక్రియ ఆగస్టు 9 నుంచి నుంచి ఆరంభమవుతుంది. సెప్టెంబరు 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
**వెబ్‌సైట్:** www.iimcat.ac.in

# కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన

కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కెవిపివై)- ఫెలోషిప్ అవార్డ్స్ 2017కు ప్రకటన విడుదలయింది. బేసిక్ సైన్స్ కోర్సులైన బిఎస్సీ/ బిఎస్/ బిస్టాట్/ బిమేథ్స్/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్ చదవాలనుకొనే విద్యార్థులకు, రీసెర్చ్ చేయాలనుకొనే వారి కోసం ఈ అవార్డ్సను ఉద్దేశించారు.
**ఫెలోషిప్:** నెలకు రూ.5,000 నుంచి రూ.7000 + ఏడాదికి ఒకసారి కంటిజెన్సీ గ్రాంట్ (నాలుగు నెలల ఫెలోషిప్) ఇస్తారు.
**ఎంపిక:** ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా ఆసక్తిగల విద్యార్థులు కింద తెలిపిన స్ట్రీమ్స్ ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చు

#### స్కాలర్‌షిప్

**స్ట్రీమ్ ఎస్ఏ**
**అర్హత:** 10వ తరగతి మేథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 75 శాతం మార్కులు సాధించి 11వ తరగతిలో ఎన్‌రోల్ చేసుకొని ఉండాలి. ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అర్హత పొందినవారు 12వ తరగతి సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. వీరు డిగ్రీ కోర్సుల్లో చేరిన వెంటనే ఫెలోషిప్ యాక్టివేట్ అవుతుంది

**స్ట్రీమ్ ఎస్ఎక్స్**
**అర్హత:** 10వ తరగతి మేథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 75 శాతం మార్కులు సాధించి 12వ తరగతిలో ఎన్‌రోల్ చేసుకొని ఉండాలి. ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఎంపికై 12వ తరగతి సైన్స్ సబ్జెక్ట్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు డిగ్రీలో చేరగానే ఫెలోషిప్ యాక్టివేట్ అవుతుంది.

**స్ట్రీమ్ ఎస్‌బి**
**అర్హత:** పైన తెలిపిన డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరానికి ఎన్‌రోల్ చేసుకొని ఉండాలి. 12వ తరగతి సైన్స్ సబ్జెక్ట్‌లో 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. **దరఖాస్తు ఫీజు:** రూ.1000 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500)
**కెవిపివై ఆప్టిట్యూడ్ టెస్ట్:** నవంబరు 5, 2017
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 23, 2017
**వెబ్‌సైట్:** www.kvpy.iisc.ernet.in



# ఐటి రంగంపై ఇష్టం

#### వివరాలు ఇవిగో

- **డిగ్రీ పూర్తయింది. ఎంబిఏ చదవాలా, ఎంసిఏ చదవాలా అని తేల్చుకోలేక పోతున్నాను. ఐటి రంగంవైపు వెళితే బాగుంటుందని ఆలోచన ఉంది. నాకు సలహా ఇవ్వగలరు?**
**- రమణి, నిజామాబాద్**

మీరు చెబుతున్న రెంటికీ మంచి అవకాశాలే ఉన్నాయి. రాబోయే సంవత్సరాల్లో మీ కెరీర్ ఎలా ఉండాలనుకుంటున్నారో ఆలోచించుకుని అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంత వేగంగా పెరుగుతుందో, అంతే స్థాయిలో మార్పులకు గురవుతోంది. వీటిని ఒడిసిపట్టుకోగలిగిన వ్యక్తులకు ఇది సరైన రంగం. కంప్యూటర్ టెక్నాలజీ చదివి, ఏదైనా ఐటి కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేయగలిగితే మీకు బాగా ఉపయోగపడుతుంది.
అందుకే ఐటి రంగం పట్ల ఆసక్తి ఉన్నవాళ్లకు బిటెక్‌యేతర మార్గం ఎంసిఏనే. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, డెవలపర్, సిస్టమ్ అనలిస్ట్, సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ తదితరాలుగా వీరు కెరీర్ మొదలు పెడతారు. ఎంబిఏ అనేది చాలా బ్రాడ్ డిగ్రీ. పలు రకాల బిజినెస్ ఇష్యూస్‌ను ఇది కవర్ చేస్తుంది. కార్పొరేట్, ఎంటర్‌ప్రెన్యూర్, ఎన్‌జిఓలు ఇలా పలు రకాలుగా పని చేయడానికి అవసరమైన శిక్షణ వీరికి ఉంటుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారానే ఉద్యోగాలు ఎక్కువగా వస్తాయి. అయితే పెద్ద కాలేజీల్లో చదివిన వారికే ఈ ప్లేస్‌మెంట్స్ లభిస్తాయి. ఎంబిఏ చదివి ఐటివైపు వెళ్లాలనుకుంటే ఆ కోర్సులో భాగంగా ఐటి స్పెషలైజేషన్ చేయొచ్చు. ఐటి లేదా సిస్టమ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ ఉన్నవారికి అడ్మినిస్ట్రేటివ్ సమస్యలను క్లియర్ చేయగలిగే సామర్థ్యం ఉంటుంది. వీరికి ఐటి రంగంలో అవకాశాలు ఉంటాయి.

• గోవర్ధనం కిరణ్‌కుమార్
**చిరునామా:** వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033



# గ్రూప్-1 మెయిన్స్
# రివిజన్‌లో కొన్ని జాగ్రత్తలు..!

**ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఆగస్టు 17 నుంచి 27 వరకు జరుగనున్నాయి. ఇప్పటికే అయిదు పేపర్లకు సంబంధించిన ప్రిపరేషన్‌ను అభ్యర్థులు పూర్తిచేసి ఉంటారు. కాబట్టి ఇప్పుడు కొత్త అంశాలు చదవకూడదు. చదివిన వాటినే పునశ్చరణ చేయడానికి అధిక సమయం కేటాయించాలి. మిగిలిన పది రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుందాం....**

ప్రస్తుత గ్రూప్-1లోని అయిదు పేపర్లలో మొదటిది మినహా మిగతా వాటన్నింటిలోనూ 10 మార్కుల ప్రశ్నలకే సమాధానాలు రాయాలి. అంటే అభ్యర్థులు 15 సమాధానాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి. అందుకే పరీక్ష హాలులో ఆలోచించి సమాధానాలు రాసేంత సమయం ఏమీ ఉండదని పదేపదే చెబుతుంటారు. 2, 3, 4 పేపర్లు హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించినవి. ఈ సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధిస్తే జనరల్ ఎస్సేకి ప్రత్యేకమైన ప్రిపరేషన్ అంటూ ఏమీ ఉండదు. ప్రతి సబ్జెక్టుపై అభ్యర్థి అప్‌డేషన్ తప్పనిసరి. అప్పుడే జనరల్ ఎస్సేకే కాకుండా 2, 3, 4 పేపర్లలో కూడా మెరుగైన సమాధానాలు రాయవచ్చు.

సమాధానాలు సూటిగా రాయగలిగితే అభ్యర్థులకు లాభం చేకూరుతుంది. ప్రతి రెండు ప్రశ్నల్లో ఒక దానికి సమాధానం రాసే అవకాశం 2, 3, 4, 5 పేపర్లకు ఉంటుంది. అందువల్ల ప్రశ్నల ఎంపికలో జాగ్రత్త వహించాలి. కొన్ని ప్రశ్నలకు సమాధానం ఎంత రాసినా ఇంకా ఏదో మిగిలిపోయింది అనే భావన ఏర్పడుతుంది. ఇవి చాలా విస్తృతమైన సమాచార పరిధి కలిగిన ప్రశ్నలు. కొన్ని సమాధానాలు చూడగానే ఎగ్జామినర్‌కు సంతృప్తి కలిగేలా ఉంటాయి. కాబట్టి అభ్యర్థి విజయంలో ప్రశ్నల ఎంపిక కీలకపాత్ర వహిస్తుంది. ఉదాహరణకు 2008 ప్రశ్నపత్రంలో ఇచ్చిన రెండు ప్రశ్నలను గమనించండి.

**ప్ర: 1) ద్రవ్య విధాన లక్ష్యాలు ఏమిటి? (లేదా)**

**2) బ్యాంకింగ్ రంగంపై ఆర్థిక సంస్కరణల ప్రభావం ఏమిటి?**

పై రెండు ప్రశ్నలకు సమాధానాలను అభ్యర్థి రాయగలడు. అయితే మొదటి ప్రశ్నకు సమాధానం చాలా బాగా రాయగలడు. అలాగే ఎగ్జామినర్‌ను ఎక్కువ సంతృప్తిపరిచే అవకాశమూ ఉంది. (ఏ సమాధానమైనా తమదైన శైలిలో రాయగిలిగే వారికి ఎప్పుడూ మినహాయింపు ఉంటుంది)

ఒక్కో అభ్యర్థికి ఒక్కో సబ్జెక్టుపై ప్రత్యేక అభిరుచి, నైపుణ్యం పట్టు ఉంటుంది. కాబట్టి మొదటి పేపర్‌లోని ఎస్సే రాసేటప్పుడు ఆ నైపుణ్యాన్ని నిర్మాణాత్మకంగా వినియోగించుకోగలిగితే అధిక ప్రయోజనం కలుగుతుంది. ఉదాహరణకు 2012 గ్రూప్-1 మెయిన్స్ జనరల్ ఎస్సే పేపర్‌ను పరిశీలిస్తే...

- **సెక్షన్-1లో మొదటి వ్యాసం**
  జన్‌లోక్‌పాల్ బిల్లు నేపథ్యంలో ---------- పౌర సమాజం పాత్ర.
- **సెక్షన్-2లో ఆరో వ్యాసం**
  న్యాయవ్యవస్థ క్రియాశీలత ---- కార్యనిర్వాహక విధానాల్లో న్యాయస్థానాల జోక్యం.
- **సెక్షన్-3లో 7వ వ్యాసం**
  ఏపీ పంచాయతీరాజ్ వ్యవస్థలో మార్పులు ---- ప్రజాస్వామ్య వికేంద్రీకరణ - బలహీనవర్గాల సాధికారతపై వ్యాసం.

పాలిటీ సబ్జెక్టుపై ఆసక్తి, అవగాహన ఉన్నవారు పై మూడు వ్యాసాలను సమర్థంగా రాసే అవకాశం ఉంది. నిజానికి గ్రూప్-1 మెయిన్స్‌లో పాలిటీ వెయిటేజీ 50 మార్కులే. అయితే పైన పేర్కొన్న సందర్భాల్లో ఆ సబ్జెక్టుపై పట్టు సాధించిన అభ్యర్థులు 200 మార్కుల ప్రశ్నలకు సమాధానం రాయగలరు. ఇలాంటి అదనపు ప్రయోజనం, సందర్భాన్ని అనుసరించి హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్టుల్లో కూడా ఎంతో కొంత ఉంటుంది.

మారుతున్న ప్రశ్నల సరళిని కూడా గమనించాలి. జరగబోయే గ్రూప్-1 పరీక్షలో వివాదాస్పద అంశాలకు హేతుబద్ధ పరిష్కారాలను అభ్యర్థుల నుంచి ఆశిస్తూ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఉదాహరణకు పాలిటీ విభాగంలో గోవధ నిషేధం, లౌకికతత్వం, రాష్ట్రపతి వాస్తవ కార్యనిర్వాహకునిగా ఎప్పుడు వ్యవహరిస్తారు లాంటి ప్రశ్నలు కూడా అడగవచ్చు.

విస్తృత అధ్యయనం కలిగిన అభ్యర్థులు కూడా ప్రశ్నను అర్థం చేసుకోవడంలో విఫలమైతే సమాధానంలో హేతుబద్ధత, పరిపూర్ణత లోపిస్తుంది. ఫలితంగా అభ్యర్థులు మార్కులు కోల్పోయే అవకాశం ఉంటుంది. **ఉదా:** 2008 గ్రూప్ 1 మెయిన్స్, పేపర్ -2లో హిస్టరీ విభాగంలో ఆరో ప్రశ్న

- **'శాతవాహనుల కాలంలో సాంఘిక, మత పరిస్థితులు & సాహిత్యాభివృద్ధి చర్చించండి'**

పై ప్రశ్నకు సమాధానం రాసే క్రమంలో అభ్యర్థి శాతవాహనుల కాలంలో సాంఘిక, మత పరిస్థితులు, సాహిత్యాభివృద్ధి అనే మూడు అంశాలకు సమ ప్రాధాన్యాన్నిస్తూ సమాచారాన్ని రాయాలి. అలా కాకుండా సాంఘిక, సాహిత్య అంశాలను వివరించి మత పరిస్థితులను విస్మరిస్తే పదికిగాను ఏడు మార్కుల సమాధానమే రాసినట్లవుతుంది. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థి ఎంత అద్భుత సమాధానం రాసినా కేవలం అయిదు మార్కులే పొందుతాడు. కాబట్టి గ్రూప్- 1 మెయిన్స్‌లో సమాధానాలు రాసేటప్పుడు ప్రశ్నను అర్థం చేసుకోవడంలోనే సగం విజయం లభిస్తుందన్న విషయాన్ని అభ్యర్థులు గమనించాలి.

అలాగే ఏ విభాగంలో అయినా ఎగ్జామినర్, అభ్యర్థి నుంచి ఏమి ఆశిస్తున్నాడనే విషయాన్ని ప్రశ్నలోనే వ్యక్తం చేస్తుంటారని గుర్తుపెట్టుకోవాలి.

**ఉదా:**

ప్రశ్నలు అడిగేటపుడు • చర్చించండి • వివరించండి • విశ్లేషించండి • తెలపండి • సమీక్షించండి • పరిశీలించండి • విమర్శనాత్మకంగా పరిశీలించండి • ఈ వాదనతో మీరు ఏకీభవిస్తారా • వ్యాఖ్యానించండి • మూల్యాంకనం చేయండి • కారణాలు తెలపండి • ఫలితాలు తెలపండి • అంచనా వేయండి • సమర్థించండి

ఇటువంటి పదాలను ప్రశ్నలో వాడుతుంటారు. కాబట్టి అభ్యర్థి ఆయా పదాల మధ్య తేడాను తెలుసుకొని సమాధానం రాయాలి. ఆ తేడాలను అర్థం చేసుకోలేకపోతే సమాధానంలో ప్రామాణికత దెబ్బతింటుంది. అభ్యర్థికి ఉన్న అవగాహన, పరిశీలన శక్తిపై ఎగ్జామినర్‌కు తేలిక భావం కలుగుతుంది. తరవాతి సమాధానాలపై కూడా ఆ ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

**ఉదా:**

Article - 356 is More misused then used - Comment
(2008 Group - 1 Paper II 14. a)

అనే ప్రశ్నకు అభ్యర్థి 356 విధించే ప్రక్రియతో మొదలుపెట్టి, ఎప్పుడు మొదట విధించారు, గరిష్ఠ, కనిష్ఠ విధింపులు, ఇప్పటివరకు విధించని రాష్ట్రం వంటి సమాచారాన్ని రాస్తూ వెళితే అభ్యర్థి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

సమాధానంలో ఆర్టికల్ 356 దుర్వినియోగమైన ప్రధాన సందర్భాలను ప్రస్తావించాలి. ఎస్.ఆర్ బొమ్మై కేసు - 1994లో రాష్ట్రపతి పాలన విధించదగ్గ పరిస్థితులు, విధించకూడని సందర్భాలను గురించి ఏం చెప్పారో తెలుపుతూ చివరగా అభ్యర్థి తన అభిప్రాయాన్ని రాయాలి.

ఏపీలో భూ సంస్కరణల అమలును సమీక్షించండి అనే ప్రశ్నకు సమాధానంగా భూ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను రాస్తే ఎంత సమాచారం గుప్పించినా మార్కులు పొందే అవకాశం ఉండదు. అందువల్ల అభ్యర్థులు ముందుగా ప్రశ్నను నిశితంగా ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. ప్రశ్న లక్ష్యాన్ని అర్థం చేసుకొని సమాధానం రాయాలి. సమాధానాన్ని సూటిగా సరైన విధానంలో సమగ్రంగా రాస్తే ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది.

సమాచారాన్ని బాగా గుర్తుంచుకొని తిరిగి పేపర్‌పై రాయగలిగే సామర్థ్యమున్నవారు అవకాశం, సౌలభ్యం మేరకు 'కారణాలు తెలపండి', ' ఫలితాలు తెలపండి' వంటి ప్రశ్నలను ఎంచుకొంటే మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. సృజనాత్మకత, విమర్శనాత్మక దృక్పథం ఎక్కువగా ఉన్నవారు విమర్శనాత్మక పరిశీలన, వ్యాఖ్యానం, మూల్యాంకనం వంటి ప్రశ్నలను ఎంచుకొంటే అధిక ప్రయోజనాన్ని పొందుతారు. అలాగే అభ్యర్థులు సంప్రదాయ సమాధానాలే కాక ఇటీవలి పరిణామాలపై సొంత అభిప్రాయాలను ఏర్పరచుకోవాలి. సమస్య పరిష్కార మనస్తత్వం, హేతుబద్ధ దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అలా చేస్తేనే సమాధానాలు రాసే స్థాయి పెరిగి మంచి మార్కులు సాధించవచ్చు. ప్రస్తుతం చదివిన అంశాల పునఃశ్చరణకే పరిమితమై పై జాగ్రత్తలు పాటిస్తూ ఆత్మ స్థయిర్యంతో సమాధానాలు రాస్తే విజయపథంలో తొలి మెట్టు ఎక్కినట్లే!



**వి.చైతన్యదేవ్**
సీనియర్ ఫ్యాకల్టీ

# కేస్‌లెట్
## బ్యాంక్, క్యాట్..... పరీక్షల్లో హైలైట్!

**క్యాట్, ఎక్స్‌ఏటి, ఎన్‌మ్యాట్, స్నాప్, బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్ పరీక్షల్లో 'కేస్ లెట్' తరహా ప్రశ్నలు ఇస్తున్నారు. 2017 జూన్‌లో నిర్వహించిన ఎస్‌బిఐ పీఓ మెయిన్ ఎగ్జామ్‌లో అయిదు కేస్ లెట్ డేటా ఆధారిత / డేటా ఇంటర్‌ప్రిటేషన్‌తో కూడుకున్న ప్రశ్నలు ఇచ్చారు. ఇలాంటి ప్రశ్నలు క్లిష్టమైనవి. పరీక్ష హాలులో సమయాన్ని వృథా చేసేవి. వీటిని చదవడానికే చాలా సమయం పడుతుంది. దీనిలో ఇచ్చే గణిత సమాచారం ఒకే రీతిలో ఉండదు. కొన్నిసార్లు శాతంలో, మరికొన్నిసార్లు భిన్నం (ఫ్రాక్షన్స్), ఇంకొన్నిసార్లు నిష్పత్తుల్లో ఉంటాయి. ఇలాంటి అంశాలు అభ్యర్థులను కాసేపు గందరగోళంలో పెడతాయి. బాగా ప్రాక్టీస్ ఉంటేగాని వీటి జోలికి పోకూడదని అభ్యర్థి గ్రహించాలి. వీటిని అధిగమించేందుకు కృషి చేయాలి.**



### కేస్‌లెట్ సాధనకు కొన్ని సులువైన స్టెప్స్

**స్టెప్-1:** ఇచ్చిన పేరాగ్రాఫ్‌ని క్షుణ్ణంగా చదవండి.

**స్టెప్-2:** ప్రతి డేటా పాయింట్‌ను నోట్ చేసుకోవడానికి ప్రయత్నించండి. మనుషులు, ప్రదేశాలు, వస్తువుల పేర్లు మొదలైనవి గుర్తులుగా/ సింబల్‌గా రాసుకోండి.
డేటా రాసుకునేటప్పుడు వాటి యూనిట్లను (అంటే రూపాయలు, వందలు, వేలు, లక్షలు, కోట్లు, దశాంశ స్థానాలు, భిన్నాలు, శాతాలు మొదలైనవి) జాగ్రత్తగా పరిశీలించాలి. ఇచ్చిన డేటాను కావాల్సిన రీతిలో కన్వర్ట్ చేసేటప్పుడు కొంచెం జాగ్రత్త వహించండి. సుదీర్ఘమైన లెక్కలు చేయకుండా తెలివితేటలు చూపండి. సమయపాలన కోసం చిన్న చిన్న లెక్కలు చేసుకునేట్లు చూసుకోండి.

**స్టెప్-3:** అర్థమెటిక్‌కు (సామాన్య గణితశాస్త్రానికి) సంబంధించిన (అంటే బారువడ్డీ, చక్రవడ్డీ, శాతాలు, రేషియో & ప్రపోషన్స్‌కు సంబంధించినవి) లెక్కలు జాగ్రత్తగా చేయండి.

**స్టెప్-4:** ఇలా రాసుకున్న డేటాను టేబుల్, వెన్ డయాగ్రం లేక రెంటిగానో, గ్రాఫికల్ రూపంలోకి మార్చుకోండి. అవసరమైతే చార్ట్‌ను లేక బార్‌గ్రాఫ్‌గా కూడా తీసుకోవచ్చు.

**స్టెప్-5:** పేరాగ్రాఫ్ కింద ఇచ్చిన ప్రశ్నలను ఇప్పుడు మీరు ఆన్సర్ చేయడం మొదలుపెట్టండి.

### కేస్‌లెట్ అంటే ఏమిటి?

కేస్‌లెట్ అనేది ఒక పేరాగ్రాఫ్ రూపంలో ఇచ్చిన సమాచారపు సెట్. దీనిలో డేటా కుప్పలు కుప్పలుగా డేటా మొత్తం వాక్యాల రూపంలోనే ఉంటుంది. కేస్‌లెట్‌లో టేబుల్స్, గ్రాఫ్‌లు ఇవ్వరు. మీరే పేరాగ్రాఫ్ చదువుకొని, ఇచ్చిన డేటాను టేబుల్ రూపంలో రాసుకోవాలి. డేటాను ఆర్గనైజ్ చేసుకోవాలి. పేరాగ్రాఫ్‌లో ఇచ్చిన డేటాతోనే, పేరాగ్రాఫ్ కింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఇది చూడటానికి ఒక వర్డ్ ప్రాబ్లమ్‌లా కనిపిస్తుంది. నిజానికి ఇది డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కి సంబంధించింది. ఇంగ్లీష్ కాంప్రహెన్షన్‌లా అనిపిస్తుంది. కేస్‌లెట్ ప్రాబ్లమ్స్ సాధిస్తున్నప్పుడు ఇదొక పట్టిక/ టేబుల్‌గానో, వెన్ డయాగ్రంగానో, లేక రెంటిగానో ఉంటుంది.

### కేస్‌లెట్ కోసం ఒక మాదిరి ప్రశ్న

ఒక స్కూల్‌లో 1560 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాయ్స్, గర్ల్స్ 7:5 నిష్పత్తిలో ఉన్నారు. స్టూడెంట్స్ అందరూ సింగింగ్, డ్యాన్సింగ్ అండ్ పెయింటింగ్ అనే హాబీలకు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. బాయ్స్‌లో 1/5వ వంతు మంది డ్యాన్సింగ్ క్లాసులకు పేర్లు నమోదు చేసుకున్నారు. గర్ల్స్‌లో 20% మంది కేవలం పెయింటింగ్ క్లాసులకు పేర్లు నమోదు చేసుకున్నారు. బాయ్స్‌లో 10% మంది కేవలం సింగింగ్ క్లాసులకే పేర్లు నమోదు చేసుకున్నారు. గర్ల్స్‌లో 24% మంది సింగింగ్, డ్యాన్సింగ్ క్లాసులకు, రెండిటికి కలిపి పేర్లు నమోదు చేసుకున్నారు. కేవలం సింగింగ్ క్లాసులకు పేర్లు నమోదు చేసుకున్న గర్ల్స్ సంఖ్య, సింగింగ్ క్లాసులకు పేర్లు నమోదు చేసుకున్న బాయ్స్‌కి 200% ఉంది. 1/13 బాయ్స్ సంఖ్య పిల్లలు, మొత్తం మూడు క్లాసులకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. డ్యాన్సింగ్ అండ్ సింగింగ్ క్లాసుల కోసం పేర్లు నమోదు చేసుకున్న బాయ్స్ రేషియో, డ్యాన్సింగ్ & సింగింగ్ క్లాసుల కోసం పేర్లు నమోదు చేసుకున్న గర్ల్స్ నిష్పత్తి (రేషియో) 2:1గా ఉంది. గర్ల్స్‌లో 10% కేవలం డ్యాన్సింగ్ క్లాసుల కోసమే పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ 8% గర్ల్స్ డ్యాన్సింగ్ & పెయింటింగ్ క్లాసు రెండిటికి కలిపి పేర్లు నమోదు చేసుకున్నారు. క్లాసులో మిగిలిన గర్ల్స్ అందరూ డ్యాన్సింగ్, సింగింగ్ అండ్ పెయింటింగ్ రెండింటికి కలిపి పేర్లు నమోదు చేసుకున్నారు. సింగింగ్ & డ్యాన్సింగ్ అనే రెండు క్లాసులకు కలిపి పేర్లు నమోదు చేసుకున్న బాయ్స్ సంఖ్య, ఇందుకోసమే పేర్లు నమోదు చేసుకున్న గర్ల్స్ సంఖ్యలో 50% ఉన్నారు. మిగిలిన బాయ్స్, కేవలం పెయింటింగ్ క్లాసుల కోసమే పేర్లు నమోదు చేసుకున్నారు.

**1) సింగింగ్ కోసం పేర్లు నమోదు చేసుకున్న మొత్తం గర్ల్స్ సంఖ్య, స్కూల్‌లో ఉన్న మొత్తం స్టూడెంట్స్ సంఖ్యలో సుమారు ఎంత శాతం ఉంటుంది?**
1) 37 2) 19 3) 32 4) 14 5) 26 జ: 5

**2) కేవలం పెయింటింగ్ కోసమే పేర్లు నమోదు చేసుకున్న గర్ల్స్ సంఖ్య, పెయింటింగ్ కోసమే పేర్లు నమోదు చేసుకున్న బాయ్స్ సంఖ్య ఎంత రేషియోలో ఉంది?**
1) 77:26 2) 21:73 3) 26:77 4) 73:21 5) ఏదీకాదు
జ: 3

**3) కేవలం డ్యాన్సింగ్ కోసమే పేర్లు నమోదు చేసుకున్న గర్ల్స్ సంఖ్య, అందుకోసమే పేర్లు నమోదు చేసుకున్న బాయ్స్ సంఖ్యలో ఎంత శాతంలో ఉంది?**
1) 38:67 2) 35:71 3) 41:83 4) 28:62 5) ఏదీకాదు జ: 2

**4) డ్యాన్సింగ్ కోసమే పేర్లు నమోదు చేసుకున్న మొత్తం బాయ్స్ సంఖ్య ఎంత?**
1) 318 2) 364 3) 292 4) 434 5) ఏదీకాదు జ: 4

**5) అన్ని మూడు క్లాసుల్లోనూ తమ పేర్లు నమోదు చేసుకున్న వారి మొత్తం సంఖ్య ఎంత?**
1) 135 2) 164 3) 187 4) 142 5) ఏదీకాదు జ: 1

### ఈ కేస్‌లెట్ (ప్రాబ్లమ్) సాధించడానికి నిర్దేశించుకున్న విధానం

1) మొత్తం స్కూల్ విద్యార్థుల సంఖ్య తెలిపే వాక్యాన్ని ఒక రంగుతో గుర్తించాం.
2) బాయ్స్ గురించిన సమాచారాన్ని మరో రంగుతో గుర్తించాం.
3) గర్ల్స్ గురించిన సమాచారాన్ని ఏ రంగు ఉపయోగించకుండా గుర్తించారు
4) ప్రాబ్లమ్ / ప్రశ్నలో ఉన్న రేషియో / నిష్పత్తులను సరిగా గుర్తించాం.
5) శాతం (%)లో తెలిపిన దానిని గుర్తించాం.
6) కేవలం ఒక హాబీకే తమ పేర్లను ఎవరు నమోదు చేసుకున్నారో గుర్తించాం.
7) డ్యాన్సింగ్ అండ్ సింగింగ్ కోసం. రెంటికి కలిపి ఎవరున్నారు తెలుసుకున్నాం.
8) డ్యాన్సింగ్ అండ్ పెయింటింగ్ కోసం, రెంటికి కలిపి ఎవరున్నారో తెలుసుకున్నాం.
9) భిన్నాల్లో తెలిపిన సమాచారాన్ని గమనించాం.
10) 50% అంటే 1/2 అని గుర్తించాం.

ఇచ్చిన సమాచారాన్ని ఒక నిర్దిష్ట టేబుల్ రూపంలో అమర్చాం. ప్రశ్నలో ఉన్నవి మూడు హాబీలే కనుక మూడు వృత్తాలతో కూడిన వెన్ డయాగ్రం (బొమ్మ) గీసుకొని, పై సమాచారాన్ని అందులో సరిగా నిక్షిప్తం చేశాం. గణితశాస్త్రానికి సంబంధించిన ఇలాంటి ప్రశ్నలను సులభంగా పరిష్కరించడానికి ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త జాన్ వెన్, దానితో మరొకటి ఖండించుకొనే మూడు వృత్తాల డయాగ్రం సూచించాడు. దానిని ఇక్కడ అప్లయ్ చేస్తున్నాం.

- ప్రాతూరి పోతయ్యశర్మ

## Scholarship Alert

### The Chief Minister Good Governance Fellowship Program


**Category:** National
**Description:** 42 fellowships are offered by Government of Chhattisgarh with an aim to resource high qualified and dynamic young professionals for a period of two years to work closely with the government to deliver impact on the ground at various levels and departments.
**Eligibility:** Bachelor's or master's degree holder with 60% marks holding 5 and 3 years of work experience in domain area, respectively, and proficient in MS Office can apply for the scholarship.
**Application:** Online applications only.
**Prizes & Rewards:** INR 1L to 2.5L p.m. will be awarded.
**Last Date to apply:** August 10, 2017
**Short Source URL:** http://www.b4s.in/aj/TCM0

### MIB School of Management of Trieste Italy Scholarship-2017

**Category:** International
**Description:** 20 scholarship opportunities are given by MIB Trieste School of Management, Italy to MBA degree aspirants on the basis of merit and mettle.
**Eligibility:** Graduate candidates with remarkable academic and professional experience and score attained in the selection process. Candidate must submit an essay of 500 words explaining how they are different from other applicants.
**Application:** Applications are accepted online.
**Prizes & Rewards:** 50% of MBA tuition fee will be covered under this scholarship.
**Last Date to apply:** August 15, 2017
**Short Source URL:** http://www.b4s.in/aj/MSF2


### Ila Dalmia FICA Research Grant 2017

**Category:** International
**Description:** Researchers in the field of visual arts, specifically Indian modern and contemporary arts are invited by FICA to apply for the grant that supports their research financially.
**Eligibility:** Post- graduate degree holder in humanities above 18 years old and part of an on-going research project is eligible for this grant.
**Application:** Submissions are accepted online only.
**Prizes & Rewards:** The awardee will receive a sum of INR 2L to support one independent research project.
**Last Date to apply:** August 15, 2017
**Short Source URL:** http://www.b4s.in/aj/IDF1



courtesy www.buddy4study.com

నవ్య
కుటుంబ కదంబం



రకుల్ ప్రీత్‌సింగ్.. ఇప్పుడు ఈ పేరు గురించి తెలుగులో తెలియని ప్రేక్షకుడు ఉండడేమో! 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో కథానాయికగా టాలీవుడ్‌లోకి దూసుకొచ్చిన పంజాబీ పడుచు ఇప్పుడు స్టార్ హీరోయిన్! రకుల్ ప్రీత్ సింగ్ తెలుగు బాగా మాట్లాడుతుంది. మనసులో ఏదీ దాచుకోదు.. కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె నైజం. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎం.డి వేమూరి రాధాకృష్ణ జరిపిన ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే కార్యక్రమంలో 'రకుల్' కూల్‌గా ఇండస్ట్రీ విశేషాలు, పర్సనల్ సంగతులు, పబ్- గాసిప్స్, పెళ్లి ముచ్చట్లు.. ఇలా ఎన్నో పంచుకుంది.



# కారు కొనాలని సినిమా చేశా!



**బాగా బిజీగా ఉన్నట్లున్నారు.**

ఇండస్ట్రీలోకి వచ్చినప్పటి నుంచీ బిజీగా ఉన్నా. ఇలాగే కంటిన్యూ అవ్వాలని కోరుకుంటున్నా.

**ఇప్పుడున్న కథానాయికల్లో మీరు లక్కీ పర్సన్ అనిపిస్తుందా..**

ఇప్పుడు మీరు అదృష్టం అంటున్నారు కానీ.. ఇండస్ట్రీలోకి వచ్చిన రోజుల్లో లేదు. నేను ఒకేసారి పెద్ద సినిమాతో రాలేదు. స్టెప్ బై స్టెప్ వచ్చాను. పనిలో హార్డ్‌వర్క్, డెడికేషన్ ఉంటేనే అదృష్టం కలిసొస్తుంది.

**అదేంటీ.. మీ టేకాఫ్ బావుంది కదా?**

మీరు 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చూసి మాత్రమే ఇలా అంటున్నారు. ఆ సినిమాకి ముందు నా గురించి మీకు తెలీదు కదా (నవ్వులు).

**అంటే అంతకుముందు ఏం స్ట్రగుల్ అయ్యారు..**

నేను ఫిల్మ్ బ్యాక్ గ్రౌండ్ అమ్మాయిని కాదు. ఆర్మీలో ఉండే మా నాన్న సినిమాలు చూడటానికి కూడా పంపించేవారు కాదు. అయితే చిన్నప్పుడే నాకు సినిమాల్లోకి రావాలని మైండ్‌లో మాత్రం ఉండేది. ఢిల్లీలో పద్దెనిమిదేళ్ల వయసులో మోడలింగ్ స్టార్ట్ చేశా. అపుడు సౌత్ ఇండస్ట్రీ ఉందనే విషయం తెలియదు. మొదటి ఆఫర్ కన్నడంలో వచ్చింది. స్కూల్ పాస్ చేసి.. పాకెట్ మనీ కోసం ఆ సినిమా చేశాను. అప్పుడు ఇంట్లో నెలకు నాకు రెండు వేలు పాకెట్ మనీ ఇచ్చేవారు. ఆ సినిమా చేస్తే నెలలో ఐదు లక్షలు వస్తుంది. దాంతో స్విఫ్ట్ కారు కొనొచ్చని ఆఫర్‌ను అంగీకరించాను. కన్నడ సినిమా చేసేటప్పుడు నటనపై ఇష్టం పెరిగింది. కన్నడ చిత్రం తర్వాత తెలుగు నుంచి చాలా అవకాశాలు వచ్చాయి. 'అరవై రోజులు కాల్షీట్స్ ఇవ్వటం కష్టం. మా కాలేజీ స్ట్రిక్ట్. 'సారీ సర్. పదిరోజులుండే షూటింగ్ ఉంటే చెప్పండి' అనేదాన్ని. పెద్ద హీరోయిన్ అవ్వాలనే ఆలోచనలు అస్సలు లేవు. స్పెషల్ అప్పియరెన్స్ చేయొద్దు, సెకండ్ లీడ్ చేయద్దు.. లాంటివి తెలియవు. 'కెరటం' సినిమా అవకాశం వస్తే మళ్లీ అదే చెప్పాను. అందులో సెకండ్ లీడ్ చేశాను. ఓ తమిళ మూవీలో పదిహేను రోజులుండే.. ఓ క్యారెక్టర్ చేయమన్నారు. అదీ చేశాను. అలా కన్నడ, తమిళ, తెలుగు భాషల్లో చిన్న పాత్రలు చేశాను. 'మిస్టర్ పర్‌ఫెక్ట్'లో నాలుగు రోజులు చేసి మానేశాను. ఆ తర్వాత 'ఆటోనగర్ సూర్య'లో క్యారెక్టర్ వచ్చింది. వాళ్లు సమంత డేట్స్ ఖాళీగా లేకుంటే చేయమన్నారు. అందులోనూ చేయలేకపోయా. రెండు సినిమాల నుంచి తీసేశారు కాబట్టి నాకు యాటిట్యూడ్ సమస్య అనుకున్నారు కొందరు.



**అప్పుడు మీరు అప్‌సెట్ అయ్యారా..**

అర్థం చేసుకునేంత వయసు కాదది. మిస్ ఇండియా పోటీకి వెళ్లొచ్చిన తర్వాత ముంబైకి వెళ్లాను. అక్కడ కొందరు దర్శకులు సెకండ్ ఆప్షన్‌గా నన్ను తీసుకుంటామని చెప్పేవారు. అప్పటికే నేను పొరపాట్లు చేశాననే విషయం అర్థమైంది. సరిగ్గా ఆ సమయంలోనే 'రఫ్' చిత్రంలో అవకాశమొస్తే వెంటనే సైన్ చేశా. 'రఫ్' షూటింగ్ సమయంలోనే.. జెమిని కిరణ్ సార్.. "వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రంలో చేయమ'ని అడిగారు. స్క్రీన్ టెస్ట్ చేద్దామన్నారు. చోటా నాయుడు సర్ మూడు రోజులు స్క్రీన్ టెస్ట్ చేశారు. తొలిరోజే నేను ఏడ్చేశాను. గుడి దగ్గర ఉండే పెద్ద సీన్ ఇచ్చారు. నాకు తెలుగులో ఒక్క పదం రాదు. బాగా భయపడ్డాను. కథానాయికగా ఓకే అన్నారు. మొత్తానికి ఆ చిత్రం హిట్ కావటంతో హమ్మయ్య అనుకున్నా. నా అమాయకత్వం వల్ల మంచే జరిగింది. ఆ సినిమా తర్వాత 'లౌక్యం' సినిమా చేశాను. అంతేకానీ సడెన్‌గా 'బ్రూస్‌లీ', 'నాన్నకు ప్రేమతో' లాంటి పెద్ద చిత్రాల్లో అవకాశాలు రాలేదు. స్టెప్ బై స్టెప్ కెరీర్‌లో ఎదిగాను.

**ఇండస్ట్రీలో ఉండే కాంప్లికేషన్స్ గురించి ఎవరు చెప్పారు?**

ఎక్స్‌పీరియన్స్ వల్ల తెలుసుకున్నా. టాలీవుడ్‌లోకి వచ్చాక నాకు కరెక్ట్ టైంలో 'హరి' అనే మంచి మేనేజర్ దొరికారు. అందుకే తొలి మూడు సినిమాల్లో పర్‌ఫెక్ట్‌గా నిర్ణయం తీసుకున్నా. కలిసొచ్చింది. నా విజయంలో సగం క్రెడిట్ మా మేనేజర్‌దే.

**స్టార్స్ కెరీర్‌లో మేనేజర్స్‌కు అంత ఇంపార్టెన్స్ ఉంటుందా?**

నేను షూటింగ్ చేస్తున్నా. హార్డ్‌వర్క్ చేస్తున్నా అనుకోవచ్చు. అయితే.. మేనేజర్స్ కష్టం చాలా ఉంటుంది. నా ఫ్యామిలీలో ఓ మెంబర్‌లాంటివాడే మా మేనేజర్.

**చాలామంది స్టార్స్ మేనేజర్స్ గురించి చెప్పరు కదా..**

మనం మంచి పని చేస్తున్నామంటే.. మన వెనుక పని చేసేవారు బాగా చేస్తేనే కదా. గైడెన్స్ కాకుండా నేను ఎలాంటి ప్రాజెక్ట్స్ చేయాలి. ఎలాంటి ఎండోర్స్‌మెంట్స్ చేయాలి అనేది వారు చూసుకుంటారు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' హిట్ అయ్యాక మేనేజర్ హరిగారికి రోజూ కాల్ చేసి.. 'ఏమీ ప్రాజెక్ట్స్ రాలేదా' అని అడిగేదాన్ని. 'షూటింగ్స్‌లో ఉన్నారంతా. అవకాశాలు తప్పకుండా వస్తాయి. వెయిట్ చేయండి అని కూల్‌గా' అనేవారు. రెండు, మూడు నెలల తర్వాత 'ఏదో ఒకటి చేయండి హరి గారు' అన్నాను. 'ప్లీజ్ వెయిట్ చేయండి మేడమ్' అన్నారు. ఆ తర్వాత 'లౌక్యం', 'పండగ చేస్కో', 'కరెంట్‌తీగ' చిత్రాల్లో వరుసగా సైన్ చేశాను. ఆ ఏడాదంతా అంతా బిజీ. వెంటనే హరిగారికి థ్యాంక్స్ చెప్పాను.

**ఆయన్ని ఎవరు పరిచయం చేశారు..**

మోడలింగ్ టైంలో హరిగారితో నాకు పరిచయం. ఆ తర్వాత టాలీవుడ్‌కి వచ్చాక నేనే హరిగారికి కాల్ చేశాను. మంచివ్యక్తి అనిపించింది. అప్పుడు.. నేను 'రఫ్' సినిమా చేస్తున్నా. మీరు మేనేజర్‌గా ఉంటారా.. అని అడిగాను. ఆయన సరేనన్నారు.

**మేనేజర్స్ వల్లే స్టార్స్‌కు అప్ అండ్ డౌన్స్ ఉంటాయని టాక్. ఇటీవలే కాజల్ మేనేజర్ డ్రగ్స్ కేసులో విచారణ ఎదుర్కొన్నారు కదా.. ఇలాంటివి ఉంటాయని మీకు తెలుసా..**

నిజంగా చెప్పండి.. మన పేరెంట్స్‌కి మన గురించి ఎన్ని విషయాలు తెలుసు? అలాగే మేనేజర్ లైఫ్‌లో ఏం జరుగుతోందో ఎవరికి తెలుసు. ఆరు తర్వాత ఎవరి స్నేహితులతో వారు కలుస్తారు. వారు ఏం చేస్తున్నారో చూడలేరు కదా.

**ఇండస్ట్రీమీద అవగాహన ఉందన్నమాట. 'లౌక్యం' హీరోయిన్‌కి లౌక్యం ఎక్కువ ఉందంటారు నిజమేనా..**

దాన్ని.. నేను కాంప్లిమెంట్‌గా తీసుకుంటాను. ఇండస్ట్రీలో డమ్‌గా ఉండొద్దు. స్వేచ్ఛ ఇంపార్టెన్స్ తెలిసి ఉండాలి. ఇంటెలిజన్స్ ఉండాలి. స్కిన్నీ, నెగటివిటీ, కాంపిటీషన్, స్కీమీ.. ఉంటే మన లైఫ్‌ను కాంప్లికేట్ చేసుకున్నట్లే. అందమైనది జీవితం. రేపటి గురించి తెలియనిది. అలాంటిది చిన్నపనికి ఒత్తిడి తీసుకోవటం అవసరమా. ఇది గ్లామర్ ఫీల్డ్. రేపు ఎలా ఉంటుందో ఎవరికి తెలుసు. అన్నింటినీ బ్యాలెన్స్‌గా తీసుకోవాలి. దేవుడు అవకాశం ఇచ్చాడు. మన పని చేసుకుని పోవాలంతే.

**డ్రగ్స్ విషయంలో ఇండస్ట్రీవారిపై కేసులున్నాయి... ఏమంటారు?**

దేశంలో చాలా సమస్యలున్నాయి. వాటి గురించి ఎవరూ అడ్రెస్ చేయరు. సినిమా వాళ్లు ఏం చేసినా ఆడియన్స్‌కి ఎగ్జయిట్‌మెంట్. నిజాయితీగా చెప్పాలంటే పిల్లలపేర్లు తీసుకుంటే ఎవరికీ ఇష్టం ఉండదు. యాక్టర్స్ పేరు తీసుకుంటే అది గాసిప్ అవుతుంది. ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు. అది మంచి జాబ్. వారు కరెక్ట్ చేస్తున్నారు. యంగ్ జెనరేషన్ స్మోకింగ్, డ్రింకింగ్‌కి అలవాటుపడుతోంది. చాలామంది డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. ఇలాంటివి వద్దని చెప్పటం మంచిదే. నాకు స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటు లేదు. నా పద్దెనిమిదో బర్త్‌డే రోజున మానాన్న షాంపైన్ ఓపెన్ చేశారు. ఐ యామ్ ఎ ఫిట్‌నెస్ ఫ్రీక్. నాకు సమస్య ఏంటంటే ఆల్కహాల్ ఓ సిప్ చేస్తూనే నా ఫేస్ లడ్డూలాగా అయిపోతుంది. అది నెల వరకూ పోదు. ఒక సిప్ తాగమంటే తాగనని నా ఫ్రెండ్స్ నన్ను సైకో అంటారు. సిగరెట్స్ తాగను. ఐ ఫీల్ ఇట్ నాట్ టేస్టీ. అందులో బటర్ చికెన్, నాటుకోడి, ఐస్‌క్రీమ్‌లాగా ఉంటే తీసుకోవచ్చు. ఆల్కహాల్ కంటే ఫుడ్ చాలా ఇష్టం. విషయమేంటంటే అనవసరంగా నటులను బ్లేమ్ చేస్తే ఎలా? మీకో విషయం చెప్పాలి.. నేను మోడలింగ్ ఇండస్ట్రీలో ఉన్నాను. నా చుట్టూ అన్ని రకాల అలవాట్లు ఉండేవారిని చూస్తాను. ఎవరి ఇష్టం వారిది. నాకు సంగీతం ఇష్టం. వీకెండ్స్ నా ఫ్రెండ్స్, బ్రదర్ ఉంటారు నాతో. మ్యూజిక్ ఉంటే నేను చిన్నపిల్లలా ఎగిరి గంతేస్తాను. ఓసారి పబ్‌లో డ్యాన్స్ వేస్తే ఆ వీడియో యూట్యూబ్‌లో ఉంచారు. అది చూసి చాలామంది తాగానేమో అనుకున్నారు. ఆ రోజు గ్రీన్ టీ తాగాను. పబ్‌కి వెళ్లటం తప్పు కాదు. కొంచెం తాగటం తప్పుకాదు. ఎక్కువ తాగేసి మిస్ బిహేవ్ చేయటం తప్పు. మీకు లిమిటేషన్స్ తెలియాలి. డ్రగ్స్ విషయం నేను వ్యతిరేకిస్తున్నాను. ఎక్కడ నుంచి డ్రగ్స్ వస్తున్నాయో అర్థం కాదు. పిల్లలకు ఎలా చేరతాయి? ఇది బాధాకరం. ఢిల్లీలో స్కూలింగ్ చేశాను. అక్కడ ఓ క్లాస్‌మేట్ డ్రగ్స్ మూడుసార్లు తీసుకుంది. ఆ తర్వాత బయటికి వచ్చింది.

**సినిమా ఇండస్ట్రీవాళ్లు ఇన్వాల్వ్ అయ్యారు కాబట్టి డ్రగ్స్‌కి పబ్లిసిటీ, అవేర్‌నెస్ వచ్చిందనుకుంటాను..**

సినిమావాళ్లా? కాదా? అని నేను ఆలోచించను. మంచి వ్యక్తులా, చెడ్డ వ్యక్తులా చూస్తాను. సినిమాలో ఇలాంటిది వచ్చింది కాబట్టి అంతా అలాగే ఉంటారనుకుంటే పొరబాటే. సర్కిల్‌ను బట్టే ఇలాంటి ఖర్మ వస్తుంది.

**మలయాళీలు గ్లామర్ ఫీల్డ్‌లోకి వస్తుంటారు. పంజాబీలు కూడా వస్తున్నారెందుకు..**

ఇండస్ట్రీ వెల్‌కమింగ్ చెబుతోంది (నవ్వులు). పంజాబీ అమ్మాయిని కాదు. ఇండియన్‌ను నేను. ఆర్మీకిడ్ కావటం వల్ల నార్త్ ఈస్ట్‌లో, కశ్మీర్, రాజస్థాన్‌లో ఉన్నా. ఇపుడు ఫుల్ హైదరాబాదీని.

**మీకు డ్యాన్స్ బాగా వచ్చా?**

అంటే కొరియోగ్రఫీ లేకుండా.. మ్యూజిక్ వింటూ బాగానే చేస్తాను (నవ్వులు). సడన్‌గా ఒక స్టెప్ ఇచ్చి చేయమంటే భయమేస్తుంది. రిహార్సల్స్ చేశాక బాగా చేస్తా!

> నేను తెలుగు నేర్చుకోవటానికి ట్యూటర్‌ను పెట్టుకోలేదు. నా స్టాఫ్ అంతా తెలుగులోనే మాట్లాడేవారు. తెలుగులో మాట్లాడి హిందీలో ట్రాన్స్‌లేట్ చేసేవారు. ఆ తర్వాత 'నాన్నకు ప్రేమతో' చిత్రంలో డబ్బింగ్ చెప్పుకున్నా. అలాంటి పాత్రలు వస్తే డబ్బింగ్ చెబుతాను. పల్లెటూరి పాత్రలకైతే చెప్పటం కష్టం.

**బన్నీ, చరణ్, తారక్ (ఎన్టీయార్) వీళ్లు మంచి డ్యాన్సర్స్ కదా! వాళ్లతో ఎలా చేస్తారు?**

తారక్ అయితే స్టెప్ చూడగానే ఇట్టే పట్టేస్తాడు. 'నేను రెడీ' అనేస్తాడు. 'నాకు స్టెప్స్ వచ్చే వరకు ఆయన్ను పిలవకండి' అనీ డ్యాన్స్ మాస్టర్‌తో చెప్తాను. ఆయనతో కష్టం. బన్నీ, చరణ్‌తో రిహార్సల్స్ చేస్తాను.

**ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో మీకు ఎక్కడైనా ఇబ్బంది అనిపించిందా?**

ఇప్పటి వరకు అలాంటి సందర్భం రాలేదు. డైరెక్టర్‌కు ఏం కావాలో మొదట వివరిస్తారు. ఆ ప్రకారం చేసేస్తాను. ఒకటి రెండు టేకుల్లో ఓకే అయిపోతుంది. అంతే తప్ప.. 'ఈ సీన్ నేను చేయలేకపోతున్నానే' అని బాధపడిన సందర్భాలు లేవు.

**మీ రోల్‌మోడల్ ఎవరు?**

ఎవరో ఒకరిని రోల్‌మోడల్‌గా తీసుకోను. రకరకాల వ్యక్తుల నుంచి రకరకాల విషయాలను నేర్చుకోవచ్చు. తెలుగులో చెప్పాలంటే సమంతను ఇష్టపడతాను. ఆమెది మంచి కెరీర్. 'ఈగ', 'అత్తారింటికి దారేది' వంటి మంచి సినిమాలు చేసింది. అవార్డులు గెలుచుకుంది. సోషల్ సర్వీస్‌లో ఉంది. సరైన సమయంలో పెళ్లి చేసుకుంటుంది. నేను తన దారిలో వెళ్లాలని అనుకుంటున్నా!

**మరి మీరెప్పుడు పెళ్లి చేసుకుంటున్నారు?**

చిన్నప్పటి నుంచీ అనుకున్నదే! 29-30 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకుంటాను.

**కాబోయేవాడిలో ఏం క్వాలిఫికేషన్స్ ఉండాలి?**

పొడుగ్గా ఉండాలి. నేను మూడు అంగుళాల హై హీల్స్ వేసుకున్న తర్వాత కూడా నా కన్నా పొడుగ్గా కనిపించాలి. ఇక్కడే 95 శాతం అవకాశాలు తగ్గిపోతున్నాయి (నవ్వులు). లేజీగా అస్సలు ఉండకూడదు. సినిమాలు, ఫుడ్ అంటే ఇష్టం ఉండాలి. క్యారెక్టర్ తేడా అనిపిస్తే చెప్పు తీసుకుని కొడతాను. అలాంటి వారిని హ్యాండిల్ చేయటం కష్టం.

**రియల్ లైఫ్‌లో ఎవరినైనా చెప్పుతో కొట్టారా?**

కొట్టాను. కాలేజీ టైమ్‌లో ఒకసారి కొట్టాను. ఇంకోసారి ఫోరం మాల్‌లో ఒక ఫ్రెండ్, బ్రదర్‌తో సినిమాకు వెళ్లాను. ఏదో తీసుకొని వెనక్కి తిరిగా. నా ఫేస్‌కి టచ్ అయ్యేంత దూరంలోనే ఒకతను ఉన్నాడు. సెల్ఫీ తీసుకుంటున్నాడు. మండి ఒక్కటిచ్చా. కాస్త గట్టిగానే కొట్టాను. 'ఏం చేస్తున్నావ్! మీరు అడిగితే ఫొటో ఇస్తాం కదా!' అన్నా. 'ఎప్పట్నుంచో మిమ్మల్ని ఫాలో అవుతున్నా' అన్నాడు. నాకు ఒళ్లు మండింది. 'ఫాలో చేయడం ఏంటి..' అంటూ గార్డ్స్‌ని పిలిచి.. 'థ్రో హిమ్ అవుట్. గెట్ లాస్ట్' అని చెప్పా! నాకు కోపం రాదు. వస్తే అగ్ని పర్వతం బద్దలైనట్టే. వెంటనే తగ్గిపోతుందను కోండి! ఆ సంఘటన తర్వాత సెల్ఫీలు ఇవ్వడం లేదు. నార్మల్ ఫొటో అయితే ఓకే. ఎలా తీసినా ఫొటో అదే కదా!

**సినిమా ఇండస్ట్రీలో చాలామంది గాసిప్స్ బాధితులే కదా? మీరు కూడానా?**

నాకు తెలిసినంత వరకు నా మీద పెద్దగా గాసిప్స్ లేవు. ఒకట్రెండు మనసును కష్టపెట్టాయి. నిజం ఉంటే ఓకే! చెప్పొచ్చు. గాసిప్స్ రాసేవాళ్లు.. ఎక్కడ స్క్రిప్ట్ రైటింగ్ నేర్చుకుంటారో గానీ, ఆన్‌లైన్‌లో టైమ్ వేస్ట్ చేస్తున్నారు. వీళ్లు సినిమాల్లో ట్రై చేస్తే మంచి భవిష్యత్ ఉంటుంది.

**గ్లామర్ మెయింటెయిన్ చేయడానికి ఎంత ఖర్చు చేస్తుంటారు?**

నా బిల్లులు చూపిస్తాను అప్పుడు తెలుస్తుంది (నవ్వులు). ఇట్స్ టూ హై. టైమ్ కూడా ఎక్కువే పడుతుంది. హీరోలకు ఈ సమస్యలు అంతగా ఉండవు. మేమైతే ఐబ్రోస్ దగ్గర్నుంచి అన్నీ జాగ్రత్తగా చూసుకోవాలి.

**మీ ఆదాయంలో ఓ ఇరవై శాతం ఖర్చు అవుతుందా?**

యాభై శాతం అవుతుంది. స్టాఫ్ జీతాలు, గ్లామర్, ఇతర మెయింటెనెన్స్‌కు యాభై శాతం ఖర్చు అయిపోతుంది. సినిమాలో హీరోయిన్ అందంగా కనిపించాలని అనుకుంటారు. వారికి అందంగా కనిపించాలంటే.. గ్లామర్ మెయింటెనెన్స్ కంపల్సరీ. ఎవరి కష్టాలు వారివి!!

**పారితోషికం బాగా పెంచారట కదా?**

ఇది పెద్ద రూమర్. వారికి తెలుసు ఎవరు ఎంత తీసుకుంటారో అని. హీరో, హీరోయిన్ల పారితోషికాల మధ్య చాలా గ్యాప్ ఉంది.

**అన్యాయంగా అనిపించడం లేదా?**

పురుషాధిక్య సమాజం ఇది. ఈ గ్యాప్ కొంత తగ్గాలి. ఒక ఏడాదిలో హీరో ఒక్క సినిమా చేసి.. హీరోయిన్లు రెండు మూడు సినిమాలు చేసినా.. ఈ వ్యత్యాసం తగ్గట్లేదు.

**గ్లామర్ పాత్రలు కాకుండా.. పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్‌గా ఇంతవరకూ ఏమైనా చేశారా? చేయాలని ఉందా?**

మీరు నా మూవీస్ చూశారా లేదా?

**కొన్ని చూశాను.**

'రారండోయ్..' చిత్రంలో గ్లామర్ అస్సలు లేదు. 'సరైనోడు'లో లేదు. ఇప్పుడు 'జయ జానకీ' రిలీజ్ అవుతోంది. అందులో లేదు. మనకు వచ్చిన ఆఫర్స్ నుంచి మనం ఎంచుకోవాలి. మంచి క్యారెక్టర్లు దొరికాయి.

**సమంతలా సోషల్ వర్క్ చేసే ఆలోచన ఏమైనా ఉందా?**

ఇప్పుడిప్పుడే స్టార్ట్ చేశాను. ఒక పేరు కూడా రిజిష్టర్ చేయించాను. పూర్తిస్థాయిలో మొదలుపెట్టినప్పుడు వివరాలు చెబుతాను.

**రాజమౌళి దర్శకత్వంలో చేయాలని ఉందా?**

చాలా! ఆ రోజు వస్తే.. కనీసం కథ కూడా వినకుండా ఓకే చెప్పేస్తాను.

**మరి అవకాశం కోసం అడిగారా?**

పని కోసం నేను అడగను. అడిగితేనే కదా తెలుస్తుంది అని చాలా మంది అంటారు. అప్పుడది ఆబ్లిగేషన్ అవుతుంది. ఒకవేళ సెట్ కాకపోతే.. 'నో' చెప్పడానికి వాళ్లకూ ఇబ్బందిగా అనిపిస్తుంది. అది కరెక్ట్ కాదు.

---

**ఒక** గాసిప్ మాత్రం మనసుకు బాగా కష్టం కలిగించింది. నేను ఇల్లు కొన్నప్పుడు.. 'రకుల్‌కు ఎవరో హీరో ఇల్లు కొనిచ్చాడు' అని రాశారు. అది నేను చదవలేదు. మా పేరెంట్స్ చదివారు. నాన్న నాకు ఫోన్ చేసి 'అలా ఎలా రాస్తారు' అని అన్నారు. కొత్త ఇంటికి పేపర్ వర్క్, లోన్ వర్క్ అంతా నాన్నే చూసుకున్నారు. 'నా బిడ్డ మొదటి సారి కొంటున్న ఇల్లు. అది కూడా తను కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో కొన్నది' అని ఆయనకు ఉంటుంది. నేను కోట్లలో పుట్టి పెరగలేదు. నాన్న శాలరీ మీదే మా కుటుంబం గడిచేది. అలాంటి ఓ కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి 24 ఏళ్ల వయసులో సొంతంగా ఇల్లు కొనడం గొప్ప విషయంగా చెప్పుకోవాలి. కానీ, నా వ్యక్తిత్వాన్ని కించపరిచేలా.. అలాంటి గాసిప్స్ రాయడం దారుణం. ఒకవేళ నాకు అలాంటి గిఫ్ట్ ఇచ్చే వాళ్లు ఉన్నా.. నేను గర్వంగా ఫీలవుతానే తప్ప.. దాన్ని తీసుకోను. మూడు కోట్ల విలువైన గిఫ్ట్ ఇచ్చే బాయ్‌ఫ్రెండ్ ఉంటే నేను ఎందుకింత కష్టపడాలి? ఉదయాన్నే లేవడం, జిమ్‌కి వెళ్లడం, షూటింగ్స్‌కి వెళ్లడం, ఫుడ్ రిస్ట్రిక్షన్స్ ఇవన్నీ ఎందుకు? పద్దెనిమిదేళ్లు దాటిన తర్వాత మా పేరెంట్స్ నుంచి కూడా నేను డబ్బులు తీసుకోలేదు. రక్షాబంధన్‌కు ఏం కావాలని మా బ్రదర్ అడిగినా.. 'నాకేం వద్దు. నువ్వు సేవింగ్స్ చేస్తే చాలు' అని చెప్పా!

---

> ఫిల్మ్స్, ఫుడ్, ఫిట్‌నెస్ ఇవి నా ఆసక్తులు. ఫిట్‌నెస్ అంటే మరీ ఇష్టం. అందుకే ఫిట్‌నెస్ సెంటర్స్ నిర్వహిస్తున్నాను. భవిష్యత్తులో ఒక రెస్టారెంట్ కూడా ఓపెన్ చేస్తుండొచ్చు. నా రెస్టారెంట్‌లోనే తిని.. నా జిమ్‌కే వెళ్లి వర్కవుట్లు చేస్తానేమో!

---

**'మిస్టర్** పర్‌ఫెక్ట్' చిత్రంలో చేసి ఉంటే ఇంకా కాలేజీలో చదువుతూ ఉండేదాన్నేమో. ఆ సినిమాకి అడిగినప్పుడు ప్రభాస్ ఎవరో తెలీదు, దిల్ రాజు నిర్మాత అనే విషయాలేవి నాకు తెలియవు. ఇంపార్టెన్స్ తెలీదు. ఆ సినిమా హిట్ అయ్యాక షాక్ అయ్యాను. రియలైజ్ అయ్యాను.

**ఆరుగంటల** తర్వాత నేను హీరోయిన్ అనే విషయం మర్చిపోతాను. నేను నాలాగా ఉండాలనుకుంటాను. కాఫీ హోటల్‌లో, జిమ్‌లో ఉంటాను. నాలుగేళ్ల క్రితం రకుల్‌కి ఇప్పటి రకుల్‌కి తేడా లేదు. ఐదేళ్ల తర్వాత కూడా రకుల్ మామూలుగా ఉందంటే.. అదే నా సక్సెస్.

**ఇండస్ట్రీలో** ఫ్యాషన్ డిజైనర్ నీరజ మంచి ఫ్రెండ్. సినిమాలతో సంబంధం లేని ఫ్రెండ్స్ పది మంది ఉన్నారు. పొలిటికల్ ఫ్రెండ్స్ మాత్రం లేరు. ఎందుకంటే చిన్నప్పటి నుంచి పాలిటిక్స్ అంటే భయం.

**ఇండస్ట్రీలో** లేని ఫ్రెండ్స్ ఏ సినిమా చేస్తున్నావని ఎప్పుడూ అడగరు. సినిమా డిస్కషన్స్ చేయరు. వాటికి ఇంపార్టెన్స్ ఇవ్వరు.



'అన్నయ్యే మా స్నేహితుడు, ఫిలాసఫర్, గైడ్' అని చెల్లెలు గర్వంగా చెప్పుకుంది. చిన్నతనంలో చెల్లెలకు చదువులో వచ్చే డౌట్లను తీర్చే అన్నయ్య పెద్దయ్యాక ఆమె జీవితంలో ఎదురైన సమస్యలను పరిష్కరించే మాస్టర్ కూడా.

అన్నయ్య తెచ్చిన చిన్న బహుమతి అయినా ఆ చెల్లెలికి పెద్ద గిఫ్ట్. అందుకే అన్నయ్య ప్లైటలో కాదు మంచి గిఫ్ట్-గివర్ కూడా.





# రక్షా 'బంధనం'

# చెల్లెలికి 'స్టార్' అన్నయ్యే..

# అనురాగాల రాఖీ

## సోదరుడికి సర్‌ప్రైజ్!

## సోదరి మనసు మెచ్చింది..

రాఖీ పండుగ రోజున ఏ బహుమతి ఇస్తే బాగుంటుంది? కాస్త వెరైటీగా ఉంటే బెటర్ అనిపిస్తుంది. ఈ లిస్ట్‌లో ఉన్నవి ఏమైనా ఇస్తే బాగుంటుందేమో ట్రై చేయండి.



నవ జీవనగీతం

# అన్నా..! ఈ బంధం నిలవాలి కలకాలం





సింగర్స్ స్పెషల్

# రెండు దేశాలు.. రెండు ఆశయాలు..

# మనీషా.. ఒక్కటే పీస్!



గుర్తింపు తెచ్చిన పాటలు

అరెరే ఎవ్వడిక్కడ(నేను లోకల్)

పాటలేడ నైట్ ఫీవర్ (జెంటిల్‌మన్)

పోతివే.. (ఎంతవరకూ ఈ ప్రేమ)

ఆలాలే ఆలా.. (సౌఖ్యం)

ప్రేమికా(అందగాడు)

కూల్ నైట్(షో టైమ్)



దేవిశ్రీ ప్రసాద్‌తో

● అలపాటి మధు

ఫోటో: గోపీకృష్ణ

# డైలీ సుడోకు - 146

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | | | 8 | 3 | | | 4 | |
| 4 | | 8 | 5 | | | 6 | | |
| | | | | | | 7 | 8 | |
| | | | | 2 | 6 | 8 | 5 | |
| | | | | | | | | |
| | 8 | 3 | 4 | 9 | | | | |
| | 9 | 6 | | | | | | |
| | | 1 | | | 3 | 9 | | 4 |
| | 2 | | | 5 | 7 | | | 6 |

## ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 145 సమాధానం

నేడు హయగ్రీవ జయంతి

నివేదన

# గురు స్వరూపం.. హయగ్రీవుడు!



స్పెషల్

# దూరం దగ్గరయ్యేందుకు!



● బమ్మెర

# గ్రీన్ టీతో జ్ఞాపకశక్తి...





'లై' ఆడియో వేడుక దృశ్యం

# 'లై' పెద్ద విజయం సాధించాలి

**- త్రివిక్రమ్**

"లై థియేట్రికల్ ట్రైలర్ చాలా బావుంది. సినిమా కూడా అంతే పెద్ద విజయం సాధించాలి. నాకు 14 రీల్స్ సంస్థ, ఆ నిర్మాతలంటే చాలా గౌరవం. 'లై' వారి గౌరవాన్ని పెంచుతుంది" అని త్రివిక్రమ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'లై' ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకులు త్రివిక్రమ్ ఆడియో సీడీలను, సుకుమార్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై. లిమిటెడ్ పతాకంపై హను రాఘవపూడి దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనిల్ సుంకర నిర్మిస్తున్న చిత్రం 'లై'. ఈ నెల 11న విడుదల కానుంది. నితిన్ మాట్లాడుతూ "75 రోజులు అమెరికాలో చిత్రీకరించాం. మణిశర్మగారి రీరికార్డింగ్ అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. నా మనసుకు దగ్గరైన చిత్రమిది. హనుకి సినిమా అంటే పిచ్చి. భవిష్యత్తులో మరింత గొప్ప దర్శకుడవుతాడు. ప్రస్తుతం కల్యాణ్‌గారి ప్రొడక్షన్‌లో నా 25వ సినిమా చేస్తున్నాను. ఫ్యాన్‌గా అందుకు గర్వపడుతున్నాను" అని అన్నారు. 'దిల్' చిత్రం నుంచి నితిన్‌తో తనకు సాన్నిహిత్యం ఉందని, ఈ పోస్టర్స్‌లో నితిన్ చాలా బావున్నాడని సుకుమార్ చెప్పారు. హను రాఘవపూడి మాట్లాడుతూ "ఈ కథను నాకన్నా నితిన్ ఎక్కువ నమ్మాడు. హై ఫీవర్‌లోనూ చాలా కష్టపడ్డాడు. ఈ చిత్రంలో కొత్త నితిన్‌ని చూస్తారు. సినిమా చాలా క్వాలిటీగా వచ్చింది. మణిగారి నేపథ్య సంగీతం హైలైట్ అవుతుంది. అర్జున్‌గారి పాత్ర మెప్పిస్తుంది" అని చెప్పారు. సినిమా పెద్ద హిట్ కావాలని చిత్ర యూనిట్‌తో పాటు సినీ ప్రముఖులు సంతోష్ శ్రీనివాస్, జెమిని కిరణ్, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్, నికిత, యువరాజ్, తరుణ్ ఆదర్శ్ తదితరులు అభిలషించారు.

## మిగిలేది ఒక్కడేనా!

మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'ఒక్కడు మిగిలాడు' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుంది. అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎల్టీటీఈ అధినేత ప్రభాకరన్‌గా మనోజ్ కనిపించనున్నారు. సెప్టెంబర్ 8న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాతలు ఎస్.ఎన్. రెడ్డి, లక్ష్మీకాంత్ తెలిపారు. వారు మాట్లాడుతూ "మునుపెన్నడూ భారతదేశ చలనచిత్ర చరిత్రలో చూడని సరికొత్త కథాంశాన్ని ఈ చిత్రంలో చూస్తారు. యాంగ్రీ యంగ్‌మ్యాన్‌గా మనోజ్ ఆశ్చర్యపరుస్తారు. భారత్, శ్రీలంక నేపథ్యాల్లో రెండు కాలాలలో నీటిపై నడిచే కథ ఇది. త్వరలో ట్రైలర్, పాటల్ని విడుదల చేస్తాం. నేపథ్య సంగీతాన్ని ప్రాగ్‌లో రికార్డ్ చేయనున్నాం" అని చెప్పారు. అనీషా ఆంబ్రోస్ నాయికగా నటిస్తోన్న ఈ చిత్రంలో మిళింద్ గునాజీ, పోసాని కృష్ణమురళి, సుహాసిని, సూర్య, బెనర్జీ, జెన్నిఫర్ కీలక పాత్రధారులు. శివ నందిగామ సంగీతం అందిస్తుండగా, వి. కోదండరామరాజు ఛాయాగ్రాహకుడిగా పనిచేస్తున్నారు.



మనోజ్



'నేనే రాజు నేనే మంత్రి' ప్రెస్‌మీట్‌లో భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి, సురేశ్‌బాబు

# ఒకే రోజు సినిమాలు విడుదలవడం మంచిది కాదు

**- సురేశ్‌బాబు**

"ఆగస్ట్ 11న మా సినిమాతో పాటు నితిన్ 'లై', బోయపాటి శ్రీను 'జయ జానకి నాయక' సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. థియేటర్ల విషయంలో కొన్ని సమస్యలున్నాయి. ఓ మోస్తరు సినిమాలు ఇలా ఒకే రోజున విడుదల కావడం మంచిది కాదని నా అభిప్రాయం. కానీ ఎవరూ వెనక్కి వెళ్లడం లేదు" అని చెప్పారు డి. సురేశ్‌బాబు. రానా ప్రధాన పాత్రధారిగా తేజ దర్శకత్వంలో రూపొందిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సురేశ్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సురేశ్ బాబు, ఎం.వి. కిరణ్‌రెడ్డి, భరత్‌చౌదరి కలిసి నిర్మించారు. కాజల్ అగర్వాల్, కేథరిన్ నాయికలు. ఆదివారం రామానాయుడు స్టూడియోస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సురేశ్‌బాబు మాట్లాడుతూ "ఫైనల్‌గా సినిమాని చూసుకుంటే క్లాసిక్ మూవీలా అనిపించింది. మూడు నాలుగు సన్నివేశాల్లో రానా నన్నే ఏడిపించాడు. లక్ష్యసాధనలో దారితప్పిన హీరో తన తప్పును ఎలా సరిదిద్దుకున్నాడనేదే కథ. 'నాయకుడు' తరహా కథ. నిజానికి తమిళంలో అజిత్ సినిమా ఆగస్ట్ 11న విడుదలై ఉంటే నేను ఆగస్ట్ 25న మా సినిమాను విడుదల చేసేవాడ్ని. ఆ సినిమా వెనక్కు వెళ్లింది. టెక్నికల్‌గా నేను చాలా విషయాలు నేర్చుకోవాల్సి ఉంది. విజువల్ ఎఫెక్ట్స్‌పై కూడా నాలెడ్జ్ లేదు. వెంకటేశ్ హీరోగా జంతువులపై ఓ సినిమా చేయాలనుకుంటున్నా. ఎలా చేయాలో తెలీడం లేదు." అని చెప్పారు. స్క్రిప్టు విన్నప్పుడే కచ్చితంగా మంచి సినిమా అవుతుందని నమ్మామనీ, ఈ సినిమాతో నిర్మాతలుగా మారడం సంతోషంగా ఉందనీ కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి తెలిపారు. సినిమా విడుదలకు ముందే సేఫ్ జోన్‌లో ఉన్నామన్నారు.

## పుట్టు కడల.. ఆప్పమ్!

"తొలిసారి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉండే అనుభవాన్ని ఎవరూ అంత తేలిగ్గా మర్చిపోలేరు. నేను నా స్కూల్ డేస్‌లో ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కోసం తొలిసారి కేరళ వెళ్లాను. అందుకే ఇప్పటికీ నాకు కేరళ చాలా స్పెషల్" అని చెబుతున్నారు శ్రుతీ హాసన్. ఆమె మాట్లాడుతూ "చెన్నైలో నా పాఠశాలలో నన్నెవరూ 'కమల్ హాసన్ తనయ' అనే ట్యాగ్ వేసి బుజ్జగించేవారు కాదు. కానీ కేరళ స్కూల్‌కు వెళ్లగానే 'కమల్ మోళే' అంటూ అందరూ ముద్దు చేయసాగారు. మా నాన్నను వాళ్లెంత అభిమానిస్తారో నాకు అర్థమైంది. కేరళలో చేసే ఫిష్ వెరైటీలు, పుట్టు కడల, ఆప్పమ్ ఇప్పటికీ నాకు ఇష్టమైన వంటకాలు. మా అమ్మకు కూడా కేరళ అంటే చాలా ఇష్టం. అందుకే ఐ లవ్ కేరళ" అని వివరించారు శ్రుతీ హాసన్.





శ్రుతీ హాసన్

## 'నీ కోసం నేనున్నా' అన్నారు!

**- బెల్లంకొండ శ్రీనివాస్**

"నాకు స్టార్‌డమ్ లేదు. ఫ్యాన్ బేస్ అస్సలు లేదు. సినిమా విడుదలైన శుక్రవారమే మనది. సోమవారానికి ఏం అవుతుందో చెప్పలేం. అలాంటప్పుడు ప్రేక్షకుల అభిరుచి మేరకు సినిమాలు చెయ్యాలి. అందులో అన్ని అంశాలూ ఉండాలి. ఈ సినిమా అలాగే ఉంటుంది. కంగారుగా ఏదిపడితే అది చేసేకన్నా మంచి కథతో రెండేళ్లకో సినిమా చేసుకున్నా నష్టం లేదు" అని బెల్లంకొండ శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన చిత్రం 'జయ జానకి నాయక'. మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ 'జయ జానకి నాయక' అంటే లంకలో సీతాదేవిని గెలుచుకున్న శ్రీరాముడు అని అర్థమనీ, తను ప్రేమించిన అమ్మాయి కోసం ఓ యువకుడు ఎంత వరకూ వెళ్లాడనేది చిత్ర కథ అనీ చెప్పారు. "నా పాత్ర కొత్తగా ఉంటూనే బోయపాటి స్టైల్ హీరోయిజం కనిపిస్తుంది. నా వయసుకి తగ్గ సంభాషణలు, యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. నా రెండో సినిమా బోయపాటిగారితో చెయ్యాల్సింది కానీ కథ కుదరక అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కరెక్ట్ టైమ్‌లో పర్ఫెక్ట్ కథ కుదిరింది. నా మూడో సినిమాకే ఇలాంటి కథ కుదరడం అదృష్టం అనుకోవాలి. ఈ సినిమా విషయంలో నాకు ఎలాంటి టెన్షన్ లేదు. దర్శకుడికి నాలో ఏం నచ్చిందో తెలీదు కానీ 'నీకోసం నేనున్నా.. నీతో ఇంకో సినిమా చెయ్యడానికి కూడా రెడీగా ఉన్నా' అన్నారు. ఆ భరోసా నాకు చాలా బలాన్నిచ్చింది. రకుల్ నటన ఆకట్టుకుంటుంది. ప్రగ్యా పాత్ర చాలా కీలకమైనది. కేథరిన్ ప్రత్యేక గీతంతో అలరిస్తుంది. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. నేనూ అంతే. గత చిత్రాల్లో ఏదైతే మిస్ అయ్యానో వాటిలో ఇప్పుడు పర్ఫెక్ట్ అయ్యా. ఈ సినిమా కథ పరంగా ఎమోషన్స్ క్యారీ చెయ్యడానికి కష్టపడ్డా. ఫిజిక్ కొత్తగా చూపించే ప్రయత్నం చేశా. హీరో కావాలన్నది నా కల. నా కలను నాన్న ఆయన కలగా భావించి సపోర్ట్ చేస్తున్నారు. నేను చేసే ప్రతి కథ ఆయన వింటారు. బావుంటే చెయ్యమంటారు. 'స్పీడున్నోడు' ఫెయిల్ అయిందని చాలా ఏడ్చా. ఆ సమయంలో నాన్న, నా స్నేహితులే నాకు అండగా ఉన్నారు. వచ్చే ఏడాది మా బ్యానర్‌లో సినిమాలు ప్రారంభిస్తాం. ప్రస్తుతం శ్రీవాస్ దర్శకత్వంలో చేస్తున్న సినిమా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది" అని తెలిపారు.










## 'సప్తగిరి సూపర్‌ఫాస్ట్' షురూ!

సప్తగిరి హీరోగా నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లి పతాకంపై 'సప్తగిరి సూపర్‌ఫాస్ట్' చిత్రం శనివారం అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. హర్షవర్ధన్ దర్శకుడు. నట్టి కరుణ, క్రాంతి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి ఫిల్మ్ చాంబర్ నూతన అధ్యక్షుడు జెమినీ కిరణ్ క్లాప్‌నిచ్చారు. విజయేంద్రప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "కొంతగ్యాప్ తర్వాత చేస్తున్న చిత్రమిది. విజయేంద్రప్రసాద్‌గారికి కథ వినిపించి ఆయన ఓకే అన్నాకే సినిమా ప్రారంభించా. సప్తగిరిని మరో మెట్టెక్కించే సినిమా అవుతుంది" అని అన్నారు. "నా స్టైల్ కామెడీతో రూపొందుతున్న సినిమా ఇది. నిర్మాతలుగా పరిచయమవుతున్న క్రాంతి, కరుణకు మంచి విజయం దక్కాలని ఆశిస్తున్నా" అని సప్తగిరి చెప్పారు. "నాన్న సినిమా రంగంలో ప్రోత్సహించడం ఆనందంగా ఉంది. ఇదే నెలలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది" అని నిర్మాతలు కరుణ, క్రాంతి తెలిపారు. పోసాని, నరేశ్, తనికెళ్ల భరణి, జయప్రకాశ్‌రెడ్డి షాయాజి షిండే, ప్రగతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: జొన్నాడ రమణమూర్తి.



సప్తగిరి

## 'అర్జున్'తో మంచి రిలేషన్ ఉంది

**- నాని**

"అర్జున్ అనే పేరుతో నాకు మంచి రిలేషన్ ఉంది. నా తదుపరి చిత్రం టైటిల్‌లోనూ ఆ పదం ఉంది. నా కొడుకు పేరు అర్జున్. విజయ్ దేవరకొండ నాకు బ్రదర్‌లాంటివాడు. తను నటించిన 'అర్జున్ రెడ్డి' ట్రైలర్ చాలా బావుంది. 'పెళ్లి చూపులు' టీజర్ కూడా నేనే విడుదల చేశాను. ఈ చిత్రం కూడా అంత పెద్ద విజయం సాధించాలి" అని నాని అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై శనివారం 'అర్జున్ రెడ్డి' థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. విజయ్ దేవరకొండ, షాలిని జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన చిత్రమిది. దర్శకుడు మాట్లాడుతూ "ఈ నెల 25న సినిమాను విడుదల చేస్తున్నాం. ఎమోషనల్ చిత్రమిది. డిఫరెంట్ లొకేషన్లలో చిత్రీకరించాం. అందరికీ తప్పక నచ్చుతుంది" అని చెప్పారు. "సినిమా తప్పకుండా హిట్ అవుతుందని చాలెంజ్ చేస్తున్నా. నటుడిగా సంతృప్తి చెందిన చిత్రమిది. 'బాహుబలి'ని విడుదల చేసిన నారంగ్‌గారు 'అర్జున్ రెడ్డి'ని ఎందుకు తీసుకున్నారని చాలా మంది అడిగారు. సినిమా చూస్తే జవాబు దొరుకుతుంది" అని అన్నారు. పాత ఫార్ములాని బ్రేక్ చేసి 'అర్జున్ రెడ్డి' సరికొత్త రికార్డులను కలెక్ట్ చేయాలని జెమిని కిరణ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత నారాయణ్ దాస్, షాలిని తదితరులు పాల్గొన్నారు.



విజయ్, షాలిని



## • 23న ప్రియమణి వివాహం

దక్షిణాది ప్రముఖ హీరోయిన్ ప్రియమణి వాసుదేవ అయ్యర్ వివాహానికి ముహూర్తం ఖరారయింది. ముంబైకి చెందిన ముస్తఫారాజ్‌తో ఈనెల 23న ఏడడుగులు నడిచేందుకు సిద్ధమయ్యారు. ఎలాంటి హంగామా లేకుండా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు, ఆప్తులు, స్నేహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. 24న గురువారం బెంగళూరులోని ఓ హోటల్‌లో రిసెప్షన్ జరుపదలిచారు. గత ఏడాది నిశ్చితార్థం కూడా బెంగళూరు నివాసంలో కుటుంబీకుల సమక్షంలో జరిగింది. అదే రీతిన ఆర్భాటం లేకుండా వివాహం చేసుకుంటున్నారు. కన్నడం, మళయాళం, తమిళం, తెలుగు భాషలను అనర్గళంగా మాట్లాడగల్గిన ప్రియమణి ఈ భాషలన్నింటిలోనూ నటించారు.

**- ఆంధ్రజ్యోతి, బెంగళూరు**

## మహిళల భద్రతకు ప్రాధాన్యం

- ముఖ్యమంత్రి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

అమరావతి, ఆగస్టు 6: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మమతానురాగాలకు, ప్రేమానుబంధాలకు రాఖీ పండుగ నిదర్శనమని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు, దేశవిదేశాల్లోని తెలుగువారికి రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం రక్షాకవచంలా ఉంటుందని అభయమిచ్చారు. ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం అభయహస్తం రూపొందించామని తెలిపారు.

## చేపలపాలెం కాలుష్యంపై పీసీబీ కన్ను

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

విశాఖపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలోని చేపలపాలెం గ్రామాన్ని కమ్మేస్తున్న కాలుష్యంపై పర్యావరణశాఖ అధికారులు దృష్టి సారించారు. 'వల వేస్తే.. చావు చేప' శీర్షికన ఈనెల 3న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు.. స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఇటీవల తాము అక్కడ నిర్వహించిన పరీక్షల్లో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్టు తేలడంతో నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు.

## గృహనిర్మాణంలో అగ్రగామి ఏపీ!

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు శాశ్వత గృహనిర్మాణాలను చేపట్టడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస యోజన ద్వారా గ్రామీణ, పట్టణ పేదలకు ఇళ్లు కట్టివ్వడంలో రాష్ట్రం ముందుంది. 4.20 లక్షల గృహాల నిర్మాణంతో ఏపీ మొదటి స్థానంలో ఉండగా, తమిళనాడు(3.34 లక్షలు), మధ్యప్రదేశ్ (2.86 లక్షలు), కర్ణాటక (2 లక్షలు), గుజరాత్ (1.54 లక్షలు) తర్వాత స్థానాల్లో నిలిచాయి. 2022 నాటికి దేశవ్యాప్తంగా 2కోట్ల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో ఏపీ సర్కారు మొత్తం 6.20 లక్షల గృహాల నిర్మాణానికి నిధులు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. గత రెండేళ్లలో 1.9 లక్షల గృహాల నిర్మాణానికి కేంద్రం రాష్ట్రానికి రూ.902 కోట్లు గ్రాంట్‌గా ఇచ్చింది. పీఎంఏవై పట్టణ గృహనిర్మాణ పథకం కింద ఒక్కో గృహానికి రాయితీ రూపంలో రూ.1.5 లక్షలు సమకూరుస్తుంది. లబ్ధిదారుడు రూ.50వేలు సిద్ధం చేసుకుంటే మిగిలిన మొత్తాన్ని రూ.6.5% వడ్డీతో బ్యాంకు రుణంగా సమకూరుస్తున్నారు.

## లక్ష్యానికి దూరంగా ఖరీఫ్ రుణపంపిణీ

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రుణ సదుపాయాన్ని రైతులకు అందించడంలో పలు బ్యాంకులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయి. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు రుణాలు పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం రూ.50,918.63కోట్లు వ్యవసాయ రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పంటరుణాల కింద రూ.38,736.05కోట్లు, వ్యవసాయ దీర్ఘకాల రుణాల కింద రూ.12,182.58కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు పంట రుణాల్లో 70శాతం, దీర్ఘకాల రుణాల్లో 40శాతం మాత్రమే ఇచ్చినట్లు సమాచారం. వర్షాభావంతో పంటలు వేయనందున రైతులు రుణాలు కోసం ముందుకు రావడంలేదని బ్యాంకర్లు చెప్తున్నారు.

## జగన్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు: బొత్స

కాకినాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల సభలో తమ పార్టీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నాయకులు వక్రీకరిస్తున్నారని వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ నేతలు ఉన్నవీవీ లేనివీ మాట్లాడుతూ రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

# నైరాశ్యంలో నేతన్న



## రుణమాఫీ చేసినా అందని క్లియరెన్స్ సర్టిఫికెట్లు

నేడు అంతర్జాతీయ చేనేత దినోత్సవం

- '10త్రా' రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ససేమిరా
- పని కోసం క్లస్టర్లు.. నేసిన వస్త్రాలకు మార్కెటింగ్ కరువు
- గిట్టుబాటు ధర అందని ద్రాక్షే.. జీఎస్టీతో మరింత కుదేలు
- నేటి చేనేత దినోత్సవ వేడుకలకు కార్మికులు దూరం
- సౌకర్యాలు కల్పించకుండా పండుగలా?: హ్యాండ్‌లూమ్ బోర్డు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని ఆగ్రహం

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో చేనేత రంగం కొన్నేళ్లుగా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. చాలీచాలని ఆదాయంతో ఈ వృత్తిలో కొనసాగలేక.. మరో మార్గం కనిపించక చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడిన ఘటనలు కోకొల్లలు. ఇటీవల కేంద్రం వెల్లడించిన గణాంకాల ప్రకారం.. దేశంలో తలసరి ఆదాయం రూ.1.25 లక్షల నుంచి రూ.1.30లక్షల



వరకూ చేరింది. కానీ, చేనేత కార్మికుడి ఆదాయం మాత్రం అందులో నాలుగోవంతే ఉంది. చేనేత కార్మికుడి ఏడాది ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.31 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.29 వేలు మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లో చేనేత కార్మికుల ఆదాయం పెంచే విధాన నిర్ణయాలు తీసుకోకుండా, జీఎస్టీ భారం మోపి రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు పండుగలు నిర్వహిస్తామనడం విడ్డూరంగా ఉందని చేనేత కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సోమవారం (ఆగస్టు 7న) అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వేడుకలు, సదస్సులను నేత కార్మికులు బహిష్కరిస్తున్నట్లు జాతీయ హ్యాండ్లూమ్ బోర్డు సభ్యుడు కేఏఎన్ మూర్తి తెలిపారు. వృత్తి పని కోసం క్లస్టర్లు, కష్టపడి నేసిన వస్త్రానికి మార్కెటింగ్ కల్పించాలని ఎన్ని సార్లు కోరినా పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు చేనేత పండుగలు నిర్వహించడం వల్ల ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. కనీసం మగ్గాలు కొనుగోలుకు రుణాలు కూడా అందించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగస్టు 7న మాత్రమే చేనేత రంగం ఒకటుందని గుర్తుకురావడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సవతి తల్లి ప్రేమను నిరసిస్తూ చేనేత సంఘాల నేతలు, హ్యాండ్‌లూబ్ బోర్డు సభ్యులు సోమవారం నాటి కార్యక్రమాలను బహిష్కస్తున్నట్లు కేఏఎన్ మూర్తి.. హ్యాండ్లూమ్స్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చారు. దేశవ్యాప్తంగా సోమవారం నిర్వహించబోతున్న చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత పరిశ్రమ స్థితిగతుల వైపు ఓ సారి చూస్తే పలు సమస్యలు కనిపిస్తాయి. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగం కొన్నేళ్లుగా కునారిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 1.75 లక్షల చేనేత మగ్గాలుండగా, తెలంగాణలో 35 వేల వరకూ ఉన్నాయి. అనంతపురం లాంటి కరువు జిల్లాల్లో దేశంలో ఏ జిల్లాలో లేనంత అత్యధికంగా 78 వేల మగ్గాలున్నాయి. కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోనూ చేనేత అధిక సంఖ్యలో మగ్గాలున్నాయి. అయితే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు రుణమాఫీ చేసి బలవన్మరణాలకు అడ్డుకట్ట వేసింది. దీంతో తమ బతుకు తాము బతుకుతామని, వృత్తి పని చేసుకోవడానికి క్లస్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించారు. రాష్ట్రంలో కనీసం 100కు పైగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తేనే కార్మికులకు ఇబ్బందులు తొలగుతాయి. కానీ రాష్ట్ర అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపలేదని.. కేంద్రం కేవలం 11 క్లస్టర్లు మాత్రమే 2016-17 ఆర్థిక సంవత్సరానికి మంజూరు చేసింది. ఇక చేనేత కార్మికుడికి ప్రధాన జీవనాధారమైన మగ్గాన్ని సొంతంగా ఏర్పాటు చేసుకోవాలంటే రూ.1 లక్ష వరకు అవసరమవుతోంది. వర్కింగ్ కేపిటల్ చేర్చితే రూ.2 లక్షల వరకూ కావాలి. ప్రధానమంత్రి 'ముద్ర' లోన్లు ఏటా 6శాతం వడ్డీతో రూ.2లక్షల వరకూ ఇస్తామని కేంద్రం ప్రకటించినా బ్యాంకర్లు మాత్రం ఇవ్వడంలేదు. ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం మేరకు 14.5 శాతం లోన్లు మాత్రమే బ్యాంకర్లు ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీకి సంబంధించి క్లియరెన్స్ సర్టిఫికెట్ (నో డ్యూ) ఇస్తేనే రుణాలిస్తామని చెబుతున్నారు. దాని కోసం ప్రయత్నిస్తే ప్రభుత్వం అసలు మాత్రమే చెల్లించిందని, వడ్డీ ఇంకా బ్యాంకుల్లో పూర్తిగా జమకాలేదని సమాధానం వస్తోంది.

### ప్రధాన సమస్య మార్కెటింగ్

చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పడమే తప్ప ఆచరణలో ఎక్కడా సాధ్యం కావడంలేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో రూ.3500 కోట్ల విలువైన చేనేత వస్త్రాలు తయారవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే అందులో ఆప్కో ద్వారా విక్రయిస్తుది ఏటా రూ.300 కోట్లే విలువైన వస్త్రాలే. కో ఆపరేటివ్ సొసైటీల నుంచి వచ్చే ఉత్పత్తులు మాత్రమే ఆప్కో కొనుగోలు చేస్తుంది. మార్కెట్‌లో ఉత్పత్తయ్యే మొత్తం వస్త్రాల్లో ఆప్కో కొనుగోలు కేవలం 9శాతం మాత్రమే. మిగిలిన 91శాతం ఎక్కడ విక్రయించాలనేది కార్మికులకే దిక్కుతోచడంలేదు. ఫలితంగా ఆదాయం రాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకిచ్చే యూనిఫామ్, ఇతర అవసరాలకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని అడిగినా ఫలితం లేదు. కమీషన్ల కోసం ఆశపడి పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేస్తున్నారు. చేనేత మగ్గాలపై వస్త్ర ఉత్పత్తి ఆలస్యమే ఇందుకు కారణమని చెబుతున్నారు. చేనేత బజార్లు ఏర్పాటు, ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఒప్పందం అని చేనేత జౌళిశాఖ చెబుతున్నా అవన్నీ మాటలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణలోకి రావడంలేదు.

### హ్యాండ్లూమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జాతీయ స్థాయిలో నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నా కేవలం నూలు మాత్రమే అందిస్తోంది తప్ప మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం లేదు. దీన్ని నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌గా మార్చి రూ.5వేల కోట్లు నిధులు కేటాయించాలని కేఏఎన్ మూర్తి నేతృత్వంలో హ్యాండ్లూమ్ బోర్డు సభ్యుల బృందం పలుమార్లు కేంద్రానికి విన్నవించినా ఫలితం కనిపించడంలేదు. రాష్ట్ర స్థాయిలో ఏపీ హ్యాండ్లూమ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కావాలని మన చేనేత కార్మికులు కోరుతున్నారు. కాపు ఇతర కార్పొరేషన్లకు ఇచ్చిన విధంగా నిధులు కేటాయించి సహకార రంగంతోపాటు అందులో లేని కార్మికులకు కూడా మూలధనం ఇవ్వాలనేది ప్రధాన డిమాండ్. 'ఆ డబ్బు తిరిగి సరిగా చెల్లించరని అనుమానం ఉంటే పది మంది సభ్యులకు దాటకుండా హ్యాండ్లూమ్ వీవర్స్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి గ్రూపునకు లోన్లు ఇవ్వాలి. ఏ ఒక్కరు చెల్లించకున్నా మిగతా తొమ్మిది మంది బాధ్యత తీసుకునేలా రుణం ఇచ్చేముందు ఒప్పందం చేసుకున్నా సమ్మతమే' అని కార్మికులు చెబుతున్నారు. ఇలా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 100 నుంచి 200 సంఘాలు ఏర్పాటు చేసి లోన్లు ఇస్తే చేనేత బతుకులు కొంతైనా మెరుగు పడతాయని నేతన్నలు అంటున్నారు.

### జీఎస్టీ ఎత్తేయాలి

చిలప నూలుతోపాటు చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయాలని చేనేత కార్మికులు, సంఘాల నేతలు హ్యాండ్లూమ్ బోర్డు సభ్యులు ముక్త కంఠంతో కోరుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన చేనేత సంఘాల నేతలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. దేశ చరిత్రలో ఎప్పుడూ చేనేతపై పన్నులేదని, మహాత్మా గాంధీ రాట్నం వడికే ఫోటో ఆఫీసులో పెట్టుకొనే కేంద్ర పాలకులు చిలపనూలుపై ఐదుశాతం పన్ను విధించడం బాధాకరమని జాతీయ హ్యాండ్లూమ్ బోర్డు సభ్యుడు కేఏఎన్ మూర్తి వాపోయారు. సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి చేనేత ముడిసరుకు, ఉత్పత్తులపై జీఎస్టీ లేకుండా చూడాలని కోరారు.

## 'వైసీపీ' చేనేత సదస్సుకు జగన్ దూరం!

మంగళగిరి టౌన్, ఆగస్టు 6: అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో మంగళగిరిలో సోమవారం నిర్వహించ తలపెట్టిన చేనేత సదస్సుకు పార్టీ అధ్యక్షుడు జగన్ హాజరుకావడం లేదని వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోహనరావు తెలిపారు. ప్రస్తుతం ఆయన నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్నందున మంగళగిరికి రాలేకపోతున్నారని చెప్పారు. అయితే చేనేత సదస్సు వేదికను నన్నపనేని కళావేదిక నుంచి చిల్లపల్లి కల్యాణ మండపంలోకి మారుస్తున్నట్టు మోహనరావు పేర్కొన్నారు.

## మంచి రోజు కావాలి!

- ఇళ్లలో జాప్యానికి పలు కారణాలు
- ఆగిపోయిన 40వేల ఇళ్లు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): "పది కాలాలు ఉండాల్సిన ఇల్లు. ప్రభుత్వం ఇచ్చింది కదా అని ఎప్పుడంటే అప్పుడు మొదలుపెట్టలేం. మంచిరోజు కావాలి. ఆ రోజునే ప్రారంభించుకుంటాం"... ఇది పక్కా ఇళ్లు పొందిన పలువురు లబ్ధిదారుల మాట. ఇంటి నిర్మాణాల్లో జాప్యానికి కారణాలేంటని అధికారులు ఆరా తీయగా ఇలాంటి కారణాలు మరెన్నో బయటపడ్డాయి. పలురకాల కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా 40,589 ఇళ్లు ప్రారంభానికి నోచుకోలేదని అధికారులు గుర్తించారు. 2649 మంది లబ్ధిదారులు మంచి రోజు కోసం వేచిచూస్తున్నారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా నడుస్తోంది. వ్యవసాయ పనుల్లో తీరికలేకుండా ఉన్నామని... అందువల్ల ఇంటి పనులు మొదలుపెట్టలేకపోతున్నారని 6378 మంది లబ్ధిదారులు చెప్పారు. ఇంటి పనులను లబ్ధిదారులు సొంతంగా మొదలుపెట్టుకోవాలి. బేస్‌మెంట్ స్థాయికి వచ్చాకే బిల్లుల మంజూరు మొదలవుతుంది. అయితే... కనీసం అందుకు కూడా చేతిలో డబ్బులు లేవంటూ 7245 మంది ఇంటి పనులు మొదలుపెట్టలేదు. తొలుత ఎలాగోలా ఇళ్లు మంజూరు చేయించుకున్న పేదలు తర్వాత వ్యయం భరించలేక వెనక్కు తగ్గుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే లక్షన్నరకు కనీసం మరో రెండు లక్షలైనా కలిపితేగానీ ఓ మోస్తరుగానైనా ఇంటి నిర్మాణం పూర్తయ్యే అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం రాయితీ ఇస్తున్నా ముందుకు రాలేని పేదలూ అనేక మంది ఉన్నారు. మరికొందరు సగం నిర్మాణం అయ్యాక నిలిపివేశారు.

### పలురకాల ఇబ్బందులు...

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేసింది. స్థలాలతో సంబంధం లేకుండా తొలుత వారి పేరిట ఇళ్లు ఇచ్చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్థలం లేకపోవడంతో వాటి పనులు మొదలు కావడం లేదు. చాలామందికి స్థలాలున్నా వాటికి సంబంధించిన పట్టాదారు పత్రాలు లేవు. అలాంటివారందరూ ఇప్పుడు తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. స్థలానికి క్లియరెన్స్ రాకపోవడంతో 1948, నిబంధనలకు అనుగుణంగా స్థలం సరిపోకపోవడంతో 739, తాత్కాలిక వలసల కారణంగా 1576, స్థలం చదును పనులు చేస్తున్నందున 2010, ఇతర కారణాలతో 2334 మంది లబ్ధిదారులు ఇంటి పనులు మొదలుపెట్టలేదు. ఇటీవలే మంజూరైనవి 8950, నిర్మాణం పక్కదారి పట్టినవి 516 ఉన్నాయి. మరోవైపు... 6243 మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో తమకు మంజూరైన ఇళ్లు రద్దు చేసుకునేందుకు సిద్ధంకావడం గమనార్హం.


# కరెంట్ చార్జీలు తగ్గిద్దాం!

- ప్రతి ఏటా చార్జీలు తగ్గేలా చూడాలి
- రెండోదశ విద్యుత్తు సంస్కరణల లక్ష్యం అదే
- వ్యయనియంత్రణతో 2వేల కోట్లు ఆదా
- 2018 నుంచి నయాపంథాలో వెళదాం
- అధికారులకు సీఎం దిశానిర్దేశం
- రేపు కీలక సమీక్ష

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగంలో విప్లవాత్మక సంస్కరణల దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కరెంటు చార్జీలను తగ్గించేందుకు కసరత్తు ప్రారంభించింది. రెండో దశ విద్యుత్తు సంస్కరణలపై సీఎం చంద్రబాబు ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గతంలో ఏప్రిల్ వచ్చిందంటే విద్యుత్తు చార్జీలు ఎంత మేర పెరుగుతాయోనని సామాన్యులు మొదలు పారిశ్రామికవేత్తల వరకు ప్రతి ఒక్కరూ భయంతో ఎదురుచూసేవారు. 2015 నుంచి ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చాం. 2018 నుంచి మరింత మార్పు రావాలి. ఏప్రిల్ వచ్చిందంటే కరెంటు చార్జీలు ఎంతమేర తగ్గుతాయోనని ఆశగా ఎదురుచూసే పరిస్థితి రావాలి. ఈ దిశగా అడుగులు వేయండి' అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. 1998లో తాను సీఎంగా ఉన్న సమయంలో ప్రారంభించిన మొదటి దశ విద్యుత్తు సంస్కరణల ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. వాటి ఫలితంగానే రాష్ట్రంలో 24 గంటలూ విద్యుత్తును అందించడంతోపాటు మిగులు విద్యుత్తును సాధించడంలో సఫలీకృతులమయ్యామని అన్నారు. రెండో దశ సంస్కరణలకూ విద్యుత్తు సంస్థలు సిద్ధం కావాలని సీఎం కోరారు.

### వ్యయనియంత్రణ విధానాలపై దృష్టి


రాష్ట్ర ఇంధన సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా నిధుల వృథాను అరికట్టొచ్చని సీఎం సూచించారు. ఇంధన రంగ సుస్థిరతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ఇకపై ప్రపంచంతో పోటీ పడేందుకు సిద్ధం కావాలని అన్నారు. ఇంధన శాఖ.. వ్యయ నియంత్రణ విధానాలను అమలు చేస్తే, ఏటా కనీసం రూ.2000 కోట్ల మేర పొదుపు చేయవచ్చని సీఎం పేర్కొన్నారు.



విద్యుత్తు ఉత్పత్తి, కొనుగోలు, పంపిణీ నష్టాలను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. విద్యుతు ఆదా కోసం స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. రెండేళ్ల నుంచి నాలుగేళ్లదాకా అనుసరించాల్సిన విధానాలపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో మెగా విద్యుత్తు పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని, నిరంతరం నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. తమ ప్రభుత్వం విద్యుత్తు వినియోగదారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కూడా విద్యుత్తు చార్జీల భారం 98% వినియోగదారులపై పడకుండా చర్యలు తీసుకోవడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అవి...

- రాష్ట్రంలో చేపట్టిన ఎల్ఈడీ బల్బుల అమరిక, నిర్వహణ విధానం వల్ల కలిగిన ప్రయోజనాలను ఒక ప్రయోగంగా తీసుకుని మరిన్ని కొత్త విధానాల అమలుపై దృష్టిసారించాలి.
- పర్యావరణానికి హాని కలిగించే థర్మల్ విద్యుత్తు ఉత్పత్తిని సాధ్యమైనంత తగ్గించాలి.
- సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిని స్థానికంగానే ఉపయోగించుకొనేలా స్మార్ట్ గ్రిడ్‌లను ఏర్పాటు చేసి పంపిణీ నష్టాలు తగ్గించాలి.
- మిగులు విద్యుత్తును బయట రాష్ట్రాలకు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టాలి.
- ప్రపంచ శ్రేణి విద్యుత్తు యాజమాన్య విధానాలు అమలు చేయాలి.

కాగా, సమావేశం వివరాలను ఇంధన, సీఆర్‌డీఏ, మౌలిక సదుపాయాల శాఖల సలహాదారు ఎ.చంద్రశేఖర రెడ్డి వెల్లడించారు. రెండో దశ విద్యుత్తు సంస్కరణలపై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం సీఎం విస్తృతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు.



### త్వరలో రెండోదశ సంస్కరణలు!

- చార్జీలు తగ్గుతాయి: మంత్రి కళా

విశాఖపట్టణం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో దశ విద్యుత్తు సంస్కరణలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారని రాష్ట్ర విద్యుత్తు శాఖా మంత్రి కిమిడి కళా వెంకటరావు తెలిపారు. విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో రూ.5.74 కోట్లతో నిర్మించిన కార్పొరేట్ ఆఫీస్ బ్లాక్-3ని ఆదివారం ఆయన ప్రారంభించారు. విద్యుత్తు రంగంలో ఏటా 57 అవార్డులు ఇస్తుంటే వాటిలో 37 ఏపీకే వస్తున్నాయన్నారు. రెండో దశ విద్యుత్తు సంస్కరణల్లో భాగంగా మండలాలు, జిల్లాల్లో బ్యాటరీ స్టోరేజ్ స్పెషాలిటీ సెంటర్లను అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి వివరించారు. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని కేంద్రం ప్రభుత్వం చేపట్టిందని, ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో ఏపీకి వాటా వస్తుందని మంత్రి చెప్పారు. కొవ్వాడ నిర్వాసితులకు ఆరువేల గృహాలను నిర్మించనున్నట్టు తెలిపారు.

## నంద్యాల బరిపై కాయ్ రాజా కాయ్

(మొదటి పేజీ తరువాయి)

సమీకరణాలేంటి?... ఇలా తామే ఓ ప్రశ్నావళి రూపొందించుకుని, వివిధ వర్గాల నుంచి సమాచారం సేకరిస్తూ బెట్టింగులకు సిద్ధమవుతున్నారు. రాజకీయ నేతలు, ప్రచారంలో ఉన్నవారు, నంద్యాలలో ఉండే స్నేహితులు, బంధువులు, మీడియాలో తమకు తెలిసిన వారికి ఫోన్లు చేసి గెలుపోటములపై అంచనాలకు వస్తున్నారు. ప్రచారంలో చిన్న స్థాయి నాయకులతోపాటు గన్‌మెన్లు, కారు డ్రైవర్ల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు.

### ఎల్లలు దాటిన పందేలు

విషయం ఏదైనా పందేనికి సై అనే భీమవరంతోపాటు విజయవాడ, విశాఖపట్నం, ప్రకాశం జిల్లా అద్దంకి, గుంటూరు, కడప తదితర చోట్ల నంద్యాల బరిపై పందేల జోరు మొదలైంది. అంతేకాదు... హైదరాబాద్‌లోనూ పందెం కడుతున్నారు. ఈ బెట్టింగ్‌ల వ్యవహారం ప్రవాసాంధ్రులకూ పాకినట్లు సమాచారం. వారు కూడా రాష్ట్రంలో ఉన్న తమ పరిచయస్తులకు ఫోన్లు చేసి... 'నంద్యాల ఎన్నికలపై ఫలానా పందెం ఉంది? వేయొచ్చా?' అని అడుగుతున్నారు. బెట్టింగ్ వీరులు రాజకీయ పార్టీలకంటే ఎక్కువగా విశ్లేషణ చేస్తున్నారు. కొందరైతే ఏకంగా నంద్యాలలో 'స్వీయ పరిశీలన' కూడా జరిపిస్తున్నారు. వీలైతే తామే వెళ్లడం, లేదా తమకు తెలిసిన వారిని పంపించి రెండు మూడురోజులు అక్కడే మకాం వేసి, సొంతంగా సర్వే చేయిస్తున్నారు. ప్రస్తుతానికి ఏ పార్టీ గెలుస్తుంది? అన్న దానిపైనే ఎక్కువ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఉప ఎన్నికల ప్రచారం ముగిసే నాటికి మెజారిటీ మీద కూడా పందేలు జోరందుకోనున్నాయి.

# మోదీ మెప్పు కోసమే..

- ఇందుకు నంద్యాల ఎన్నికలను వాడుకుంటున్నారు
- సీఎం చంద్రబాబు, విపక్ష నేత జగన్‌పై రఘువీరా ధ్వజం



వినుకొండ, ఆగస్టు 6: మోదీ దగ్గర మెప్పు పొందడమే చంద్రబాబు, జగన్‌ల అజెండా అని ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా వినుకొండలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ, అణగారిన వర్గాలను ద్వేషిస్తున్నటువంటి మోదీతో స్నేహం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ తహతహలాడుతున్నారని రఘువీరా ఆరోపించారు. నంద్యాల ఎన్నికల్లో గెలుపొందేందుకు రాజకీయ విలువలను సైతం వదిలేసి ఒకరిపై ఒకరు విమర్శలకు దిగడం సిగ్గుచేటన్నారు. నంద్యాల ఎన్నికల్లో సైద్ధాంతిక పరమైన పోటీని కాంగ్రెస్ పార్టీ ఇవ్వనుందన్నారు. ఈ ఉప ఎన్నికల్లో ఇరుపార్టీలు మోదీ దగ్గర ఏ విధంగా మార్కులు కొట్టేయాలి అనే దానిపై పోటీ పడుతున్నాయని తద్వారా 2019 ఎన్నికల్లో ఎవరికి వారు మోదీతో జట్టు కట్టడంపైనే దృష్టి పెట్టారని అంతకు మించి వీరికి రాష్ట్ర ప్రజల మనోభావాలతో పనిలేదని రఘువీరా రెడ్డి మండిపడ్డారు. ముగ్గురు మోసగాళ్లు ఒక్కటై ప్రజలను వంచిస్తున్నారని, ప్రజలందరూ ఇప్పుడున్న పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీయే నయం అనే భావనకు వచ్చారని చెప్పారు. అణగారిన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేసిందని, నిరంతరం ప్రజలతో మమేకమవుతూ క్షేత్రస్థాయి నుంచి అలుపెరగని పోరాటం చేస్తుందని అన్నారు. గత మూడేళ్లుగా అధికార, ప్రతిపక్షపార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షులు మక్కెన మల్లికార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పెద్ద జఫ్ఫా

- ఆయన జీన్సులోనే హత్యారాజకీయాలు
- ప్రతిపక్ష నేతపై విరుచుకుపడ్డ టీడీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రానికి పెద్దదిక్కులాంటి సీఎంపై జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడటం ద్వారా రాష్ట్రంలోని ఆరు కోట్ల మంది ప్రజలను అవమానించారని మంత్రులు, టీడీపీ నేతలు విమర్శించారు. ప్రతిపక్ష నేత జగన్ పెద్ద జఫ్ఫా అని, విలన్ అని విరుచుకుపడ్డారు. వైసీపీ ఓ టైటానిక్ షిప్ లాంటిదని, అందులోని వారంతా మునగిపోవడం ఖాయమని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పెద్ద జఫ్ఫా అని వక్ఫ్‌బోర్డు చైర్మన్ జలీల్‌ఖాన్ విమర్శించారు. ఆదివారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరెంట్ షాక్ తగిలి తన నియోజకవర్గంలో ఐదుగురు చనిపోతే ఓదార్పుకు వచ్చిన జగన్ చేయిచ్చి, ముద్దుపెట్టాడే తప్ప రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జగన్‌కు కండకావరం తప్ప లోకజ్ఞానం లేదన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయన్న నానుడిని జగన్ నిజం చేశారని మంత్రి పితాని సత్యనారాయణ వ్యాఖ్యానించారు. జగన్ తన వ్యాఖ్యల ద్వారా రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నాడని విమర్శించారు. జగన్ జీవితంలో సీఎం కాలేడని ఆర్థిక మంత్రి యనమల విమర్శించారు. తునిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రక్తం ప్రవహించాలని జగన్ కోరుకుంటున్నాడని, ఆయన జీన్సులోనే హత్యారాజకీయాలు ఉన్నాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత జగన్ ప్రతినాయకుడిలా వ్యవహరిస్తున్నారని మంత్రి జవహర్ మండిపడ్డారు. మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. జగన్ తన భాషతో ప్రజల్లో భయోత్పాతం సృష్టిస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికార ప్రతినిధి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. జగన్ అప్రజాస్వామిక వాదిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారదాహం ఉన్నవారు, మూర్ఖులు వారు ఏమి మాట్లాడుతారో వారికే అర్థం కాదని, సీఎంపై జగన్ చేసిన వ్యాఖ్యలు తలాతోకా లేకుండా మూర్ఖులు మాట్లాడిన మాటల్లా ఉన్నాయని కేంద్రమంత్రి అశోక్‌గజపతి విమర్శించారు. జగన్‌లాంటి వ్యక్తి అధికారంలోకి వస్తే అసెంబ్లీలో బాక్సింగ్ పోటీలు జరుగుతాయన్నారు. మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ.. జగన్ భాష ఫ్యాక్షనిస్టుల భాష అని, దాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రానికి పెద్దదిక్కు లాంటి వ్యక్తిని, తన తండ్రి వయసు ఉన్న సీఎంని నోటికొచ్చినట్లు తిట్టడం ఆరుకోట్ల మంది ప్రజలను అవమానించడమేనన్నారు. అరాచకాలకు, అవినీతికి పేటెంట్ హక్కు జగన్‌దేనన్నారు.

12 సోమవారం
ఆంధ్రజ్యోతి
బిజినెస్
విజయవాడ 7 ఆగస్టు 2017

## వచ్చే ఏడాది ఎల్‌జి ఐఒటి ఉత్పత్తులు


న్యూఢిల్లీ: దక్షిణ కొరియాకు చెందిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జి... వచ్చే ఏడాదిలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఆధారిత హోమ్ అప్లయెన్స్ ఉత్పత్తులను భారత్ మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఈ ఉత్పత్తులకు సంబంధించి పలు మొబైల్ నెట్‌వర్క్ సర్వీసుల ఆపరేటర్లతో మాట్లాడుతున్నామని ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా (ఎల్‌జిఇఐ) మేనేజింగ్ డైరెక్టర్ కి వాన్ కిమ్ తెలిపారు. కంపెనీ మాతృ సంస్థ ఇప్పటికే ఇలాంటి ఉత్పత్తులను కొరియాలో విక్రయిస్తోందని, భారత్‌లో డేటా కనెక్టివిటీకి సంబంధించిన భాగస్వామ్యాల అవసరం ఉన్నందు వల్ల వీటిని ఇక్కడి మార్కెట్లోకి తెచ్చేందుకు జాప్యం జరుగుతోందని ఆయన చెప్పారు. తాము ఈ ప్రతిపాదనను తెచ్చిన నేపథ్యంలో టెలికాం కంపెనీలు అధ్యయనం చేస్తున్నాయన్నారు. టెలికాం కంపెనీల భాగస్వామ్యం వల్ల హోమ్ అప్లయెన్సెస్‌ను నెట్‌వర్క్ ద్వారా కనెక్ట్ చేసే అవకాశం లభిస్తుంది.

# వస్తున్నాయ్ బ్యాంకు ఇష్యూలు

## ఈ ఏడాదే అర డజను పిఎస్‌బిల నిధుల సమీకరణ

న్యూఢిల్లీ: పన్నెండు ప్రభుత్వరంగ బ్యాంకులు పెట్టుబడుల మార్కెట్ నుంచి నిధుల సమీకరణ సన్నాహాలు ముమ్మరం చేస్తున్నాయి. 2019 మార్చి నుంచి అమలులోకి రానున్న బేసెల్ 3 నిబంధనలకు అనుగుణంగా తమ మూలధనం పెంచుకునే లక్ష్యంతో అధిక సంఖ్యలో బ్యాంకులు మార్కెట్‌లో ప్రిఫరెన్షియల్ ఆఫర్లు, క్యుఐపి, ఎఫ్‌పిఒ (ఫాలోఆన్ పబ్లిక్ ఆఫర్) ఇష్యూల ద్వారా నిధులు సమీకరించుకునేందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతులు పొందాయి. ఆంధ్రాబ్యాంకుతో సహా ఆరేడు బ్యాంకులు వర్తమాన ఆర్థిక సంవత్సరం ముగిసేలోగానే మార్కెట్ తలుపులు తట్టాలని భావిస్తున్నాయి. మిగతా బ్యాంకులన్నీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల ఇష్యూలతో ముందుకు రానున్నాయి. యూకో బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయ బ్యాంకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది ఇప్పటికే నిధుల సమీకరణ ప్రయత్నాలు ప్రారంభించాయి.

మార్కెట్ నుంచి నిధుల సమీకరణకు సన్నాహాలు చేసుకుంటున్న ఇతర బ్యాంకుల్లో అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పిఎన్‌బిలకు ఇప్పటికే ప్రభుత్వ అనుమతి చేతిలో ఉంది. మరోవైపు పిఎన్‌బి, ఆంధ్రా బ్యాంకు క్యుఐపి, ఎఫ్‌పిఒ, రైట్స్ ఇష్యూల ద్వారా నిధుల సమీకరణకు వాటాదారుల అనుమతులు కూడా పొందాయి. రెండు వేల కోట్ల రూపాయలు సమీకరించాలన్నది ఆంధ్రాబ్యాంకు, మూడు వేల కోట్ల రూపాయలు సమీకరించాలన్నది పిఎన్‌బి లక్ష్యం. దేనా బ్యాంకు 1,800 కోట్ల రూపాయలు సమీకరించనుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్వస్థతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఇంద్రధనుష్ ప్రణాళిక ప్రకారం బాసెల్ 3 నిబంధనలకు అనుగుణంగా మూలధనం పెంచుకునేందుకు మార్కెట్ నుంచి 1.10 లక్షల కోట్ల రూపాయలు సమీకరించుకోవలసి ఉంటుంది. ప్రభుత్వం నుంచి మూలధన సహాయంగా అందుకోనున్న 70 వేల కోట్ల రూపాయలకు ఇది అదనం. ప్రభుత్వం ప్రకటించిన ఈ 70 వేల కోట్లలో కూడా 50 వేల కోట్ల రూపాయలు ఇప్పటికే అందించింది. మిగతా నిధులు కూడా 2018-19 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా అందచేస్తుంది. ఈ జూన్‌లోనే పిఎస్‌బి దిగ్గజం ఎస్‌బిఐ క్యుఐపి ఇష్యూ జారీ చేయడం ద్వారా 52.2 కోట్ల వాటాలు విక్రయించి 15 వేల కోట్ల రూపాయలు సమీకరించింది. సెకండరీ మార్కెట్లో ఒక బ్యాంకు నిర్వహించిన అతిపెద్ద వాటాల విక్రయం ఇదే. ఈ సొమ్ము అంతటినీ మూలధనం పటిష్ఠం చేసుకునేందుకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనున్నట్టు ఎస్‌బిఐ ప్రకటించింది.



## ఇక సర్కారు గుప్పిట్లో స్విస్ ఖాతాల వివరాలు

న్యూఢిల్లీ/బెర్న్: స్విస్ బ్యాంకుల్లో గుట్టుగా తమ నల్ల ధనం దాచే భారతీయులు ఇక ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సిందే. ఆ దేశ బ్యాంకుల్లో భారతీయులు దాచే డిపాజిట్లపై ఏ మాత్రం అనుమానం వచ్చినా, స్విస్ ప్రభుత్వం వెంటనే భారత ప్రభుత్వానికి అందిస్తుంది. ఇందుకు సంబంధించి రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం వివరాలను స్విట్జర్లాండ్ ప్రభుత్వం తన గెజిట్‌లో ప్రచురించిది. వచ్చే సంవత్సరం నుంచి ఈ ఒప్పందం అమలులోకి రానుంది. దీంతో ఈ చట్టం కింద తొలి సమాచార మార్పిడి 2019లో జరుగుతుందని భావిస్తున్నారు. తాము అందించే సమాచారాన్ని భద్రంగా, గోప్యంగా ఉంచుతుందనే నమ్మకంతోనే భారత ప్రభుత్వంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు స్విట్జర్లాండ్ ప్రభుత్వ తన గెజిట్‌లో పేర్కొంది. రహస్య బ్యాంకు ఖాతాలకు నిలయమైన లీచెస్టన్, బహమాస్ దేశాలతోనూ భారత్ ఇలాంటి ఒప్పందాలే కుదుర్చుకోబోతోందని తెలిపింది. నల్లధన వివరాల కోసం అమెరికా-భారత్ మధ్యా ఇలాంటి ఒప్పందం అమల్లోకి వచ్చిందని పేర్కొంది. రెండు దేశాల మధ్య ఇలాంటి ఒప్పందం కుదురుతోందన్న వార్తలతో ఇప్పటికే అనేక మంది భారతీయులు స్విస్ బ్యాంకుల్లోని తమ అక్రమ డిపాజిట్లను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు సమాచారం.



## కాగ్నిజెంట్‌లో 400 మంది ఎగ్జిక్యూటివ్‌లకు విఆర్‌ఎస్




న్యూఢిల్లీ: అమెరికా ఐటి దిగ్గజం కాగ్నిజెంట్‌లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. ఇప్పటికే వేల మంది మధ్య స్థాయి ఉద్యోగులను ఇంటికి పంపించిన కాగ్నిజెంట్ తాజాగా 400 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లనూ విఆర్‌ఎస్ పేరుతో బయటికి పంపించింది. తొమ్మిది నెలల జీతం చెల్లించి మరీ వీరిని వదిలించుకుంది. వీరిలో ఎక్కువ మంది భారత్‌లోని యూనిట్లలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లని సమాచారం. దీంతో కాగ్నిజెంట్‌కు ఏటా ఆరు కోట్ల డాలర్లు ఆదా అవుతాయని కంపెనీ సిఇఒ కరెన్ మెక్‌లోలిన్ ఇన్వెస్టర్స్ కాల్స్‌కు సమాధానంగా చెప్పారు. దీంతో జూన్ నెలతో ముగిసిన త్రైమాసికానికి భారత్‌లో కాగ్నిజెంట్ ఉద్యోగుల సంఖ్య 2.56 లక్షలకు పడిపోయింది. మార్చితో పోలిస్తే ఇది 4,400 తక్కువ. జూన్ నెలతో ముగిసిన త్రైమాసికంలో కొత్తగా 10,800 మంది కొత్త ఉద్యోగులను తీసుకున్నా కాగ్నిజెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గడం విశేషం.

## ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్


గొండాల రాంబాబు

ఈ రోజు ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ గురించి తెలుసుకుందాం. ఇంతకు ముందు ఇన్‌పుట్ క్రెడిట్, దానికి సంబంధించిన నిబంధనలు తెలుసుకున్నాం. ఏ వ్యాపార సంస్థ అయినా తన వ్యాపారంలో భాగంగా వాడే ఇన్‌పుట్ మీద చెల్లించిన పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ క్రెడిట్ రూపంలో తీసుకోవచ్చు. వ్యాపార సంస్థ కొంత సరుకు ఇతర సంస్థల నుంచి కొనుగోలు చేస్తే ఆ సంస్థ తన కొనుగోలుకు సంబంధించిన సరుకుపై చెల్లించిన పన్నును ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ కింద తీసుకోవచ్చు. అలాగే తన వ్యాపారం కోసం తీసుకున్న సర్వీసుల మీద ఇదే విధంగా క్రెడిట్ తీసుకోవచ్చు. ఒకవేళ అదే వ్యాపార సంస్థకు వివిధ రాష్ట్రాల్లో వివిధ శాఖలు ఉన్నప్పుడు అన్ని శాఖలలో లేదా కొన్ని శాఖలలో వాడే కామన్ సర్వీస్‌ల మీద క్రెడిట్ తీసుకోవడం కొంచెం కష్టమే. ఉదాహరణకు ముంబై హెడ్ ఆఫీస్‌గా ఉన్న ఒక బ్యాంకు దేశవ్యాప్తంగా ఉన్న తన శాఖల కోసం సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసింది. సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖలకు పంపింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ముంబైలోని ఒక కంపెనీ సరఫరా చేసిందనుకుందాం. ఇది రాష్ట్ర అంతర్గత సరఫరా కాబట్టి కొనుగోలు సమయంలో ఆ బ్యాంకు దీని మీద సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి చెల్లించింది. దీనిపై క్రెడిట్ తీసుకునే సమయంలో రెండు సమస్యలు వస్తాయి. మొదటిది.. ఇది ఏ ఒక్క శాఖకు పరిమితమైంది కాదు కాబట్టి ఇన్వాయిస్ ఏదైనా ఒక శాఖ పేరు మీద ఇస్తే మిగతా వాటికి క్రెడిట్ తీసుకునే అర్హత ఉండదు. అలాగే చెల్లించిన పన్ను మహారాష్ట్రకు సంబంధించిన సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి కాబట్టి వేరే రాష్ట్రంలో చెల్లుబాటు కాదు. దీనికి సమాధానమే ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ (ఐఎస్‌డి). ఐఎస్‌డి అనేది సర్వీసులకు సంబంధించిన క్రెడిట్‌ను వివిధ శాఖలకు సులభంగా పంచడానికి ఉపకరిస్తుంది. ఒక వ్యాపార సంస్థ మామూల జిఎస్‌టి రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేకుండా ఒక ఆఫీస్ పేరుతో ఐఎస్‌డి కింద విడిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. సాధారణంగా హెడ్ ఆఫీస్ పేరుతో రిజిస్ట్రేషన్ తీసుకుంటారు. ఇప్పటికే జిఎస్‌టి రిజిస్ట్రేషన్ అదే ఆఫీస్ పేరు మీద ఉన్నప్పటికీ ఐఎస్‌డి కింద రిజిస్ట్రేషన్ తీసుకోవచ్చు. ఇప్పుడు కామన్‌గా వివిధ శాఖల్లో వాడే సేవలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, సంస్థ ఐఎస్‌డి రిజిస్ట్రేషన్ నెంబర్ మీద తీసుకోవాలి. ఈ ఐఎస్‌డి తన పేరుమీద వచ్చిన ఇన్వాయిస్‌లకు సంబంధించిన క్రెడిట్‌లను వివిధ శాఖలకు పంచవచ్చు. దీనికి ఒక పద్ధతి ఉంది. ఈ విధంగా తీసుకున్న సర్వీస్, సంస్థ ఏదైనా ఒక శాఖలో మాత్రమే వాడితే క్రెడిట్ మొత్తం ఆ శాఖకే బదిలీ చేయాలి. అలాకాకుండా ఒకటికంటే ఎక్కువ శాఖల్లో సర్వీస్‌ను వాడితే గత ఆర్థిక సంవత్సరంలో ఆయా శాఖలు వాటి సంబంధిత రాష్ట్రాల్లో లేదా కేంద్ర పాలిత ప్రాంతంలో జరిపిన టర్నోవర్ మీద ఆధారపడి అదే నిష్పత్తిలో పంచాల్సి ఉంటుంది (గత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి కార్యకలాపాలు లేకుంటే గడచిన త్రైమాసికం తీసుకోవాలి). ఇలా పంచే క్రెడిట్ ఐజిఎస్‌టి అయితే అన్ని శాఖలకు ఐజిఎస్‌టి రూపంలోనే పంచాలి. అలాకాకుండా సిజిఎస్‌టి/ఎస్‌జిఎస్‌టి అయితే అదే రాష్ట్రంలోని శాఖలకు సిజిఎస్‌టి/ఎస్‌జిఎస్‌టి రూపంలో పంచాలి. వేరే రాష్ట్రంలోని శాఖలకు ఐజిఎస్‌టి రూపంలో పంచాలి. ఇంతకు ముందు చెప్పిన బ్యాంకు ఉదాహరణగా తీసుకుంటే.. బ్యాంకు ముంబైలోనే ఐఎస్‌డి రిజిస్ట్రేషన్ తీసుకొని సాఫ్ట్‌వేర్ ఇన్వాయిస్ ఈ ఐఎస్‌డి పేరు మీద తీసుకుందని అనుకుందాం. అప్పుడు కొనుగోలు సమయంలో చెల్లించిన సిజిఎస్‌టి/ఎస్‌జిఎస్‌టిలను మహారాష్ట్రలోని శాఖలకు పంచేటప్పుడు సిజిఎస్‌టి/ఎస్‌జిఎస్‌టి రూపంలోనే పంచాలి (ఐఎస్‌డి, శాఖలు రెండూ మహారాష్ట్రలోనే ఉన్నాయి కాబట్టి). మహారాష్ట్ర వెలుపలి శాఖలకు పంచే క్రెడిట్ ఐజిఎస్‌టి రూపంలో పంచాలి. ఈ విధంగా ఈ బ్యాంకు కామన్‌గా అన్ని శాఖల్లో వాడే సర్వీసులకు సంబంధించిన క్రెడిట్‌ను అన్ని శాఖలకు పంచవచ్చు. కానీ దీనికి కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి.

అవేంటంటే.. సంస్థ విధిగా ఐఎస్‌డి కింద రిజిస్ట్రేషన్ తీసుకుని ఉండాలి. పంపిణీ చేసే క్రెడిట్‌కు సంబంధించిన ఇన్వాయిస్‌ల ఐఎస్‌డి పేరు మీద వచ్చి ఉండాలి. ఎవరికి క్రెడిట్ పంచుతారో వారి పేరు మీద ఐఎస్‌డి ఇన్వాయిస్ ఇవ్వాలి. ఫామ్ జిఎస్‌టిఆర్-6 అనే రిటర్న్ విధిగా ఫైల్ చేయాలి.

ఇదీ జీఎస్‌టీ


## జియోకి పోటీగా ఎయిర్‌టెల్ కొత్త ఆఫర్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియోకు పోటీగా ఎయిర్‌టెల్ రంగంలోకి దిగింది. జియో 'ధన్ ధనా ధన్' పేరుతో తెచ్చిన రూ.399 ఆఫర్‌కు పోటీగా ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం తానూ అదే ధరతో కొత్త ప్లాన్ ప్రకటించింది. 84 రోజులు చెల్లుబాటయ్యే ఈ ప్లాన్ కింద ప్రీపెయిడ్ కస్టమర్లు ఏ నెట్‌వర్క్‌కు అయినా అపరిమితంగా లోకల్, ఎస్‌టిడి కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా ఈ 84 రోజుల్లో రోజుకు ఒక జిబి చొప్పున 84 జిబిల డేటా వినియోగించుకోవచ్చు. 4జి ఫోన్లు ఉండి 4జి సిమ్ ఉన్న ప్రీపెయిడ్ కస్టమర్లు మాత్రమే ఈ ఆఫర్‌కు అర్హులు. ఎయిర్‌టెల్ ప్లాన్‌తో టెలికాం రంగంలో పోటీ మరింత తీవ్రమవుతుందని భావిస్తున్నారు. మిగతా కంపెనీలు కూడా ఇదే స్థాయిలో ఆఫర్లు ప్రకటించే అవకాశం ఉంది.

## ఎయిర్ ఇండియా అమ్మకంపై రేపు చర్చ

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా, పవన్ హాన్స్ లిమిటెడ్ కంపెనీల్లో పెట్టుబడుల ఉపసంహరణ విషయం మంగళవారం పార్లమెంటరీ కమిటీ ముందు చర్చకు రానుంది. టిఎంసి ఎంపి ముకుల్ రాయ్ నాయకత్వంలోని 31 మంది ఎంపీల కమిటీకి వివిధ మంత్రిత్వ శాఖలు దీనిపై పూర్తి వివరాలు అందించనున్నాయి. పవన్ హన్స్ ఇండియాలో ప్రభుత్వానికి ఉన్న 51 శాతం వాటా అమ్మకానికి గత ఏడాది అక్టోబర్‌లోనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎయిర్ ఇండియా అమ్మకానికీ ఈ సంవత్సరం జూన్‌లో ఆమోద ముద్ర వేసింది.

## కన్సాలిడేషన్‌లో మార్కెట్


వి. సుందర్ రాజా

టెక్ వ్యూ



నిఫ్టీ గత సోమవారం కీలక స్థాయి 10150 వరకు వెళ్లి సాధించిన మైనర్ రియాక్షన్‌లో మరో కీలక స్థాయి 10000 వరకు దిగజారింది. కాని శుక్రవారం చివరికి 10000కన్నా పైనే నిలకడగా ముగిసి తక్షణ డౌన్‌ట్రెండ్‌ను నివారించుకుంది. కాని వీక్లీ చార్టుల్లో మార్కెట్ వారం మధ్యస్థ స్థాయిలో గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ ముగిసింది. ఇది అనిశ్చిత ధోరణిని సూచిస్తోంది. ఈ వారంలో మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చునేందుకు ఇది సంకేతం. గత వారంలో 10000 పాయింట్ల వద్ద తీవ్రమైన ఆటుపోట్లు కనిపించాయి. పైగా ఈ కీలక స్థాయిని ఛేదించిన తర్వాత బుల్లిష్ ధోరణి మందగించడం, చాలా స్టాక్‌లలో కరెక్షన్ చోటు చేసుకోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ప్రస్తుతం టెక్నికల్‌గా మార్కెట్ 10000కన్నా పైనే ఉన్నందు వల్ల రానున్న కొద్ది రోజుల్లో బలంగా కన్సాలిడేషన్ సాధించాల్సి ఉంది.

**బుల్లిష్ స్థాయిలు:** మరింత అప్‌ట్రెండ్ కోసం కీలక నిరోధ స్థాయి 10100 పైన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధం 10150. గత వారం ఏర్పడిన ఈ టాప్ కన్నా పైన క్లోజయినప్పుడే కొత్త శిఖరాలకు అడుగులు వేయగలుగుతుంది. కరెక్షన్ బాట పట్టినా కూడా మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే కనీసం రెండు రోజుల పాటు 10000 పైన బలంగా క్లోజ్ కావాలి.

**బేరిష్ స్థాయిలు:** 10000 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 9900. తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఇక్కడ రికవరీ తప్పనిసరి. అంతకన్నా దిగువన స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

- బ్యాంక్ నిఫ్టీకి ప్రధాన నిరోధం 25,200. ఇదే గత వారం ఏర్పడిన ప్రధాన గరిష్ఠ స్థాయి. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయికన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మద్దతు స్థాయి 24,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పులో పడుతుంది.

**స్వల్పకాలిక వ్యూహం:** 10000 పైన మార్కెట్ కన్సాలిడేట్ అయినప్పుడే తగు స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు. 9900కన్నా దిగజారితే స్వల్పకాలిక ఇన్వెస్టర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు కొనసాగించే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

**పాటర్న్:** 10150 వద్ద అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్ వద్ద నిరోధం ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే ఈ రేఖకన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. అలాగే ప్రస్తుతం మార్కెట్ 9900 వద్ద ఏటవాలుగా కనిపిస్తున్న మరో రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్ పైన ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. గత వారం ఏర్పడిన బాటమ్ 10000కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. 9900 వద్ద ఏటవాలుగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్ లైన్ వద్ద మద్దతు ఉంది. మార్కెట్ ఇప్పటికే 20 డిఎంఏ కన్నా పైనే ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

**టైమ్:** ఈ సూచిక ప్రకారం బుధవారం తదుపరి స్వల్పకాలిక రివర్సల్ ఉంది. వీక్లీ చార్టుల ప్రకారం ఈ వారంలో ప్రధాన రివర్సల్‌కు ఆస్కారం ఉంది.

**సోమవారం స్థాయిలివే...**
**నిరోధం : 10100, 10150**
**మద్దతు: 10040, 9980**

వి.సుందర్ రాజా,
www.sundartrends.in

## గణాంకాలే కీలకం

"దేశీయ, అంతర్జాతీయ గణాంకాలు, రుతుపవనాల పురోగతి, కార్పొరేట్ల క్యు1 ఫలితాలు ఈ వారంలో మార్కెట్ దిశకు కీలకం కానున్నాయి".

మార్కెట్ నాడి

ఆర్‌బిఐ పాలసీ, పిఎంఐ వంటి కీలక అంశాలు ముగిసిపోవడంతో ఇప్పుడు ఇన్వెస్టర్ల దృష్టి మరోసారి నైరుతి రుతుపవనాల కదలికలు, క్యు1 ఫలితాల పైకి మళ్లింది. వీటితో పాటు అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు, రూపాయి కదలికలు, క్రూడాయిల్ ధరలు కూడా ఈ వారం పరిశీలించే అంశాల్లో ప్రధానం కానున్నాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆగస్టు రెండో తేదీ నాటికి సగటు వర్షపాతం సాధారణ స్థాయికి సమానంగా ఉంది. వ్యవసాయోత్పత్తులకు జూన్-సెప్టెంబర్ నెలల మధ్యలో కురిసే ఈ రుతు పవన వర్షాలే కీలకం.

**ఈ వారం ఫలితాలివే..**
టాటా స్టీల్, బ్రిటానియా, టాటా మోటార్స్, అరబిందో ఫార్మా, హిండాల్కో, బిపిసిఎల్, సిప్లా

**శుక్రవారం ఐఐపి**
గణాంకాల విషయానికి వస్తే జూన్ నెలకు పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపి) గణాంకాలను ప్రభుత్వం శుక్రవారం మార్కెట్ వేళలు ముగిసిన అనంతరం ప్రకటించనుంది. జపాన్ వాణిజ్య లోటు గణాంకాలు సోమవారం, చైనా వాణిజ్య లోటు గణాంకాలు మంగళవారం, చైనా ఎఫ్‌డిఐ గణాంకాలు శుక్రవారం వెలువడనున్నాయి.


విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

**టెక్నికల్స్ ఇవే...**
గత వారంలో శుక్రవారం మార్కెట్ మంచి పునరుజ్జీవం సాధించడంతో వారం మొత్తానికి నిఫ్టీ ఒక మోస్తరు లాభంతో ముగిసింది. 10080 పైన ముగిస్తే నిఫ్టీ అప్‌ట్రెండ్‌ను పునరుద్ధరించుకుంటుంది. 9940 వద్ద బలమైన మద్దతు ఉంది. బ్యాంక్ నిఫ్టీకి 21 రోజుల చలన సగటు 24420 వద్ద కీలక మద్దతు జోన్ ఉంది. రెండు ఇండెక్స్‌ల్లోనూ ఫ్యూచర్స్‌లో తాజా షార్ట్ పొజిషన్లు ఒక మోస్తరుగా జోడైనట్టు సంకేతాలిచ్చాయి. ఆప్షన్స్ విభాగంలో ట్రేడింగ్ కార్యకలాపాలు మిశ్రమంగా ఉన్నాయి. దీన్ని బట్టి ఈ వారంలో గరిష్ఠ ఓపెన్ ఇంటరెస్ట్ 10000 పిఇ, 10200 సిఇ వద్ద ఉన్నాయి.

| ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. | | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్ | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 75.00 | గోదావరి | 77.00 |
| కరీంనగర్ | 76.00 | విజయవాడ | 79.00 |
| వరంగల్ | 75.00 | గుంటూరు | 80.00 |
| మహబూబ్‌నగర్ | 75.00 | ఒంగోలు | 81.00 |
| కర్నూలు | 75.00 | చిత్తూరు | 83.00 |
| విశాఖపట్నం | 73.00 | నెల్లూరు | 83.00 |



| రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.80 | | నెక్ (100 గుడ్లు) | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 318.00 | వరంగల్ | 320.00 |
| విజయవాడ | 323.00 | చెన్నై | 372.00 |
| గోదావరి | 323.00 | నమక్కల్ | 360.00 |
| బెంగళూరు | 360.00 | చిత్తూరు | 365.00 |
| విశాఖపట్నం | 330.00 | ముంబై | 363.00 |



## వారం మధ్యలో కరెక్షన్?

**(ఆగస్టు 7-11 తేదీల మధ్య వారానికి)**

**గత వారం నిఫ్టీ : 10066 (+51)**

నిఫ్టీ గత వారం 9988-10138 పాయింట్ల మధ్యన కదలాడి 51 పాయింట్ల లాభంతో (సుమారు 0.50 శాతం) 10066 పాయింట్ల వద్ద మధ్యస్థ స్థాయిలో పాజిటివ్ దృక్పథంతో ముగిసింది. ఐదు వారాలుగా లాభాలతోనే ముగిసినందు వల్ల కరెక్షన్‌కు ఆస్కారం ఉంది.

- స్వల్పకాలిక ధోరణి బుల్లిష్‌గా మారింది. మధ్య, దీర్ఘకాలిక ధోరణులు రెండింటిలోనూ యథాతథంగా బుల్లిష్‌గానే ఉంది. 9950 దిగువన ముగిస్తే బేరిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 9946, 9746, 9497, 8971 పాయింట్ల వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

- నిఫ్టీ అన్ని డిఎంఎల కన్నా పైన ఉండడం, 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం. 200, 50 డిఎంఏల కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక ట్రెండ్ కూడా బుల్లిష్ అయిందనేందుకు సంకేతం.

**వారానికి బ్రేకౌట్ స్థాయి:** 10150.
**బ్రేక్‌డౌన్ స్థాయి:** 9950

**ఇన్వెస్టర్లకు సూచన**
వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

**నిరోధ స్థాయిలు: 10215, 10290 (10140 పైన బుల్లిష్)**
**మద్దతు స్థాయిలు: 9915, 9840 (9990 దిగువన బేరిష్)**

## మిడ్‌సెషన్ నిస్తేజం

**(సోమవారానికి)**

**తిథి:** శ్రావణ శుక్ల పౌర్ణమి **నక్షత్రం:** శ్రవణం
పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మిథున రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.
**ట్రెండ్ మార్పు వేళలు:** 1.45. 2.40
**ధోరణి:** గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 11.15 నుంచి 1.30 వరకు నిస్తేజంగా ఉండి ఆ తర్వాత ముగింపు వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం...**
నిఫ్టీ ఫ్యూచర్స్ 11.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.20 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**నిరోధ స్థాయిలు: 10105, 10140**
**మద్దతు స్థాయిలు : 10025, 9990**

రోజువారీ ఆస్ట్రో వ్యూహం కోసం
www.thefinancialastrologer. blospot.in
చూడొచ్చు.

## గ్రహగతులు

- మకరంలోని శ్రవణం పాదం 2 నుంచి మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 2,4 మధ్యలో రవి సంచారం
- సింహంలోని పుబ్బ పాదం 1 నుంచి పూర్వఫల్గుణి పాదం 2 మధ్యలో బుధ సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 3, 4 మధ్యలో శుక్ర సంచారం
- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 1లో బలహీన స్థితిలో కుజ సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4లో మీన నవాంశలో వక్రగతిలో శని సంచారం
- కన్యలోని చిత్త పాదం 1 లో సింహ నవాంశలో బృహస్పతి సంచారం
- సింహంలో రాహువు, కుంభంలో కేతువు మేష, తుల నవాంశల్లో సంచారం
- ఈ వారం బుధ, శుక్రవారాల్లో (9 నుంచి 11 తేదీలు) చంద్రుడు కుంభం, మీన రాశుల్లో మార్కెట్ సంచరించే సమయంలో ఏర్పడే పరిధి కీలకం. గరిష్ఠ స్థాయిని దాటితే మరింత పైకి, కనిష్ఠ స్థాయిని దిగజారితే మరింత దిగువకు పయనిస్తుంది.



## రుణానికి హామీ ఇస్తున్నారా?

# పారా హుషార్..

**బ్యాంకులు లేదా ఎన్‌బిఎఫ్‌సిల్లో రుణం తీసుకోవాలంటే సవాలక్ష సమస్యలు. రుణం తీసుకునే వారి ఆర్థిక స్థితి గతులపై అనుమానం వ్యక్తం అయితే రుణాన్ని తిరిగి చెల్లించే విషయమై ఎవరి హామీనైనా ఇవ్వాలని ఆయా సంస్థలు అడుగుతుంటాయి. తెలిసిన వారెవరికైనా ఇలాంటి షూరిటీ ఇచ్చే ముందు తప్పనిసరిగా పరిశీలించాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవేమిటంటే...**

### ఎప్పుడు షూరిటీ అవసరమంటే ?

ఇతరులు తీసుకునే రుణానికి మీరు హామీదారుగా ఉండడం కేవలం లాంఛనం మాత్రమే అనుకోవద్దు. రుణం తీసుకున్న వ్యక్తి చెల్లింపుల్లో విఫలమైతే ఆ చెల్లింపుల భారం హామీ ఇచ్చిన వ్యక్తులపైనే పడుతుందన్న విషయం మరిచిపోవద్దు. అలాగని అందరూ రుణాలు చెల్లించకుండా ఆ భారాన్ని హామీదారులపై వేస్తారని అనుకోలేము. కొన్ని పరిమితులకు లోబడే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు వ్యక్తులకు రుణాలు ఇస్తుంటాయి. ఏ వ్యక్తికైనా అతని ఆర్థిక పరిస్థితికి మించి రుణం ఇవ్వాల్సి వచ్చినపుడే మరొకరి హామీని ఆర్థిక సంస్థలు అడుగుతుంటాయి. వాస్తవానికి మరొకరి రుణాలకు ఇచ్చే హామీలపై స్పష్టమైన మార్గదర్శకాలంటూ లేవు. అయితే ప్రతి బ్యాంకూ ఈ విషయంలో కొన్ని నిబంధనలు పాటిస్తుంటుంది. హామీదారుగా సంతకం పెట్టే ముందే మరో వ్యక్తికి ఇచ్చే రుణాలకు బ్యాంకులు ఎందుకు హామీదారు షూరిటీ అడుగుతుందో పూర్తిగా తెలుసుకోవాలి. లేకపోతే తర్వాత సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

### హామీదారు సహ రుణ గ్రహీత కాదు

రుణ హామీదారుకి, సహ రుణ గ్రహీతకు మధ్య తేడా ఉంది. ఇక్కడ సహ రుణ గ్రహీత, ప్రధాన రుణ గ్రహీతలానే తీసుకున్న రుణాలు చెల్లించాలి. వీరిద్దరూ రుణాలు చెల్లించనప్పుడు లేదా ఏదైనా ప్రత్యేక పరిస్థితుల కారణంగా, వారి నుంచి రుణాల వసూలు సాధ్యం కాదని రుణదాత (బ్యాంకు) భావించినపుడు మాత్రమే ఆ భారం హామీదారుపై పడుతుంది.

### క్రెడిట్ స్కోరుతో లింకు

ఒక వ్యక్తి తీసుకునే రుణానికి హామీదారుగా ఉండేందుకు ఎవరైనా ముందుకు వస్తే బ్యాంకులు ఆ వ్యక్తి పరపతి చరిత్రను కూడా పరిశీలిస్తాయి. హామీ ఇచ్చే వ్యక్తి తన ఆస్తులు, అప్పులకు సంబంధించిన పూర్తి వివరాలు బ్యాంకుకు ఇవ్వాలి. ఇక్కడ హామీదారు క్రెడిట్ స్కోర్ కూడా అత్యంత కీలకం. ఈ చెల్లింపులు పూర్తయ్యే వరకు భవిష్యత్‌లో హామీదారు తీసుకునే రుణ స్తోమత కూడా తగ్గిపోతుంది. రుణగ్రహీతలు నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించకపోయినా ఆ ప్రభావం హామీదారుడి క్రెడిట్ స్కోరుపైనా పడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

### న్యాయపరమైన చిక్కులు

హామీదారుడి హామీతో తీసుకున్న అప్పులను రుణ గ్రహీతలు చెల్లించలేపోతే ఆ భారం షూరిటీ ఇచ్చిన వ్యక్తిపైనే పడుతుంది. అదే ఎవరికైనా గృహ రుణం చెల్లింపులకు హామీ ఇస్తే, ముందు ఆ ఇంటిని స్వాధీనం చేసుకుని అమ్ముకుని బకాయిలు వసూలు చేసుకోమని చెప్పవచ్చు. అయితే అలా అమ్మడం ఆలస్యమై బకాయిలు పెరిగిపోతుంటే మాత్రం.... హామీదారుడే చెల్లించాలని బ్యాంకులు కోరవచ్చు. హామీదారుడు అందుకు తిరస్కరిస్తే, బకాయిల వసూలు కోసం బ్యాంకులు కోర్టుల ద్వారా చర్యలు తీసుకోవచ్చు. కొన్ని ప్రత్యేక కేసుల్లో ఈ అప్పుల రికవరీ కోసం అవసరమైతే బ్యాంకులు ఏకంగా మీ సొంత ఆస్తులనూ జప్తు చేసుకునే ప్రమాదం ఉంటుంది.

### వెనక్కి తగ్గడమూ కష్టమే

ఒకరు తీసుకునే అప్పుకు హామీదారుగా సంతకం పెట్టాక వెనక్కి తగ్గడం అంత తేలిక కాదు. అప్పు తీసుకున్న వ్యక్తితో పాటు, అప్పు ఇచ్చిన బ్యాంకూ ఇందుకు అంగీకరించాలి. మిగిలిన అప్పు చెల్లింపుకు మరో సరైన వ్యక్తి హామీదారుగా దొరికితే తప్ప, బ్యాంకులు ఇందుకు అంగీకరించవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, సంతకం చేసే ముందే అన్ని విషయాలు ఆలోచించుకుని మరీ తుది నిర్ణయం తీసుకోవాలి.

హామీదారు ఒప్పందంలో ఏమైనా ఇబ్బంది కలిగించే క్లాజ్ ఉంటే బ్యాంకుతో చర్చించి ఆ షరతుల్లో మార్పులు చేయమని కోరాలి. లేదా సరైన న్యాయవాదిని సంప్రదించి ఇబ్బందేమీ లేదనుకుంటేనే షూరిటీ సంతకం చేయాలి. వీటికి తోడు మీరు షూరిటీ ఇచ్చిన వ్యక్తి తీసుకున్న రుణాన్ని ఎప్పటికపుడు సక్రమంగా చెల్లిస్తున్నాడా? లేదా? అనే విషయం తెలుసుకుంటూ ఉండాలి. లేకపోతే పుణ్యానికిపోతే పాపం చుట్టుకున్నట్టు అప్పుల చెల్లింపు భారం మీ మెడకు పడుతుంది.

**ఉపద్రవాన్ని ఊహించలేము. ప్రకృతి విపత్తుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వాటి నుంచి తప్పించుకోవడం కష్టమే. ఇలాంటి ఉపద్రవాలతో వ్యక్తులకు లేదా వారి ఆరోగ్యాలకు వాటిల్లే నష్టాలను జీవిత/ ఆరోగ్య బీమా పాలసీతో భర్తీ చేసుకోవచ్చు. మరి వ్యక్తుల ఆస్తులు, వాహనాలకు వాటిల్లే ఆర్థిక నష్టాల నుంచి బయట పడాలంటే ? ప్రాపర్టీ, మోటార్ ఇన్సూరెన్స్‌ను కూడా ఫైనాన్షియల్ ప్లానింగ్‌లో భాగంగా చేసుకోవాలి.**

# ప్రకృతి విపత్తులకు బీమాతో ధీమా

వాతావరణ మార్పులతో ప్రకృతి విపత్తులూ పెరిగిపోతున్నాయి. అకాల వర్షాలతో వరదలు ముంచెత్తుతున్నాయి. ఇలాంటి విపత్తులు ఎంతో మంది జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక వ్యక్తిగత ఆస్తులకు, వాహనాలకు వాటిల్లే ఆర్థిక నష్టాల గురించి చెప్పాల్సిన పనే లేదు. ప్రభుత్వ ఆస్తులకు సంభవించే నష్టాన్ని కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం భర్తీ చేస్తుంది. మరి వ్యక్తిగత ఆస్తులకు వాటిల్లే నష్టాలను భర్తీ చేయడం ఎలా? సరైన బీమా పాలసీ తీసుకోవడమే ఇందుకు పరిష్కారం.

### గృహ బీమా పాలసీ

ప్రతి వ్యక్తికి జీవితంలో కొన్ని విషయాలు అత్యంత ముఖ్యమైనవి. అందులో కష్టపడి నిర్మించుకున్న/ కొనుక్కున్న ఇల్లు మరీ ముఖ్యం. ప్రకృతి విపత్తులతో అలాంటి ఇంటికి ఏదైనా నష్టం జరిగితే చాలా మంది ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతారు. సరైన గృహ బీమా పాలసీ తీసుకోవడం ద్వారా ఈ ఆర్థిక నష్టాన్నీ చాలా వరకు తట్టుకోవచ్చు. ఈ పాలసీ ద్వారా భవనానికి జరిగే నష్టంతో పాటు అందులోని పరికరాలు, విలువైన వస్తువులకూ బీమా కవరేజ్ లభిస్తుంది.

### ఇతర నష్టాలకూ రక్షణ


గృహ బీమా పాలసీతో ప్రకృతి విపత్తులతో వాటిల్లే నష్టాలకేగాక ఇంకా అనేక ఇతర సంఘటనలతో ఆస్తులకు వాటిల్లే నష్టాలకూ బీమా రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు, దొంగతనాలతో ఇంటికి, ఇంటిలోని విద్యుత్ పరికరాలు, లాప్‌టాప్స్ వంటి పోర్టబుల్ ఎక్విప్‌మెంట్‌కు జరిగే నష్టాలకూ ఈ పాలసీల ద్వారా బీమా పరిహారం పొందవచ్చు.

### వరదలు సంభవిస్తే..

వరదల సమయంలో కార్లు, ద్విచక్ర వాహనాలు పూర్తిగా లేదా పాక్షికంగా నీటిలో మునిగిపోతుంటాయి. ఒక్కోసారి వాహనాలను నీటి నుంచి తీసి వర్క్‌షాప్‌లు/డీలర్ల వద్దకు చేర్చడం పెద్ద సమస్యే. గత ఏడాది చెన్నై నగరాన్ని వరదలు ముంచెత్తినప్పుడు చాలా మంది వాహనాల యాజమానులకు ఈ పరిస్థితి ఎదురైంది. వరదల్లో దెబ్బతిన్న వాహనాలను బయటికి తీసి పార్కు చేయడమూ పెద్ద సమస్య. ఇందుకోసం ఒక్కో కారుకు దాదాపు రూ.11,000 వరకు ఖర్చవుతుంది. చెన్నై వరదల సమయంలో ఒక్కో వాహనాన్ని నీళ్ల నుంచి బయటికి తీసి వర్క్‌షాపునకు తరలించేందుకే రికవరీ వ్యాన్ డీలర్లు ఇంతకంటే ఎక్కువగానే వసూలు చేశారు.

### ఇదే సరైన సమయం

గుజరాత్, ఈశాన్య రాష్ట్రాలను ఇప్పటికే భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. వరుణుడు ఆగ్రహిస్తే దక్షిణాది రాష్ట్రాలకూ ఇదే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సొంతిళ్లు/అపార్ట్‌మెంట్ ఉన్న వ్యక్తులు వెంటనే సమగ్ర గృహ బీమా పాలసీ తీసుకోవడం మంచిది. బీమా కంపెనీలు కూడా ఇందుకోసం రకరకాల ఆప్షన్లతో ప్రత్యేక పాలసీలు అందుబాటులో ఉంచాయి. ఈ పాలసీలు ఇచ్చేటపుడే బీమా కంపెనీలు ప్రకృతి విపత్తులతో ఆస్తులు, వాహనాలకు పెద్దగా నష్టం జరకుండా పాటించాల్సిన మెలకువలూ అందిస్తాయి. అప్పటికీ నష్టం జరిగితే పాలసీ షరతులకు లోబడి బీమా పరిహారం అందజేస్తాయి. దాహమైనపుడే బావి తవ్వాలనే



ధోరణి పక్కన పెట్టి ముందుగానే పాలసీ తీసుకుని ఏటా రెన్యువల్ చేసుకోవడం మంచిది. ముఖ్యంగా తుఫాన్లు వంటి ప్రమాదాలు పొంచి ఉంటే కోస్తా ప్రాంతాల్లోని ఇళ్లు, వాహన యాజమానులు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

### జాగ్రత్తలు

గృహ బీమా పాలసీలు తీసుకున్న వ్యక్తులు ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతిన్న వాహనాలను వెంటనే బీమా కంపెనీ గుర్తించిన సమీపంలోని వర్క్‌షాప్‌కు తీసుకెళ్లాలి. వాహనాలకు జరిగే నష్టాన్ని తగ్గించుకునేందుకు, తక్కువ ఖర్చుతో వచ్చే ఇంజిన్ ప్రొటక్టర్/హైడ్రోస్టాటిక్ లాక్ వంటి యాడ్ ఆన్ కవర్స్ తీసుకోవడం మంచిది. ఈ యాడ్ ఆన్ కవరేజ్‌తో వరదల సమయంలో ఇంజన్‌లోకి నీళ్లు చేరి ఇంజిన్ పాడై పోయినా బీమా కంపెనీ నుంచి నష్ట పరిహారం పొందవచ్చు.

### పరిశీలించాల్సిన అంశాలు

ప్రస్తుతం అనేక బీమా కంపెనీలు ప్రకృతి విపత్తులతో ఆస్తులు, వాహనాలకు జరిగే నష్టాల నుంచి రక్షణ కల్పించేందుకు అనేక పాలసీలు ఆఫర్ చేస్తున్నాయి. ఈ కంపెనీల ఏజెంట్లు చెప్పే మాటలు గుడ్డిగా నమ్మి పాలసీ తీసుకుంటే తర్వాత చింతించాల్సి వస్తుంది. ముందు పాలసీలన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఏ పాలసీ మన అవసరాలు తీరుస్తుంది? ఏ కంపెనీ పాలసీ తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ ఇస్తోంది? అనే విషయాలు తెలుసుకోవాలి. అన్నిటి కంటే ముఖ్యంగా ఎంత త్వరగా కంపెనీ క్లెయిమ్స్ పరిష్కరిస్తోందనే విషయంలో బీమా కంపెనీ ట్రాక్ రికార్డు తెలుసుకున్నాకే బీమా పాలసీ తీసుకోవాలి.

### మినహాయింపులు

ప్రతి బీమా పాలసీలోనూ కొన్ని మినహాయింపులు ఉంటాయి. ప్రకృతి విపత్తుల సమయంలో ఆస్తులు, వాహనాలకు జరిగే ఆర్థిక నష్టానికి ఏయే సందర్భాల్లో కంపెనీ నష్టపరిహారం చెల్లించదో కూడా పాలసీ నిబంధనల్లో ఉంటాయి. పాలసీ తీసుకునే ముందే ఈ మినహాయింపు షరతులు పూర్తిగా చదివి సంతృప్తి చెందితేనే ఆ కంపెనీ పాలసీ తీసుకోవాలి. గృహ బీమా పాలసీ తీసుకుంటుంటే భవనంతోపాటు అందులో విలువైన నగా నట్రా వంటి విలువైన వస్తువులకూ బీమా కవరేజ్ ఇచ్చే కంపెనీలనే ఎంచుకోవాలి.

**- కెజి కృష్ణ మూర్తి రావు,
ఎండి, సిఇఒ, ఫ్యూచర్ జనరలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ**



# సీనియర్ సిటిజన్లకు ఆకర్షణీయంగా డెట్ ఫండ్స్

**వడ్డీ రేట్లు దిగొస్తున్నాయ్. ఎస్‌బిఐతోపాటు అనేక బ్యాంకులు సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బి) ఖాతా నిల్వపై చెల్లించే వడ్డీ రేట్లను తగ్గిస్తున్నాయి. ఆర్‌బిఐ తాజా చర్యతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల(ఎఫ్‌డి)పై బ్యాంకులు చెల్లించే వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. దీంతో స్థిరమైన ఆదాయం కోసం ఎఫ్‌డిలనే నమ్ముకున్న సీనియర్ సిటిజన్స్ ముఖ్యంగా సీనియర్ సిటిజన్ల ఆదాయానికి గండి పడనుంది. ఈ నేపథ్యంలో డెట్ ఫండ్స్ రూపంలో వారి ముందున్న ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల గురించి తెలుసుకుందాం.**

**తగ్గుతున్న రాబడులు :** సీనియర్ సిటిజన్లలో ఎక్కువ మంది స్థిర ఆదాయం కోసం బ్యాంక్ ఎఫ్‌డిలనే నమ్ముకున్నారు. వడ్డీ తక్కువున్నా అసలుకు భరోసా ఉంటుందనే నమ్మకం ఇందుకు ప్రధాన కారణం. తగ్గుతున్న వడ్డీ రేట్లతో ఎఫ్‌డిలపై రాబడులు ఏటికేటికి తగ్గిపోతున్నాయి. ఆర్‌బిఐ మరోసారి రెపో రేటును పావు శాతం కుదించింది. ఈ చర్యతో బ్యాంకులు ఎఫ్‌డిలపైనా వడ్డీ రేట్లు మరింత తగ్గించేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో సీనియర్ సిటిజన్ల స్థిర ఆదాయాలకు గండి పడనుంది. ఏడాది కాల పరిమితి ఉండే ఎఫ్‌డిపై బ్యాంకులు 6.75 శాతానికి మించి వార్షిక వడ్డీ చెల్లించడం లేదు. సీనియర్ సిటిజన్లకు అర శాతం ఎక్కువగా చెల్లిస్తున్నాయి. అయినా పన్నులు పోగా ప్రస్తుతం ఎఫ్‌డిలపై గిట్టుబాటయ్యే వడ్డీ రేటు 5 శాతమే. ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే ఎఫ్‌డిపై రాబడుల సంగతి దేవుడెరుగు.. నష్టాలు మిగులుతాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

**డెట్ ఫండ్స్ :** కొద్ది పాటి రిస్కు తీసుకుంటే సీనియర్ సిటిజన్లకు మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్)కు చెందిన డెట్ ఫండ్స్ మంచి ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. ఎఫ్‌డిలతో పోలిస్తే ప్రస్తుతం వీటిపై రాబడులు(ఎన్‌ఎవి) అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. అయితే ఈ రాబడులు వడ్డీ రేట్లకు అనుగుణంగా మారుతుంటాయి. బ్యాంకులు, ఆర్‌బిఐ వడ్డీ రేట్లు తగ్గించినపుడు వీటి పెట్టుబడులపై రాబడులు పెరుగుతాయి. వడ్డీ రేటు పెంచినపుడు తగ్గుతాయి. ఎఫ్‌డిలపై వడ్డీ రాబడులు తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో సీనియర్ సిటిజన్లు వీటిపైనా దృష్టి పెట్టడం మంచిది.



**పన్నుల భారం :** డెట్ మ్యూచువల్ ఫండ్ పథకాల్లో డివిడెండ్, గ్రోత్ అని రెండు ఆప్షన్స్ ఉంటాయి. డివిడెండ్ ఆప్షన్ ద్వారా ఫండ్ ఎన్‌ఎవి ఒక నిర్ణీత స్థాయికి పెరిగినపుడల్లా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఎఎంసి)లు ఆ లాభాన్ని డివిడెండ్ రూపంలో యూనిట్ హోల్డర్లకు బదిలీ చేస్తాయి. అయితే మూలంలోనే దీనిపై 28.33 శాతం పన్ను భారం పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు గ్రోత్ ఆప్షన్‌ను ఎంచుకోవడం మంచిది. లిక్విడ్ ఫండ్స్, ఇన్‌కమ్ ఫండ్స్, గిల్ట్ ఫండ్స్, క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫండ్స్.... ఇవన్నీ మ్యూచువల్ ఫండ్స్‌కు చెందిన డెట్ పథకాలే. ఈ ఫండ్స్ ద్వారా సమీకరించే నిధులను ఎఎంసిలు పూర్తిగా ప్రభుత్వ లేదా కార్పొరేట్ రుణ పత్రాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ పథకాల్లో పెట్టిన పెట్టుబడులను మూడేళ్లకు మించి ఉంచితే, వచ్చే రాబడులపై దీర్ఘకాలిక మూలధన లాభాల కింద ఇండెక్సేషన్‌తోపాటు 20 శాతం పన్నుల భారంతో బయటపడొచ్చు. డెట్ పథకాల్లో పెట్టిన పెట్టుబడులను మూడేళ్లలోపు అమ్మితే వచ్చే లాభాలపై ఆయా వ్యక్తుల శ్లాబ్ ప్రకారం పన్నుల భారం పడుతుంది.

**రిస్క్:** బ్యాంకు డిపాజిట్లతో పోలిస్తే డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు కొంత రిస్క్ ఉంది. ముఖ్యంగా ఈ పథకాల్లో పెట్టుబడులకు క్రెడిట్ రిస్క్, వడ్డీ రేట్ల రిస్క్, రీఇన్వెస్ట్‌మెంట్ రిస్క్ వంటి రిస్క్‌లు పొంచి ఉంటాయి. ఇందులో అన్నిటి కంటే ముఖ్యమైంది ఇంటరెస్టు రేట్ రిస్క్. ప్రస్తుతం దేశంలో వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. కాబట్టి డెట్ ఫండ్స్‌పై వచ్చే రాబడులు ఎఫ్‌డిల కంటే ఎక్కువగా ఉంటాయని భావించవచ్చు. అదే వడ్డీ రేట్లు పెరగడం ప్రారంభిస్తే ఈ పథకాలపై వచ్చే రాబడులూ క్షీణిస్తాయి. డెట్ ఫండ్స్ రాబడులకు క్రెడిట్ రిస్కూ పొంచి ఉంటుంది. డెట్ ఫండ్ పోర్టుఫోలియోలోని ఏదైనా ఒక కంపెనీ తన రుణ పత్రాలపై చెల్లింపుల విషయంలో విఫలమైతే, ఆ ప్రభావం పథకం మొత్తం రాబడులపైనా ఉంటుంది.

**ఎంపిక :** డెట్ ఫండ్స్ అనేక రకాలు. ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాలు ఎంచుకోవాలి. 3 నెలల వరకు మాత్రమే పెట్టుబడులు ఉంచగలిగితే లిక్విడ్ ఫండ్స్‌ను, 3 నుంచి 6 నెలల వరకు వేచి ఉండగలిగితే అల్ట్రా షార్ట్ టర్మ్ బాండ్ ఫండ్స్, 6 నుంచి 12 నెలల వరకు పెట్టుబడులు అవసరం లేదనుకుంటే షార్ట్ టర్మ్ బాండ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. ఏడాది నుంచి మూడేళ్ల వరకు పెట్టుబడులతో అవసరం లేదనుకుంటే ఇంటర్మీడియట్ బాండ్ ఫండ్స్, అంతకు మించి వేచి ఉండగలిగితే కార్పొరేట్ బాండ్ ఫండ్స్/డైనమిక్ బాండ్ ఫండ్స్ ఎంచుకోవాలి.

**గిల్ట్ ఫండ్స్‌తో జీరో రిస్క్:** పెట్టుబడులకు ఏ మాత్రం రిస్క్ లేకుండా బ్యాంక్ ఎఫ్‌డిల కంటే మెరుగైన రాబడులు కావాలనుకునే రిటైరీలు గిల్ట్ ఫండ్స్‌పై ఒక లుక్కేయడం మంచిది. ఈ ఫండ్స్ ద్వారా సమీకరించే నిధుల్లో ఎక్కువ భాగాన్ని ఎంఎఫ్ సంస్థలు, చెల్లింపులకు పూర్తి హామీ ఉండే ప్రభుత్వ రుణ పత్రాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. టాప్-5 గిల్ట్ ఫండ్స్ రాబడులను పరిశీలిస్తే గత ఏడాది కాలంలో 8.58 శాతం నుంచి 14.79 శాతం రాబడులు ఇచ్చాయి. అయితే ఈ ఫండ్స్‌పై రాబడులు వడ్డీ రేట్లలో వచ్చే మార్పులను బట్టి హెచ్చు తగ్గులకు లోనవుతుంటాయనే విషయం గుర్తుంచుకోవాలి.

**పెట్టుబడి పరిమితులు :** పెట్టుబడులకు భద్రత, లిక్విడిటీ, పన్నుల పోను వచ్చే రాబడులు అనే మూడు అంశాలు అత్యంత ముఖ్యం. ఈ అంశాల ఆధారంగానే వారు స్థిరమైన రాబడుల కోసం తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో నిర్మించుకుంటారు. ఎఫ్‌డిలపై రాబడులు ఎంత తగ్గుతున్నా వెంటనే వచ్చే ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు వీలుగా తమ పెట్టుబడి నిధుల్లో కనీసం 10-15 శాతం ఎఫ్‌డిల్లోనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. మరో 75-80 శాతం పెట్టుబడులను మాత్రం మంచి రాబడుల చరిత్ర ఉన్న డెట్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**పెట్టుబడి వ్యూహం:** డెట్ పథకాల్లో పెట్టిన పెట్టుబడులను కనీసం మూడేళ్ల వరకు కదిలించకూడదు. అప్పుడే ఈ పథకాలపై వచ్చే పన్నుల ప్రయోజనాలు అందుకోవచ్చు. ఇంత కంటే తక్కువ కాలానికి అయితే డెట్ ఫండ్స్ విభాగానికే చెందిన లిక్విడ్ లేదా అర్బిట్రేజ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచిది. ప్రస్తుతం ఈ ఫండ్స్ రాబడులు బ్యాంకుల సేవింగ్ బ్యాంక్ ఖాతాపై చెల్లించే వడ్డీ రేటు కంటే ఎక్కువగానే ఉన్నాయి. ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ఇన్వెస్టర్లు సిస్టమాటిక్ విత్‌డ్రాల్ ప్లాన్ ద్వారా పెట్టిన పెట్టుబడుల నుంచి నిర్ణీత మొత్తాన్ని నిర్ణీత గడువుల్లో వెనక్కి తీసుకోవచ్చు.

**ఎగ్జిట్ లోడ్ :** బ్యాంకుల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎప్పుడైనా వెనక్కి తీసుకోవచ్చు. ఎలాంటి మినహాయింపులు లేకుండా అప్పటి వరకు వడ్డీ కూడా లభిస్తుంది. డెట్ ఫండ్స్ పెట్టుబడుల విషయంలో ఈ సౌలభ్యం లేదు. ఏడాదిలోపు ఏదైనా అవసరమొచ్చి పెట్టుబడులు వెనక్కి తీసుకోవాలంటే కొన్ని మ్యూచువల్ ఫండ్స్ పావు శాతం నుంచి అర శాతం వరకు ఎగ్జిట్ లోడ్ వసూలు చేస్తున్నాయి. ఏడాది తర్వాత వెనక్కి తీసుకుంటే మాత్రం ఎలాంటి భారం ఉండదు.

**ఇతర మార్గాలు :** సీనియర్ సిటిజన్లు నేరుగా ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం సరికాదు. ప్రస్తుతం మన దేశంలోనూ జీవితకాలం పెరుగుతోంది. ఒక వ్యక్తి 60 ఏళ్ల వయసులో రిటైరైతే అతడు ఇంకా మరో 30 ఏళ్ల వరకు జీవించే అవకాశం ఉంది. ఈ 30 ఏళ్ల కాలంలో అతడికి సంపాదించే అవకాశాలు దాదాపు మృగ్యం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు ముందుగానే రిటైర్‌మెంట్ జీవితం ఆర్థిక అవసరాలు ప్లాన్ చేసుకోవాలి.

# ఆ 3 గంటలు...

- సూర్య కుమారి మృతిపై మిస్టరీ
- విద్యాసాగర్ చుట్టూ ఉచ్చు.. అరెస్టు
- అర్ధరాత్రి ఆయన ఇంటికెళ్లిన డాక్టర్
- అక్కడ వాగ్వాదం... ఆపై అదృశ్యం



విజయవాడ, ఆగస్టు 6: హత్యా? ఆత్మహత్యా? డాక్టర్ సూర్యకుమారి మరణానికి కారణమేమిటి? ఆ మూడు గంటల్లో ఏం జరిగింది? విజయవాడలో అనుమానాస్పద స్థితిలో మరణించిన వైద్యురాలు సూర్యకుమారి మరణంపై పోలీసుల దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కుమారుడైన విద్యాసాగర్‌ను అరెస్టు చేశారు. సూర్యకుమారి గతనెల 31వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ద్విచక్రవాహనంపై విద్యాసాగర్ ఇంటికి చేరుకున్నారు. అక్కడ విద్యాసాగర్ దంపతులతో సూర్యకుమారికి వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. ఆ వెంటనే సూర్యకుమారి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆపై ఐదు రోజులకు... అంటే శనివారం రైవస్ కాల్వలో ఆమె మృతదేహం కనిపించింది. సూర్యకుమారి సెల్‌ఫోన్ మరచిపోయిందంటూ 31వ తేదీ రాత్రే విద్యాసాగర్ ఆమె ఇంటికి వెళ్లి ఫోన్ ఇచ్చారు. అంతేకాదు... మూడు గంటల వ్యవధిలోనే మూడుసార్లు ఆమె ఇంటికి వెళ్లి 'సూర్యకుమారి వచ్చిందా..?' అని ఆరా తీశారు. దీంతో... ఆమె విద్యాసాగర్ ఇంటి నుంచి వెళ్లిపోయినప్పటి నుంచి 3 గంటలు ఏం జరిగిందనే దానిపై పోలీసులు దృష్టి సారించారు.

**ఆత్మహత్యకు అవకాశమే లేదు: బంధువులు**

సూర్యకుమారి ఆత్మహత్యకు పాల్పడే అవకాశం ఏమాత్రమూ లేదని ఆమె బంధువులు పేర్కొంటున్నారు. "ఆమె ఢిల్లీకి వెళ్తున్నానని తనకు చెప్పిందని, సెల్‌ఫోన్ మాత్రం వదిలేసి వెళ్లిందని విద్యాసాగర్ చెబుతున్నారు. నేరుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లి సూర్యకుమారికే సెల్ ఇవ్వకుండా... ఆమె ఇంటికి రావడం, పదేపదే ఆమె రాక గురించి ఆరా తీయడం వెనుక అనుమానాలున్నాయి" అని చెబుతున్నారు. ఇక... చర్చిలో పరిచయమైన విద్యాసాగర్‌తో సూర్యకుమారి స్నేహం కాస్త ప్రేమగా మారిందని తెలుస్తోంది. విద్యాసాగర్‌నే వివాహం చేసుకోవాలని మానసికంగా సిద్ధపడింది. అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలున్న విద్యాసాగర్ తొలుత పెళ్లికి సుముఖత వ్యక్తం చేసినా తర్వాత దాటవేస్తూ వచ్చారు. మరోవైపు...నగల దుకాణం నడిపే విద్యాసాగర్ మాయమాటలతో యువతులను ఆకర్షించి, వారివద్ద నగలు, నగదు తీసుకుంటాడని పోలీసుల విచారణలో తేలింది. విద్యాసాగర్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం సూర్యకుమారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంత్రి దేవినేని ఉమ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూర్యకుమారి కుటుంబీకులను పరామర్శించారు.

## కౌలురైతు ఆత్మహత్య

గుడ్లవల్లేరు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన కౌలురైతు కాగిత మురళి (58) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఏడాది 10 ఎకరాల పొలం కౌలుకు సాగు చేయగా నష్టం వాటిల్లింది. తిరిగి ఈ ఏడు వ్యవసాయం చేయడానికి పెట్టుబడులు దొరకక ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్టు గుడ్లవల్లేరు ఎస్సై శివప్రసాద్ చెప్పారు. భార్య ఊర్మిళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.






# ప్రకృతి ఒడిలో.. పోలీసు భవనం!

**సర్వాంగ సుందరంగా ముస్తాబు.. 5 అంతస్తులు.. 1.10లక్షల చదరపు అడుగులు..**

**40కోట్లతో అధునాతన హంగులతో నిర్మాణం.. ఈనెల 16న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం హెడ్‌క్వార్టర్స్ సంగతి అటుంచి కనీసం తుపాకులు భద్రపరుచుకోవడానికి కూడా చోటు లేని దుస్థితిని ఏపీ పోలీసు శాఖ ఎదుర్కొంది. అయితే ఇప్పుడు ఆ శాఖ కోసం సకల సౌకర్యాలు, అధునాతన టెక్నాలజీతో పచ్చటి ప్రకృతి ఒడిలో సర్వాంగ సుందరంగా నిర్మించిన అద్దాల భవనం సిద్ధమైంది. మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్స్ ప్రాంగణంలో రెండెకరాల స్థలంలో ఐదంతస్థుల్లో నిర్మించిన ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ త్వరలోనే ప్రారంభం కానుంది. రూ.40కోట్ల ఖర్చుతో 1.10లక్షల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని నిర్మించారు. గత అక్టోబర్‌లో ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా భూమిపూజ చేయించి డీజీపీ సాంబశివరావు దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిరంతరం పర్యవేక్షిస్తూ కేవలం 10నెలల్లో మొత్తం నిర్మాణాన్ని పూర్తి చేసి ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



హెచ్‌ఓడీ చాంబర్

**సీఐడీకే తొలి ప్రాధాన్యం**

ఈ భవనంలో సుమారు 40వేల చదరపు అడుగుల నిర్మాణంలో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు సీఐడీ విభాగానికి అప్పగిస్తున్నారు. అగ్రిగోల్డ్ లాంటి కీలక కేసులను దర్యాప్తు చేస్తోన్న సీఐడీకి డీజీపీ మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. ఇక రెండు, మూడో అంతస్థుల్లో పీ అండ్ ఎల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, ట్రైనింగ్ అధిపతి, శాంతి భద్రతల ఏడీజీ, టెక్నికల్ సర్వీసెస్ తదితర విభాగాల అధిపతుల కార్యాలయాలకు అద్దాల గదులు నిర్మించారు. పలువురు ఐజీలు, ఇతర అధికారులు కూడా ఆయా ఫ్లోర్‌లలో కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. ఐదో అంతస్తులో డీజీపీ కార్యాలయం, పేషీతోపాటు కాన్ఫరెన్స్ హాల్, ఎస్పీలతో మాట్లాడేందుకు సాంకేతికపరమైన ఏర్పాట్లు చేశారు.



కార్యాలయం లోపలి భాగం

**టెక్నాలజీకి పెద్దపీట...**

లిఫ్ట్ మొదలుకొని ఏ గదిలోపలికి ప్రవేశించాలన్నా బయోమెట్రిక్ తప్పనిసరి. సిబ్బంది కార్యాలయంలోకి ప్రవేశించాలంటే వేలిముద్రతోనే తలుపు తెరుచుకుంటుంది. ఆఫీసర్ల పేషీల్లోకి ఆయనతోపాటు పేషీ సీసీకి మాత్రమే బయోమెట్రిక్ లాక్ తెరిచే అవకాశం ఉంటుంది. అన్నిటికన్నా పై అంతస్తులో బుల్లెట్ ప్రూఫ్ అద్దాలతో సువిశాలమైన గదిలో డీజీపీ కార్యాలయం ఉంటుంది. భవనానికి పశ్చిమాన పచ్చని చెట్లతో ఆహ్లాదంగా మంగళగిరి కొండ ఉంటుంది. మరోవైపు చెన్నై-కోల్‌కత జాతీయ రహదారి సుమారు రెండు కిలోమీటర్ల మేర కనిపిస్తుంది. డీజీపీ పేషీకి ఎదురుగా కాన్ఫరెన్స్ హాల్ ఉంటుంది. కారిడార్ నుంచి డీజీపీ పేషీ వరకూ చక్కటి కొటేషన్లతో డిస్‌ప్లే బోర్డులు అమర్చారు. భవనంలో పనిచేసేవారి మనసుకు ప్రశాంతత లభించేలా చక్కటి సంగీతం వినిపించే విధంగా ఏర్పాట్లు చేశారు.



సందర్శకుల వెయిటింగ్ హాల్

**పార్కు.. పార్కింగ్..**

జాతీయ రహదారి నుంచి ప్రధాన ద్వారం లోపల ఎకరం స్థలంలో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. బెటాలియన్ కమాండెంట్ కార్యాలయానికి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు మధ్యలో సర్వాంగ సుందరంగా పార్కును తీర్చిదిద్దారు. భవనం చుట్టూ అందంగా కనిపించేందుకు 15అడుగుల ఎత్తున్న చెట్లను నాటారు. రాష్ట్ర విభజనతో పోలీసు హెడ్‌క్వార్టర్స్, శిక్షణకేంద్రం సహా చాలానే వదులుకున్న ఏపీ పోలీసుశాఖ విజయవాడలోని ఆఫీసర్స్ క్లబ్‌లో పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంది. ఎలాంటి సౌకర్యాలు లేకుండానే రెండున్నరేళ్లు లాక్కొచ్చినా ఇప్పుడు కొత్తగా నిర్మించుకున్న భవనంలో మాత్రం సకల సదుపాయాలు ఏర్పాటు చేసుకుంది.

**ప్రశాంత వాతావరణం**

నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా పచ్చని చెట్లను నరికేయకుండా ప్రొక్లెయిన్‌తో తొలగించి, మరో ప్రాంతంలో నాటారు. ప్రధాన ద్వారం నుంచి భవనంలోకి ప్రవేశించగానే కుడివైపు మెట్లు, లిఫ్ట్ ఉంటాయి. ఎడమవైపు రిసెప్షన్, వెయిటింగ్ హాల్ ఉంటుంది. ప్రతి ఫ్లోర్‌లోనూ ఎదురుగా కారిడార్ ఉంటే కుడివైపు అధికారి, ఎడమ వైపు సిబ్బంది పనిచేసేలా ఏర్పాట్లు చేశారు. కారిడార్‌లో సీసీ కెమెరాలతోపాటు ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేశారు. ఈ భవనంలో కొత్తగా చెప్పుకోవాల్సింది గోడలు లేకుండా పిల్లర్స్ వేసి అద్దాలతో నిర్మించడం. అవసరాన్ని బట్టి బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు వాడినా సిబ్బంది, ఇతరత్రా గదులకు రెండు అద్దాలు అమర్చి మధ్యలో ఆర్గానిక్ గ్యాస్ నింపారు. భవనం లోపల పనిచేసుకునే వారికి బయటి ఎండ వేడి తెలియకుండా ప్రశాంత వాతావరణంలో పనిచేయడానికి వీలుగా ఏర్పాట్లుచేసినట్లు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రతి ఫ్లోర్‌కు డైనింగ్ హాల్, సమావేశ మందిరం, రెండు కామన్ టాయ్‌లెట్లు నిర్మించారు.

# పోలవరానికి నిధులేవీ?

- జాతీయ హోదాతోనే సరిపెట్టిన కేంద్రం
- 2014 ధరల సవరణకు మీనమేషాలు
- పీపీఏ గడప దాటని అంచనాలు
- నేడు పోలవరానికి సీఎం

అమరావతి/రాజమహేంద్రవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టు. దీని కుడి, ఎడమ ప్రధాన కాలువల్లోకి నీరు పారించి ఏపీని నిత్యం సస్యశ్యామలంగా ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యం. పట్టిసీమ ద్వారా కుడి కాలువ గుండా ఇప్పటికే కృష్ణానదికి నీళ్లు మళ్లిస్తున్నారు. ఎడమ కాలువలోకీ నీరు ఎత్తిపోయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమ కాలువలోకి నీరు పారించేందుకు ఈనెల 15 ముహూర్తంగా ఖరారైంది. ఈ మేరకు పనులు పూర్తి చేయాలని సీఎం నిర్దేశించారు. ప్రతి సోమవారం పోలవరం పనులపై సమీక్షించే సీఎం... ఈవారం మాత్రం క్షేత్రస్థాయిలోనే పనులు పరిశీలించాలని నిర్ణయించారు. సోమవారం ఉదయం తొలుత పురుషోత్తపట్నం, తర్వాత పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో అక్కడే సమీక్షిస్తారు. పోలవరం ప్రధాన ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నా... నిధుల లేమి తీవ్ర సమస్యగా మారింది. 2010-11 అంచనాల మేరకు ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.16,010.45 కోట్లు. కానీ, 2013 భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చాక భూసేకరణ వ్యయం అమాంతం పెరిగిపోయి రూ.32000 కోట్లకు చేరుకుంది. పోలవరం ప్రధాన పనుల వ్యయం రూ.16,000 కోట్లకు చేరింది. మొత్తంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తుది అంచనాలను రూ.48,000 కోట్లుగా రూపొందించింది. కానీ, 2014నాటి ఈ అంచనాలు పీపీఏ నుంచి కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు చేరలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ప్రకటించింది. కానీ, తాజా అంచనాల విషయంలో మాత్రం కేంద్రం నుంచి స్పష్టత రాలేదు. ఫలితంగా... పనులు శరవేగంగా జరుగుతున్నా నిధులు లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వాన్ని కలవరపెడుతోంది. ప్రాజెక్టు అంచనాలను సవరించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నట్లే... తాము చేస్తోన్న పనులకు సంబంధించి అంచనాలను పెంచాలని ప్రభుత్వాన్ని ప్రధాన కాంట్రాక్టు సంస్థ కోరుతోంది. ఈనెల 24న పోలవరం ప్రాజెక్టు వద్దే నిర్వహించే పీపీఏ సమావేశానికి కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి అమర్జిత్‌సింగ్ హాజరవుతున్నారు. ఈలోగా కేంద్రంపై ఒత్తిడి పెంచే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కాగా, ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన 518 మంది ఏఈఈలకు నియామక పత్రాలను పోలవరం ప్రాజెక్టు వద్ద సీఎం అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు వద్ద నియామకపత్రాలు అందించడం ద్వారా జల ప్రాజెక్టుల నిర్మాణంలో అంకితభావాన్ని ప్రదర్శించాలన్న స్ఫూర్తిని నింపాలని సీఎం నిర్ణయించారు.

**ఇదీ పురుషోత్తపట్నం**

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం ఎడమ ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసి... అక్కడినుంచి ఏలేరు ఆయకట్టుకు, విశాఖకు మంచినీరు ఇవ్వడం లక్ష్యం. ఇందుకోసం సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద 10 పంపులతో పంపుహౌస్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి 10కిలోమీటర్ల వరకూ 5లైన్ల పైపులైను నిర్మించి గండికోట వద్ద పోలవరం కాలువలోకి నీటిని పంపిస్తారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో గోదావరి ఎత్తిపోతల పథకం పేరిట 8 పంపులతో హౌస్ నిర్మించి 4లైన్లతో నీటిని ఏలేరు రిజర్వాయరులోకి తోడతారు. అక్కడ లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందివ్వడం లక్ష్యం. అక్కడినుంచి విశాఖ వాసుల మంచినీటి అవసరాలు తీరడానికి 10-12 టీఎంసీల నీరు పంపించాలనేది లక్ష్యం. ఆగస్టు 15న రెండు పంపుల ద్వారా నీరుతోడి ఒక పైపులైను ద్వారా గండికోట వద్ద పోలవరం కాలువకు నీటిని వదులుతారు. కొద్దిరోజులపాటు 50 కిలోమీటర్ల మేర పోలవరం కాలువను నింపుతారు. తర్వాత హైవేలో రోడ్డుబ్రిడ్జిలు పూర్తయిన తర్వాత ఏలేరు ఆయకట్టుకు పంపించడానికి మరో ఎత్తిపోతల పథకం నిర్మించాల్సి ఉంది.

## ఇనుపమెట్ల నిర్మాణంపై వెనక్కి తగ్గిన టీటీడీ

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఇనుప మెట్ల నిచ్చెన నిర్మాణంపై టీటీడీ వెనక్కి తగ్గింది. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంది. రద్దీ సమయాల్లో వెండివాకిలి వద్ద తోపులాటను నివారించడంతోపాటు అత్యవసర ద్వారం ఉండాలనే ఉద్దేశంతో టీటీడీ నాలుగు రోజుల కిందట ఇనుపమెట్ల వంతెన ఏర్పాటు పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నిర్మాణం ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా ఉందని, మూలమూర్తికి పైభాగంలో ఎవరూ నడవకూడదంటూ విమర్శలు వచ్చాయి. భక్తులతో పాటు వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులు, స్థానిక నేతల నుంచి వ్యతిరేకత రావడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులతో టీటీడీ మెట్లనిర్మాణం పనులను నిలిపేసింది. కాగా, ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న సీఎస్ దినేష్‌కుమార్ కూడా ఈ దీనిపై టీటీడీ అధికారులతో చర్చించినట్టు సమాచారం. భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతానికి ఈ నిర్మాణాన్ని తొలగిస్తున్నామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పేర్కొన్నారు.

## హజ్ యాత్రికులకు యరపతినేని ఆర్థికసాయం

- 20మందికి 20లక్షలు అందించిన ఎమ్మెల్యే

పిడుగురాళ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లే పేద ముస్లింలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గం నుంచి ఈ యాత్రకు వెళ్తున్న 20మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.20 లక్షలు పంపిణీ చేశారు. ఆదివారం పిడుగురాళ్లలోని మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో పిడుగురాళ్ల మండలం నుంచి ఇద్దరు, గురజాల నుంచి ఇద్దరు, దాచేపల్లి నుంచి 9మంది, మాచవరం నుంచి ఏడుగురికి ఈ మొత్తానికి చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ దేశంలో ఇంత మంచి కార్యక్రమాన్ని ఎవరూ నిర్వహించలేదని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ముస్లింలకు ఏ స్థాయిలో ప్రాధాన్యం ఇస్తున్నారో ఈ ఉదంతం రుజువు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, ఎమ్మెల్సీ షరీఫ్, హజ్‌కమిటీ చైర్మన్ మొమిన్ అహ్మద్‌హుస్సేన్, జిల్లాపరిషత్ చైర్మన్ జానీమూన్, హజ్‌కమిటీ డైరెక్టర్ హసన్ బాషా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, ఎండీ హిదాయిత్, టీడీపీ ప్రధాన కార్యదర్శి లాల్‌వజీర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న జలీల్‌ఖాన్, యరపతినేని, షరీఫ్ తదితరులు



**హజ్‌కు వెళ్తాననుకోలేదు**

నేనెప్పుడూ హజ్‌కు వెళ్తానని ఊహించలేదు. ప్రతిరోజూ నేను చేసే ప్రార్థన అల్లా విన్నాడు. ఈ రూపేణా తనను చూసే భాగ్యం కల్పించాడు.

– ఎస్‌కె నజీం, పిడుగురాళ్ల



**అల్లా చల్లగా చూడాలి**

హజ్ యాత్రకు వెళ్తున్నామంటే రూ.5వేలో, రూ.10వేలో ఇస్తారు. ఇలా లక్షలకు లక్షలు ఎవరిస్తారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారాన్ని మర్చిపోలేం. ఆయనను అల్లా చల్లగా చూడాలి.

– ఎస్‌కె రంజాన్‌బి, గురజాల

## నక్సల్స్ కాల్పుల్లో ఎస్సై మృతి

- కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు... ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఘటన

రాజ్‌నంద్‌గావ్, ఆగస్టు 6: ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో పోలీసులు, నక్సల్స్‌కు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఎస్సై మృతిచెందగా, ఓ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం ఇక్కడి అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గటపర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న భావే గ్రామానికి సమీపంలో పోలీసులపై మావోయిస్టులు దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 2008 బ్యాచ్‌కి చెందిన ఎస్సై యుగల్ కిశోర్‌వర్మ అక్కడే మృతిచెందారు. కానిస్టేబుల్ కృష్‌సాహుకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో, పెద్దసంఖ్యలో అదనపు బలగాలను అక్కడకు తరలించామని, నక్సల్స్ అడవిలోకి పారిపోయారని దుర్గ్ రేంజ్ ఐజీ దీపాంశు కబ్రా తెలిపారు.

# చీట్‌ఫండ్స్

- ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్ల స్వీకరణ
- పెట్టుబడులు గ్రూప్ సంస్థలకు మళ్లింపు
- సేకరించిన గ్రూపు గుట్టును పసిగట్టిన ఆర్బీఐ
- జాబితాలో మరో మూడు ప్రముఖ కంపెనీలు

(హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

నమ్మకానికి మారు పేరు.. విశ్వాసానికి మరో రూపం.. అంటూ విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్న కొన్ని బడా చిట్‌ఫండ్ కంపెనీలు చట్టం కళ్లు గప్పి ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్లు సేకరిస్తున్నాయి. అలా సేకరించిన ప్రజల సొమ్మును తమ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులుగా పెడుతూ వాటి విలువను అమాంతం పెంచుకుంటూ వందలకోట్ల రూపాయల విలువైన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటున్నాయి. ప్రముఖ ఆర్థిక నేరాల విచారణ సంస్థలను సైతం బురిడీ కొట్టిస్తున్నాయి. లోతైన విచారణ చేస్తే తప్ప బయటపడని ఆర్థిక నేరాలను దర్జాగా చేసేస్తున్నాయి. ఇందుకు తెలుగు రాష్ట్రాలను అడ్డాగా చేసుకుంటున్నాయి. స్వయంగా ఆర్బీఐ వెల్లడించిన వాస్తవాలివి. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడులో భారీగా చిట్‌ఫండ్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న నాలుగు కంపెనీలపై గత ఏడాదిన్నర కాలంలో ఆర్బీఐకి పలు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆర్బీఐ వాటిపై చిట్ నియంత్రణ సంస్థలతోపాటు తెలంగాణ, ఆంధ్ర పోలీసులతో, సెబీతో విచారణ జరిపించింది. ఆ కంపెనీలు తమ అక్రమాలు బయటపడకుండా దొంగాటాడుతున్నాయని గుర్తించింది. ఇటీవలే సమన్వయ సమావేశం నిర్వహించి.. ఆ నాలుగు బడా కంపెనీలపైనా, వాటి వ్యాపార సామ్రాజ్యాలపైనా పోలీసులకు, బ్యాంకులు, ఇతర ఆర్థిక నియంత్రణ సంస్థలకు వివరాలు అందించింది.

**డిపాజిట్లు కాదట.. అడ్వాన్సులట!**

తెలుగువాడైన ఓ చార్టర్డ్ అకౌంటెంట్ 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఒక చిట్ కంపెనీపై ఆర్బీఐ గట్టిగా కన్నేసింది. ఈ సంస్థకు తెలుగు రాష్ట్రాలతో కలిపి దేశవ్యాప్తంగా 140కిపైగా బ్రాంచ్‌లు, 15 వేల మంది సిబ్బంది ఉన్నారు. చిట్‌ఫండ్ బిజినెస్‌లో రాణిస్తున్న ఈ సంస్థ రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగం, మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ఫుడ్స్, విల్లాస్, ఆగ్రోఫామ్స్‌తో పాటు అనేక రంగాల్లో వ్యాపారాలు చేసే కంపెనీలను కలిగి ఉంది. ఈ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు స్వీకరిస్తోందని ఫిర్యాదులు రావడంతో.. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు(ఎస్ఎఫ్ఐవో)తో ఆర్బీఐ విచారణ జరిపించింది. దీనికి ఆ సంస్థ.. "మేము ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించట్లేదు. మా దగ్గర భూములు, ఇతర ఆస్తులు పొందుతున్న వారి నుంచి ముందస్తుగా అడ్వాన్స్ తీసుకుంటున్నాం" అని వివరణ ఇచ్చింది. కానీ.. సదరు చిట్స్ గ్రూప్ చెబుతున్న సమాధానానికి, ఆ కంపెనీ నిర్వహిస్తున్న రికార్డులకు పొంతన లేదని, ఏదో తేడా జరుగుతోందని ఎస్ఎఫ్ఐవో గుర్తించి, ఆ విషయాన్ని ఆర్బీఐకి నివేదించింది. అదే కాదు.. ఆ చిట్స్ గ్రూప్‌లోని మరో అనుబంధ సంస్థ (డెవలపర్స్ ఏజెన్సీ) ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు వసూలు చేస్తోందని అధికారులు గుర్తించారు. లోతైన విచారణ జరిపి.. ఆ గ్రూపు తప్పుడు ఆర్థిక నివేదికలు తయారుచేస్తోందని నిగ్గు తేల్చారు. ఇదే సంస్థ మరో అనుబంధ కంపెనీ పేరిట తెలంగాణలోనూ కార్యకలాపాలు నిర్వహిస్తోందని గుర్తించారు. ఆ సంస్థ అక్రమాల గుట్టును విప్పేందుకు సీఐడీని రంగంలోకి దించాలనే యోచనకు వచ్చారు. కానీ ఆ సంస్థ చాలా 'బలమైనది' కావడంతో ఆర్బీఐ ఆచితూచి స్పందిస్తోంది.

**డిపాజిట్లే పెట్టుబడులు**

ఒక చిట్‌ఫండ్ కంపెనీ గ్రూప్‌కు అనుబంధంగా ఇన్‌ఫ్రా కంపెనీ ఉంది. అది 12 నెలల స్కీమ్ ఒకటి చేపట్టింది. ఇది డీఫాల్ట్ అయింది. మరో సంస్థ కూడా ఇలాంటి స్కీమే చేపట్టింది. ఖాతాదారుల నుంచి టవర్‌స్కీమ్ పేరిట డిపాజిట్లు సేకరిస్తూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తోందని గుర్తించారు. "ఈ సంస్థకు చిట్స్ పేరిట వస్తున్న డబ్బును ఇతర కంపెనీలకు దారిమళ్లిస్తోంది" అని రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ కూడా నిర్ధారించారు. ఈ సంస్థపై గట్టి నిఘాపెట్టిన ఆర్బీఐ.. గత ఏడాది నోట్ల రద్దు సమయంలో అది దాదాపు రూ.100 కోట్లకు పైగా రద్దయిన నోట్లను సేకరించినట్టు గుర్తించింది. అయితే.. ఆ రూ.100 కోట్లను భూమి కొనుగోలుకు సంబంధించిన డిపాజిట్లుగా చూపిస్తోందా సంస్థ. నిజానికి ఈ చిట్స్ గ్రూప్ కంపెనీ బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించట్లేదు. అలాంటిది ఏకంగా ఇంత మొత్తంలో సొమ్ము సేకరించడంతో ఆదాయపన్ను శాఖతో విచారణ జరిపించింది. ఆ సంస్థ బ్యాంకింగేతర వ్యవహారాలు చేస్తూ రూ.100 కోట్ల సేకరణను చట్టబద్ధం చేసేలా వ్యూహం పన్ని బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు గుర్తించింది. ఇది నిబంధనలకు విరుద్ధమని.. చిట్‌ఫండ్ కంపెనీ, చిట్స్‌తో సంబంధం లేని వ్యాపారంలో డిపాజిట్లు చూపించడాన్ని నేరమేనని ఆర్బీఐ హెచ్చరిస్తోంది. "ఒక కంపెనీకి చెందిన అకౌంట్‌లోని డబ్బు మరో కంపెనీలోకి ఖాతాలోకి మళ్లించడం అనుమానస్పదంగానే ఉంది. దీన్ని వదిలేయడానికి వీల్లేదు" అని తేల్చిచెప్పింది.

**మంది సొమ్ముతో..**

ఆర్బీఐ స్కానింగ్‌లో ఉన్న మరో మూడు ప్రముఖ చిట్స్, ఆగ్రోఫామ్స్ కంపెనీలకు ఏపీ, తెలంగాణల్లో భారీగా బ్రాంచ్‌లున్నాయి. విజయవాడ ప్రధాన కేంద్రంగా పనిచేసే మరో ప్రముఖ గ్రూప్ ఉంది. ఈ సంస్థలు ప్రజల నుంచి వివిధ పేర్లతో అడ్డగోలుగా డిపాజిట్లు స్వీకరిస్తున్నాయని ఆర్బీఐ పక్కాగా గుర్తించింది. చిట్‌గ్రూప్ కలిగిన ఈ సంస్థ ఓ సహకార సంస్థను కూడా నిర్వహిస్తోంది. దానికి ఫైనాన్స్, బంగారం, రియల్ ఎస్టేట్, విద్యాసంస్థలు, అడ్వర్టైజింగ్, వైద్యపరీక్షల విభాగాల్లో వ్యాపార సంస్థలున్నాయి. ఈ సంస్థ ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్లు సేకరిస్తూ.. వాటిని భూముల కొనుగోళ్ల లావాదేవీల కింద చూపిస్తున్నట్టు, ఆ సొమ్మును పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడిగా పెడుతున్నట్లు నిగ్గుతేల్చారు.




# తడబడిన థండర్ బోల్ట్

ప్రాణప్రదమైన కెరీర్‌ను వీడుతున్నానే బాధో.. ఇక అభిమానులను అలరించలేననే భావోద్వేగమో కానీ ఆఖరి వ్యక్తిగత పరుగులో థండర్ బోల్ట్ అడుగు తడబడింది. చివరి 100మీ రేస్‌లో స్వర్ణంతో గ్రాండ్‌గా కెరీర్‌కు గుడ్‌బై చెబుదామనుకున్న ఉసేన్ బోల్ట్ ఆశ నెరవేరలేదు. గాట్లిన్ చేతిలో అనూహ్య పరాజయంతో మూడో స్థానంలో నిలిచిన బోల్ట్ కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. అయితే ఒక్క ఓటమితో తన ప్రతిష్ఠ దిగజారదని బోల్ట్ అన్నాడు. గెలిచినప్పుడు ఎలా ఉన్నాడో.. ఓడినప్పుడూ అంతే హుందాగానే వ్యవహరించాడు. దశాబ్దంపాటు కింగ్‌గా స్ప్రింట్ సామ్రాజ్యాన్ని ఏలిన బోల్ట్.. ట్రాక్ అండ్ ఫీల్డ్స్ చరిత్రలో లెజెండ్‌గా తన పేరును సువర్ణాక్షరాలతో రాసుకున్నాడు.


నీకే.. అభివందనం

బోల్ట్ ముందు మోకరిల్లిన గాట్లిన్

● చివరి 100 మీ. రేస్‌లో కాంస్యం ● గాట్లిన్ చేతిలో ఓటమి ● మూడో స్థానంతో కెరీర్‌కు వీడ్కోలు

**లండన్:** జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ రేస్‌లో ఉన్నాడంటే.. ప్రత్యర్థులు మానసికంగా సిద్ధమయ్యేది రెండో స్థానానికే..! ట్రాక్‌పై మంటలు పుట్టించే థండర్ బోల్ట్.. తొమ్మిదేళ్లపాటు స్ప్రింట్ కింగ్‌గా ప్రపంచాన్ని ఏలాడు. బోల్ట్ అంటే.. అది 'స్వర్ణ పరుగే' అని ముద్ర బలంగా పడిపోయింది. అయితే చివరి వ్యక్తిగత రేస్‌ను అజేయుడిగా ముగించాలనుకున్న బోల్ట్ కల నెరవేరలేదు. ఐఏఏఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఆదివారం జరిగిన 100మీ ఫైనల్లో బోల్ట్‌కు చిరకాల ప్రత్యర్థి జస్టిన్ గాట్లిన్ షాకిచ్చాడు. భూమి మీద 'ఫాస్టెస్ట్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న బోల్ట్.. అంతిమ పరుగులో 9.95 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాడు. గతంలో రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడి నిషేధానికి గురైన గాట్లిన్.. 9.92 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణాన్ని సాధించగా.. అమెరికాకే చెందిన క్రిస్టియన్ కోల్‌మన్ (9.94 సె) రజతాన్ని సొంతం చేసుకున్నాడు. ఆరంభంలోనే తడబడిన బోల్ట్.. ఆఖరికి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. 'నన్ను క్షమించండి. విజయంతో ముగించలేకపోయాను. కానీ మీ అభిమానానికి కృతజ్ఞతలు'ని రేస్ ముగిసిన అనంతరం ఉసేన్ చెప్పాడు. అయితే డోపీ అయిన 35 ఏళ్ల గాట్లిన్ చేతిలో ఉసేన్ పరాజయం పాలవడాన్ని అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. స్టేడియం మొత్తం అతడిని హేళన చేసింది. మొత్తం మీద బోల్ట్ గ్రాండ్ కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకకుండా జస్టిన్ అడ్డుపడ్డాడు. ఫ్యాన్స్ హేళనలను పట్టించుకోనని.. అందుకు మానసికంగా ఎప్పుడో సిద్ధమయ్యానని గాట్లిన్ చెప్పాడు. బోల్ట్‌ను ఓడించడానికి అతడినే స్ఫూర్తిగా తీసుకున్నానన్నాడు. ట్రాక్‌పై ఉసేన్‌తో శత్రుత్వం ఉన్నా.. బయట మాత్రం మంచి మిత్రులమేనని గాట్లిన్ చెప్పాడు. అయితే రేస్ నెగ్గిన అనంతరం దిగ్గజం ముందు గాట్లిన్ మోకరిల్లడం.. బోల్ట్ మహోన్నతానికి నిదర్శనం! 2008 బీజింగ్ ఒలింపిక్స్ మొదలు రియో వరకు వరుసగా స్వర్ణాలతో 'డబుల్ ట్రిపుల్' సాధించిన జమైకన్.. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో 12వ స్వర్ణంతో గ్రాండ్‌గా గుడ్ బై చెబుదామనుకున్నాడు. కానీ ఫలితం తలకిందులైంది. బోల్ట్.. ఈ నెల 12న జరిగే 4X100 రిలేతో శాశ్వతంగా అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్నాడు. కాబట్టి గోల్డ్‌తో కెరీర్ ముగించేందుకు అతనికి మరో చాన్స్ ఉంది.

## సెమీస్‌లో నిర్మల


నిర్మల

**లండన్:** వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో మహిళల 400మీ.లో భారత అథ్లెట్ నిర్మలా షరాన్ సెమీస్‌కు చేరుకుంది. కాగా, మిగతా అథ్లెట్లు తీవ్రంగా నిరాశపరిచారు. 22 ఏళ్ల నిర్మల.. 400మీ. హీట్స్‌లో 52.01 సెకన్ల టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల మారథాన్‌లో టి. గోపీ 28వ స్థానంలో నిలవగా.. 110 మీ. హర్డిల్స్‌లో సిద్ధాంత్ థింగాలయ హీట్స్‌లోనే వెనుదిరిగాడు.

● పురుషుల మారథాన్‌లో కెన్యా అథ్లెట్ జొఫ్రీ కొప్కోరిరర్ కిరుయి స్వర్ణం సాధించాడు. మహిళల 10వేల మీటర్ల రేసులో ఇథియోపియా రన్నర్లు అయానా (30:16.32), దిబాబ (31.02.69) స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు. పురుషుల లాంగ్‌జంప్‌లో యువో మన్యోంగా 8.48 మీటర్లు దూకి స్వర్ణం అందుకున్నాడు.

## గాయత్రి డబుల్ ధమాకా


గాయత్రి ఆకర్షి

● ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ టోర్నీ

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పుల్లెల గాయత్రి డబుల్ సాధించింది. బాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో టైటిళ్లతో సత్తాచాటింది. బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ గోపీచంద్ కుమార్తె అయిన ఏడోసీడ్ గాయత్రి చెన్నై వేదికగా ఆదివారం జరిగిన బాలికల అండర్-17 సింగిల్స్ ఫైనల్లో 21-19, 15-21, 21-18తో గోపీచంద్ అకాడమీకే చెందిన టాప్‌సీడ్ ఆకర్షి కశ్యప్‌పై మూడు గేమ్‌లపాటు పోరాడి గెలిచింది. బాలికల అండర్-17 డబుల్స్ విభాగంలో నాలుగోసీడ్ గాయత్రి-సమియా ఇమాద్ ఫరూఖి జోడీ 21-19, 17-21, 21-12తో మూడోసీడ్ కెయూరా మోపాటి-కవిప్రియ ద్వయంపై విజయం సాధించింది.

## పట్నా హ్యాట్రిక్ విక్టరీ

● బెంగాల్ చేతిలో యూపీ చిత్తు

**నాగ్‌పూర్:** ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ పట్నా పైరేట్స్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విజయంతో హ్యాట్రిక్ సాధించింది. ఆదివారం జరిగిన పోరులో పట్నా 46-32తో బెంగళూరు బుల్స్‌ను చిత్తుగా ఓడించింది. పైరేట్స్ కెప్టెన్ పర్‌దీప్ నర్వాల్ 15 పాయింట్లతో మరోసారి చెలరేగి జట్టును ముందుండి నడిపించాడు. మోను గోయత్ (7), వినోద్ కుమార్ (7) రాణించారు. పట్నా ఏకంగా నాలుగు సార్లు ప్రత్యర్థిని ఆలౌట్ చేయడం విశేషం. కాగా, మరో మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 40-20తో యూపీ యోధాపై ఘన విజయం సాధించింది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో బెంగాల్ ఆటగాళ్లు వినోద్ కుమార్ (8), జాంగ్ కున్ లీ (7) రాణించారు.

## ఇంగ్లండ్‌కు భారీ ఆధిక్యం

రెండో ఇన్నింగ్స్‌లో 224/8

**మాంచెస్టర్:** దక్షిణాఫ్రికాతో నాలుగో, చివరి టెస్టులో ఇంగ్లండ్ భారీ ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికాను 226 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజైన ఆదివారం చివరకు 224/8 స్కోరుతో నిలిచింది. ప్రస్తుతానికి ఆతిథ్య జట్టు 360 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. మొయిన్ అలీ (67 బ్యాటింగ్), స్టువర్ట్ బ్రాడ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. జో రూట్ (49) రాణించాడు. సఫారీ బౌలర్లలో ఒలీవర్ మూడు, మోర్నె మోర్కెల్, రబాడ రెండేసి వికెట్లు తీశారు. మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 362 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.

## బోల్ట్.. ఎప్పటికీ గ్రేట్ !

బరిలో దిగాడంటే అతడిదే అగ్రస్థానం..! చిరుతను మరిపించే వేగం..! ప్రత్యర్థులకు అందనంత దూరం..! పోటీ ఎక్కడైనా అతడిదే స్వర్ణం. అందుకే యావత్ ప్రపంచం అతడి చివరి స్ప్రింట్ పరుగు కోసం ఊపిరిబిగబట్టి ఎదురు చూసింది..! అయితే తుది సమరంలో అతడు పసిడి కాంతులు వెదజల్లకపోయి ఉండవచ్చు.. అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయి ఉండవచ్చు.. కానీ అతడు సాధించిన రికార్డులు అనన్యసామాన్యం.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో అతడిదో శకం.. అదే ఉసేన్ బోల్ట్ యుగం..!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఫ్రాంక్ వారెల్, మైకేల్ హోల్డింగ్, జెఫ్ దుజాన్, ఇప్పుడు క్రిస్‌గేల్.. ఈ గొప్ప క్రికెటర్లంతా జమైకా పేరు ప్రఖ్యాతులు చాటితే.. ఉసేన్ బోల్ట్ తన 'పరుగు'తో ఆ దేశ పతాకను వినువీధుల్లో సగర్వంగా రెపరెపలాడించాడు. కరీబియన్ సముద్రంలోని ఓ దీవి జమైకా. క్రికెట్ అంటే ప్రాణమిచ్చే ఆ దేశానికి బోల్ట్ ఓ పర్యాయపదంగా నిలిచాడంటే అతిశయోక్తికాదు! 12 ఏళ్ల వయసులో ప్రైమరీ స్కూల్ 100మీటర్ల పోటీల్లో బోల్ట్‌దే హవా. ఆ తర్వాత ఒలింపిక్ స్ప్రింట్ మాజీ అథ్లెట్ పాబ్లొ మెక్‌నీల్, కోచ్ డ్వేన్ జారెట్ ఆధ్వర్యంలో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఓనమాలు దిద్దుకున్న



బోల్ట్.. 2004లో ప్రొఫెషనల్‌గా మారాడు. అప్పటినుంచీ 100, 200 మీటర్లతోపాటు రిలే పరుగుల్లో వేసిన ముద్ర అతడికి స్ప్రింట్ దిగ్గజ అథ్లెట్ స్థాయి తీసుకొచ్చింది. ఇక 2009 బెర్లిన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 100 మీటర్లలో (9.58 సెకన్లు), 200 మీటర్లలో (19.19 సెకన్లు) వరల్డ్ రికార్డులు సృష్టించడం ద్వారా ఎవరూ అందుకోలేనంత ఎత్తుకెదిగాడు బోల్ట్.

**మచ్చలేని కెరీర్:** అథ్లెటిక్స్ అంటేనే డ్రగ్స్ మయం. ఎందరో మేటి అథ్లెట్లు డ్రగ్స్‌వాడి అపఖ్యాతిపాలయ్యారు. అంతెందుకు గతరాత్రి బోల్ట్‌ను తలదన్ని 100 మీటర్ల టైటిల్ ఎగరేసుకుపోయిన అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్‌నే తీసుకోండి. రెండుసార్లు డ్రగ్స్ వాడి నిషేధానికి గురయ్యాడు. కానీ బోల్ట్ డ్రగ్స్ ఊసేలేకుండా అథ్లెటిక్స్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాడు.

**ఆఖరి పరుగు...:** బోల్ట్ ఆఖరి పరుగుకోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురు చూశారు. కానీ అతడు మూడోస్థానంతో ముగించడంతో వారి గుండె పగిలింది. అయితే తాను విషాదంలో మునిగి అభిమానులను మరింత బాధలోకి నెట్టకూడదనుకున్నాడు కాబోలు.. రేస్ పూర్తయిన తర్వాత బోల్ట్ మోముపై చిరునవ్వు చెదరకుండా.. తనదైన డ్యాన్స్‌ను ప్రదర్శించి వారిని హుషారెత్తించేందుకు ప్రయత్నించాడు. ఇన్నేళ్లూ తనకు మద్దతుగా నిలిచినందుకు అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు. ఏమైనా.. దిగ్గజ బాక్సర్ మహ్మద్ అలీ తర్వాత ప్రపంచం అంతగా అభిమానించిన మరో ఏకైక క్రీడాకారుడు బోల్ట్. 4X100 మీటర్ల రిలేలో పసిడి పతకంతో తన కెరీర్ సంపూర్ణంగా ముగించాలని ఆశిద్దాం.

శ్రీలంక గడ్డపై తిరుగులేని ప్రదర్శనతో టీమిండియా మరో సిరీస్‌ను చేజిక్కించుకుంది..! నెంబర్ వన్ ఆటతో గాలెలోనే లంక గాలి తీసేసిన కోహ్లీసేన కొలంబోలో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో నెగ్గి మరో మ్యాచ్ మిగిలుండానే సిరీస్‌ను పట్టేసింది..! మూడో రోజు గట్టి పోటీ ఇచ్చినా.. ఆదివారం రవీంద్ర జడేజా (5/152) స్పిన్ వలలో చిక్కుకొన్న లంక రెండు సెషన్లలోనే మనకు దాసోహమంది..!

సరిగ్గా రెండేళ్ల కిందట.. ఇదే లంక గడ్డపై పూర్తి స్థాయి కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ తొలి సిరీస్‌ను చేజిక్కించుకున్నాడు..! తొలి టెస్టులో ఓడినా.. తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమిండియా కొత్త చరిత్రకు నాందిపలికింది..! నాడు మొదలైన జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది..! ఒకటా రెండా.. దక్షిణాఫ్రికా.. వెస్టిండీస్.. న్యూజిలాండ్.. ఇంగ్లండ్.. బంగ్లాదేశ్.. ఆస్ట్రేలియాలను మట్టికరిపించి అగ్రస్థానానికే వన్నె తెచ్చిన కోహ్లీసేన ఇప్పుడు వరుసగా ఎనిమిదో సిరీస్‌తో శిఖరానికి చేరుకుంది..! ఇదేజోరు కొనసాగితే ఇంగ్లండ్, ఆసీస్ 9 వరుస సిరీస్‌ల రికార్డును బ్రేక్ చేయడం ఖాయం..!

# లంక దాసోహం..

రెండో టెస్టులో చిత్తు

● జడేజాకు ఐదు వికెట్లు ● ఇన్నింగ్స్ 53 పరుగులతో నెగ్గిన టీమిండియా
● 2-0తో సిరీస్ భారత్ కైవసం ● కోహ్లీసేన ఖాతాలో వరుసగా ఎనిమిదో సిరీస్



**కొలంబో:** పరుగుల పోటీలో శ్రీలంకను టీమిండియా మరింత కసిగా వేటాడింది. రెండో టెస్టులో ఆతిథ్య జట్టు పోటీ ఇచ్చినా.. ఏకంగా ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో కుశాల్ మెండిస్‌తో పాటు దిముత్ కరుణరత్నె (141) సెంచరీ చేసినా.. రవీంద్ర జడేజా (5/152) స్పిన్ వలలో చిక్కుకున్న లంక 386 పరుగులకే ఆలౌటై సిరీస్‌ను వదులుకుంది. మాథ్యూస్ (36), డిక్‌వెలా (31) మాత్రమే కాసేపు పోరాడారు. అశ్విన్, హార్దిక్ చెరో రెండు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 622/9 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా.. లంక 183 రన్స్‌కే ఆలౌటైన సంగతి తెలిసిందే. హాఫ్ సెంచరీ చేయడంతో పాటు మొత్తంగా ఏడు వికెట్లు తీసిన జడేజాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు పల్లెకెలె వేదికగా 12న మొదలవుతుంది.

**జడేజా మాయాజాలం..:** 230 పరుగుల లోటుతో ఓవర్‌నైట్ స్కోరు 209/2తో లంక రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. మూడో రోజు మెండిస్‌తో 191 పరుగులు జోడించి ఆతిథ్య జట్టులో ఆశలు రేపిన కరుణరత్నె ఆదివారం కూడా పోరాటం కొనసాగించాడు. నైట్‌వాచ్‌మన్ పుష్పకుమార (16)తో మూడో వికెట్‌కు 40 పరుగులు జతచేశాడు. ఆరో ఓవర్లోనే కరుణరత్నె ఇచ్చిన క్యాచ్‌ను షార్ట్ లెగ్‌లో రాహుల్ చేజార్చాడు. తర్వాత ఎలాంటి పొరపాట్లకు తావివ్వని దిముత్ 224 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, అశ్విన్ వేసిన 73వ ఓవర్లో పుష్పకుమార బౌల్డ్ కావడంతో భారత్‌కు బ్రేక్ లభించింది. జడేజా వేసిన తర్వాతి ఓవర్లోనే స్లిప్‌లో రహానె పట్టిన డైవింగ్ క్యాచ్‌కు కెప్టెన్ దినేశ్ చాందిమల్ (2) అవుటవడంతో లంకకు భారీ షాక్ తగిలింది. కరుణరత్నెకు జత కలిసిన మాథ్యూస్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. దాంతో, లంక 304/4 స్కోరుతో లంచ్‌కు వెళ్లింది. విరామం తర్వాత జడేజా విజృంభించాడు. ఐదో వికెట్‌కు 69 పరుగులు జోడించిన కరుణరత్నె, మాథ్యూస్‌ను ఐదు పరుగుల తేడాతో అవుట్ చేసి ఆతిథ్య జట్టు ఆశలపై నీళ్లు కుమ్మరించాడు. జడేజా మరుసటి ఓవర్లోనే దిల్‌రువాన్ పెరీర (4) స్టంపౌటయ్యాడు. ఈ దశలో కాసేపు పోరాడిన దనంజయ డిసిల్వ (17) కూడా జడేజాకే వికెట్ ఇచ్చుకోగా.. పాండ్యా వైడ్ యార్కర్‌ను వెంటాడిన డిక్‌వెలా గల్లీలో రహానెకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇక, తొలి ఇన్నింగ్స్‌లో మెరిసినా.. రెండో ఇన్నింగ్స్‌లో అంతగా ప్రభావం చూపలేకపోయిన అశ్విన్.. ప్రదీప్ (1)ను చివరి వికెట్‌గా అవుట్ చేసి మ్యాచ్‌ను ముగించాడు.

**2** లంకపై వారి దేశంలో భారత్‌కు ఇది వరుసగా రెండో సిరీస్ విజయం. 2015లో 2-1తో నెగ్గింది.

**8** భారత్‌కు ఇది వరుసగా ఎనిమిదో సిరీస్ విజయం. ఇంగ్లండ్ (1884-92) ఆస్ట్రేలియా (2005-08) తొమ్మిది సిరీస్‌లతో అగ్రస్థానంలో ఉన్నాయి.


జడేజా (5/152)

జడేజాపై మ్యాచ్ వేటు..

శ్రీలంకతో రెండో టెస్టులో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన రవీంద్ర జడేజా పై ఐసీసీ ఒక టెస్ట్ మ్యాచ్ నిషేధం విధించింది. 24 నెలల కాలంలో జడేజా ఆరు డీమెరిట్ పాయింట్లకు చేరుకోవడంతో అతను సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆదివారం ఆటలో కరుణరత్నె క్రీజులో ఉన్నా.. జడేజా అతనిపైకి బంతి త్రో చేశాడు. దీన్ని ఫీల్డ్ అంపైర్లు ప్రమాదకర చర్యగా గుర్తించారు. లెవెల్-2 అభియోగం కింద రెఫరీ.. అతని మ్యాచ్ ఫీజులో యాభై శాతం కోతతోపాటు మూడు డీ మెరిట్ పాయింట్లు విధించాడు. 2016లో న్యూజిలాండ్‌తో టెస్టు సందర్భంగా కూడా జడేజా మూడు డీమెరిట్ పాయింట్లు ఎదుర్కొన్నాడు. దీంతో నిషేధం తప్పలేదు.

**భారత్ తొలి ఇన్నింగ్స్: 622/9 డిక్లేర్డ్; శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 183 ఆలౌట్;**

**శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్):** కరుణరత్నె (సి) రహానె (బి) జడేజా 141, తరంగ (బి) ఉమేష్ 2, మెండిస్ (సి) సాహా (బి) హార్దిక్ 110, పుష్పకుమార (బి) అశ్విన్ 16, చాందిమల్ (సి) రహానె (బి) జడేజా 2, మాథ్యూస్ (సి) సాహా (బి) జడేజా 36, డిక్‌వెలా (సి) రహానె (బి) పాండ్యా 31, పెరీర (స్టంప్డ్) సాహా (బి) జడేజా 4, డిసిల్వ (సి) రహానె (బి) జడేజా 17, హెరాత్ (నాటౌట్) 17, ప్రదీప్ (సి) ధవన్ (బి) అశ్విన్ 1; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 116.5 ఓవర్లలో 386 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-7, 2-198, 3-238, 4-241, 5-310, 6-315, 7-321, 8-343, 9-384; **బౌలింగ్:** ఉమేష్ 13-2-39-1, అశ్విన్ 37.5-7-132-2, షమి 12-3-27-0, జడేజా 39-5-152-5, పాండ్యా 15-2-31-2.



## 8 కిలోల పుట్టగొడుగు

8కిలోల బరువు.. 1.8 మీటర్ల చుట్టుకొలతో ఉన్న ఓ భారీ పుట్టగొడుగును చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఓ పార్క్‌లో గుర్తించారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద పుట్టగొడుగును గతంలో ఎన్నడూ చూడలేదని అధికారులు వెల్లడించారు. ఇది కొంతవరకు ఆకులతో ఉందని, గోధుమ రంగులో ఉందని తెలిపారు.

## నింగీనేలా ఒకటాయెలే..!

భూమికి 240 మీటర్ల ఎత్తున.. అటూ ఇటూ 65 మీటర్ల పొడవున కట్టిన తాడుపై నడక.. అదీ కళ్లకు గంతలు కట్టుకొని విజయవంతంగా అధిగమించడం అంటే మాటలా? తన దృష్టిలో నింగీనేలా ఒకటే అన్నట్టుగా ఈ ఫీట్‌ను సుసాధ్యం చేశాడు జర్మనీకి చెందిన స్కైవాకర్ కాయ్‌జీ! ఓ అవుట్‌డోర్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం కాయ్‌జీ ఈ అద్భుతాన్ని ప్రదర్శించాడు.



# విదేశీ పెట్టుబడులకు వేళాయె

- ఈ నెలలో ఆరు సంస్థలకు పునాది రాళ్లు
- 3 మెగా ప్రాజెక్టులకు ముహూర్తాలు ఖరారు
- అమరావతికి ఆభరణాలుగా వైద్య సంస్థలు
- 10న బీఆర్ శెట్టి సంస్థకు శంకుస్థాపన
- 16న ఇండో-యూకే ప్రాజెక్టుకు..
- 27న కర్నూలులో సీడ్ పార్క్‌కు శ్రీకారం
- మొత్తం ప్రాజెక్టుల విలువ రూ.11,819 కోట్లు
- అక్టోబరు నాటికి 20 సంస్థలు సన్నద్ధం?

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రకు భారీ పెట్టుబడులతో పలు సంస్థలు తరలివస్తున్నాయి. ఈ నెలలోనే ఏకంగా ఆరు సంస్థలు శంకుస్థాపనలకు సిద్ధమయ్యాయి. 'నూతన రాజధాని అమరావతిలో తొలి విదేశీ పెట్టుబడి నాదే కావాలి' అంటూ అబుదాబి కేంద్రంగా పని చేసే ప్రవాస భారత బిలియనీర్ బీఆర్ శెట్టి గతంలో ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఒప్పందాలు జరిగి భూకేటాయింపు కూడా పూర్తయినా... ఇటుఅటు కొన్ని కారణాలతో జరిగిన జాప్యం, వాయిదాల తర్వాత ఎట్టకేలకు ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నారు. అమరావతిలో మెగా ప్రాజెక్టుగా చెప్పుకోదగిన బీఆర్‌ఎస్ వెంచర్స్ వైద్య-పరిశోధనా సంస్థ పెట్టుబడి ఒప్పందం విలువ రూ.7,500 కోట్లు. పెట్టుబడి మొత్తం, ఉద్యోగాల సంఖ్య రీత్యా మెగా ప్రాజెక్టులుగా చెప్పుకోదగిన మరో మూడు కూడా విదేశీ సంస్థలవే. అమరావతిలోనే ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థలు పురుడు పోసుకుంటుండగా... అయోవా స్టేట్ యూనివర్సిటీ మెగా సీడ్ పార్కు, గౌటెఫోన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ఎలక్ట్రానిక్స్-ఎల్‌సిడి ఉత్పత్తి యూనిట్, నియో ఫార్మా యూనిట్ ఏర్పాటుకు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డు(ఈడీబీ)విదేశాల్లో జల్లెడ పట్టి రూపొందించిన ప్రతిపాదనల్లో ఆచరణ రూపు దాలుస్తున్న కొన్ని ప్రాజెక్టులివి.



**ఇవీ ముహూర్తాలు..!**

అమరావతి ప్రాంతంలో బీఆర్‌ఎస్ వెంచర్స్ హెల్త్ ప్రాజెక్టుకు 10వ తేదీన, ఇండో-యూకే ప్రాజెక్టుకు 16వ తేదీన శంకుస్థాపన జరగనుంది. అయోవా స్టేట్ యూనివర్సిటీ కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన మెగా సీడ్ పార్కుకు 27వ తేదీన శంకుస్థాపన జరగనుంది. సీడ్ పార్కును ప్రాథమికంగా రూ.150 కోట్లతో ఏర్పాటు చేసినా భవిష్యత్తులో అందులోకి సుమారు రూ.13 వేల కోట్ల మేరకు పెట్టుబడులు వస్తాయని చెబుతున్నారు. బీఆర్ శెట్టి తన మొత్తం సంస్థల ద్వారా రాష్ట్రంలో పెడతానన్న రూ.12,500కోట్ల పెట్టుబడిలో అతి పెద్దది అమరావతిలో తలపెట్టిన ఆస్పత్రి-వైద్య పరిశోధనా సంస్థ. ఈ నెలలో శంకుస్థాపన జరిగే అవకాశం ఉన్న నియోఫార్మా ఫార్మాస్యూటికల్ కూడా బీఆర్ షెట్టిదే. నియోఫార్మా విశాఖలోని రాంకీ ఫార్మా పార్కు నుంచి 35 ఎకరాల స్థలాన్ని పొందింది. ప్రస్తుతం భూమిని చదును చేస్తున్నారు. ఇక మిగిలిన రెండు ప్రాజెక్టులకు దేశీ కంపెనీల నేపథ్యం ఉన్నా... విదేశీ సహకారంతో ఏర్పాటవుతున్నాయి. ఎలక్ట్రానిక్స్-ఎల్‌సీడీ ఉత్పత్తి యూనిట్ రాయితీల వ్యవహారం ఐటీ శాఖ వద్ద పెండింగ్‌లో ఉండగా... మరో ప్రాజెక్టు భూమి పునఃకేటాయింపు పని సీసీఎల్‌ఏ వద్ద పెండింగ్‌లో ఉంది. సీడ్ పార్కులో భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉన్న రూ.13వేల కోట్ల పెట్టుబడులను పక్కన పెడితే ఈ నెలలో శంకుస్థాపనలు జరగనున్న ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.11,819 కోట్లుగా ఉంది.

**అక్టోబరులో 20 ప్రాజెక్టులు?**

ఏపీ ఈడీబీ అధికారుల తాజా అంచనాల ప్రకారం... వచ్చే అక్టోబరు నాటికి మరో 20 ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో కాలు మోపాల్సి ఉంది. బీఆర్ శెట్టి అమరావతిలో కన్వెన్షన్ సెంటర్, హోటల్ నిర్మాణానికి రూ.4,500 కోట్ల పెట్టుబడిని ప్రతిపాదించారు. అయితే, ఈ ప్రాజెక్టుకు సీఆర్డీయే భూమిని కేటాయించాల్సి ఉంది. కొరియా కంపెనీల కోసం అనంతపురంలో ప్రతిపాదించిన పారిశ్రామిక పార్కుకు కూడా భూమి కేటాయించాల్సి ఉంది. మిగిలిన ప్రాజెక్టులలో కొన్ని స్వదేశీ, విదేశీ సంస్థలవి ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ.17,010 కోట్లు. ఈ 20 ప్రాజెక్టులలో సూక్ష్మ-చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించిన మల్లవల్లి పారిశ్రామిక అసోసియేషన్ ప్రతిపాదన కూడా ఒకటి. రూ.1,100 కోట్ల పెట్టుబడితో 18,500 మందికి ఉపాధి కల్పిస్తామని ప్రతిపాదించిన ఈ అసోసియేషన్ కోరినంత భూమిని ఇవ్వడానికి ఏపీఐఐసీ సిద్ధంగా లేదు. వివిధ కారణాలతో కొన్ని ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుంటే సమయానికి మెజారిటీ ప్రాజెక్టులు పట్టాలెక్కే అవకాశం ఉంటుంది.

## సీపీఎం వల్లే కేరళలో రాజకీయ హింస

- ఇదే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగితే అవార్డులు వెనక్కి ఇచ్చేసేవారు: జైట్లీ
- బీజేపీ నేత కొడుకు నిర్వాకంపై మోదీ, షా మౌనం: ఏచూరి

తిరువనంతపురం, ఆగస్టు 6: కేరళలో రాజకీయ హింసకు కారణం సీపీఎం పార్టీయేనని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో కేరళ తరహా హింస చోటు చేసుకుని ఉంటే ఊరావాడా ఏకం చేసేవారన్నారు. 'అవార్డులను వెనక్కి ఇచ్చేసేవారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అడ్డుపడేవారు. ఇంటా, బయటా వ్యతిరేక ప్రచారం చేపట్టేవారు' అంటూ ఎద్దేవా చేశారు. ప్రత్యర్థుల చేతిలో దారుణహత్యకు గురైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేశ్ సంస్మరణార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జైట్లీ హాజరయ్యారు. హతుడి కటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలను అంతమొందించేందుకు సీపీఎం తన కేడర్‌ను ఉసిగొల్పుతోందని ఆయన మండిపడ్డారు. కాగా, హర్యానా బీజేపీ చీఫ్ సుభాష్ బరాలా కొడుకు వికాస్ నిర్వాకంపై ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఎందుకు మౌనం వహిస్తున్నారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రశ్నించారు. ఛండీగఢ్‌లో వికాస్, అతని స్నేహితుడు తనను వెంటాడి వేధించారంటూ ఓ యువతి ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్టు చేసి, బెయిల్‌పై విడుదల చేశారని పేర్కొన్నారు. నిందితులను ఎవరో కాపాడుతున్నారని ట్విటర్‌లో ఏచూరి ఆరోపించారు. ఓ యువతిని వెంటాడి వేధించినా.. ప్రధాని ఎందుకు మాట్లాడటం లేదన్నారు.

## జీన్స్, గళ్లచొక్కాలతో కోర్టుకు వస్తారా?

- కక్షిదారులపై హిమాచల్ హైకోర్టు ఆగ్రహం

షిమ్లా, ఆగస్టు 6: గుర్తుందా? గత ఏప్రిల్‌లో జార్ఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న మహిళా అధికారిణి కొట్టొచ్చినట్టు కనిపించే రంగున్న ప్రింటెడ్ చీరను ధరించి రావడంతో ఆ రాష్ట్ర హైకోర్టు ఆమెను లోపలికి అనుమతించలేదు! తాజాగా కక్షిదారుల 'డ్రెస్‌కోడ్' విషయంలో ఈసారి హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. వస్త్రధారణ పరంగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విచారణకు హాజరయ్యే కక్షిదారులు ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగులు జీన్ ప్యాంట్లు, గళ్లచొక్కాలను ధరించకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కోర్టుకు ఓ యువతి మల్టీకలర్డ్ చెక్ షర్టు, జీన్స్ ధరించి రావడంతో ఈ మేరకు జస్టిస్ అజయ్ మోహన్ గోయల్, తర్లోక్ సింగ్ చౌహాన్‌లతో కూడిన ధర్మాసనం కన్నెర్రజేసింది. న్యాయమూర్తులుగా తాము హైకోర్టు నిబంధనల మేరకు నిర్దేశించిన డ్రెస్‌కోడ్‌ను పాటిస్తామని, కక్షిదారులు మాత్రం సరైన వస్త్రధారణతో ఎందుకు రాలేకపోతున్నారో అర్థం కావడం లేదు అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యేకించి విచారణకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగుల వస్త్రధారణ మరీ దారుణంగా ఉంటోందని మండిపడింది. ఈ మేరకు హుందాతనం, మర్యాద ఉట్టిపడే వస్త్రధారణతో కోర్టుకు హాజరుకావాలని ధర్మాసనం స్పష్టంచేసింది.



# ఇందిర నియోజకవర్గం నుంచే ప్రియాంక?


### 2019 ఎన్నికల్లో కర్ణాటక నుంచి పోటీ!

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కుమార్తె ప్రియాంకగాంధీ 2019లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక నుంచి పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రియాంక ద్వారానే కాంగ్రెస్‌కు దేశ వ్యాప్తంగా పునరుజ్జీవనం సాధ్యమని ఏఐసీసీ వర్గాలు కొన్నేళ్ళుగా సూచించడడంతో ఎట్టకేలకు ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి అంగీకారం తెలిపినట్లు సమాచారం. 2019 ఎన్నికలను వేదికగా చేసుకుని కర్ణాటక నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న పెద్ద రాష్ట్రం కర్ణాటక ఒక్కటే. అందుకే ఇక్కడ నుంచే ప్రియాంకను బరిలోకి దించాలని ఆ పార్టీ అధిష్ఠానం యోచిస్తోంది. మాజీ ప్రధాని, డైనమిక్ మహిళగా పేరొందిన ఇందిరాగాంధీ సైతం రెండోసారి రాజకీయాలలో రాణించేందుకు కర్ణాటకను ఎంచుకున్న విషయం తెలిసిందే. అప్పటి చిక్కమగళూరు, ప్రస్తుత ఉడిపి-చిక్కమగళూరు నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీ పోటీ చేశారు. ప్రస్తుతం అదే నియోజకవర్గం నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేయనున్నట్లు సమాచారం. లేనిపక్షంలో మైసూరు నుంచి బరిలోకి దింపాలని ఏఐసీసీ భావిస్తున్నట్లు సమాచారం. ప్రియాంకగాంధీ 2019 ఎన్నికలలో పోటీ చేయడం అనివార్యమైతే 2018లో జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయి.

## మేకలను ఢీకొట్టిన లారీ.. డ్రైవర్‌పై గొడ్డలి దాడి

- సకాలంలో ఆస్పత్రికి.. తప్పిన ప్రాణాపాయం
- ప్రమాదంలో 30 మేకలు మృతి..
- తెలంగాణలో ఘటన

గణపురం(జయశంకర్ జిల్లా), ఆగస్టు 6: ఒక లారీ డ్రైవర్ అతి వేగం.. 30 మేకల ప్రాణాలను బలిగొంది. ఆపై అతడి ప్రాణం మీదకూ తెచ్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం సాయంత్రం జరిగింది ఘటన. జిల్లాలోని గణపురం మండలం కుందూరుపల్లి గ్రామసమీపంలో జరిగింది ఘటన. ప్రత్యక్ష సాక్షి, గొర్రెల కాపరి ఎగుర్ల మల్లయ్య కథనం ప్రకారం... సుమారు 60మేకల మందతో మల్లయ్య సాయంత్రం వేళ కుందూరుపల్లి వైపు ఇంటికి వెళ్తుతుండగా భూపాలపల్లి నుంచి ఇసుక లోడుతో ఏపీ 29టీబీ 4539 నెంబర్ గల లారీ అతి వేగంగా వస్తూ మరో లారీని దాటే క్రమంలో మేకల మందపైకి దూసుకు వచ్చింది. లారీ ఢీకొని 30 మేకలు అక్కడికక్కడే మృతిచెందగా, 15పైగా తీవ్ర గాయాలపాలై చెల్లాచెదురయ్యాయి. దీంతో ఆగ్రహించిన మేకల యజమానులు చంద్రు, బానోతు శివలు ద్విచక్ర వాహనంపై ఇసుక లారీని వెంబడించారు. చెల్పూరు సమీపంలోని కుందయ్యపల్లి వద్ద లారీని ఆపి భువనగిరికి చెందిన డ్రైవర్ జమీల్ పై గొడ్డలితో దాడి చేశారు. మెడపై బలమైన గాయం తగలడంతో జమీల్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుందయ్యపల్లి గ్రామస్థులు అతణ్ని 108 వాహనంలో ఎక్కించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. జమీల్‌పై దాడిచేసిన శివ, చంద్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. కాగా.. గొడ్డలిదాడికి గురైన లారీ డ్రైవర్ జమీల్‌ను.. కుందయ్యపల్లి గ్రామస్థులు సకాలంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పినట్లైనని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.



# ఈ పదవి కర్ణాటక పుణ్యమే!

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వెల్లడి
- బెంగళూరులో ఘనంగా తొలి సన్మానం

ఆంధ్రజ్యోతి, బెంగళూరు: సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను ఉప రాష్ట్రపతి పదవికి భారీ మెజారిటీతో ఎన్నికవడం కర్ణాటక తనకిచ్చిన రాజకీయ జన్మ పుణ్యమేనని ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. బెంగళూరు నగరానికి చెందిన పలు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడుకు ఆదివారం స్థానిక ప్యాలెస్ మైదానంలో ఘనసన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ఎల్లరిగూ నమస్కార' అంటూ కన్నడ భాషలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మూడుసార్లు తనను రాజ్యసభకు పంపిన కన్నడిగులకు ధన్యవాదాలు తెలిపేందుకే ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన అనంతరం మొట్టమొదటిసారిగా బెంగళూరుకు వచ్చానని పేర్కొన్నారు. కన్నడిగులు తనపై చూపిన ప్రేమ, అప్యాయతలను ఎన్నటికీ మరచిపోలేనన్నారు. నాలుగోసారి కూడా ఇక్కడినుంచి రాజ్యసభకు వెళ్లే అవకాశం వచ్చినా మరొకరికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో రాజస్థాన్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. నెల్లూరులో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తాను ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నికవడం భారత ప్రజాస్వామ్యంలోని గొప్పదనమన్నారు. ప్రాథమిక విద్య కోసం మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకునే వాడినని, బీజేపీ కార్యక్రమాల పోస్టర్లు అంటిస్తూ మైకుల్లో అనౌన్స్‌మెంట్లు చేసిన వెంకయ్య... కోట్లాది మంది ప్రజల ఆశీస్సుల తోనే ఈ ఉన్నత స్థానాన్ని అలంకరించగలిగానని వినయంగా సభికుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చేందుకు భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పాటుపడతానన్నారు. అంతకుముందు ఆహ్వాన కమిటీ తరపున పీఈఎస్ యూనివర్సిటీ చాన్సెలర్ ఎం.ఆర్.దొరస్వామి, బెంగళూరు సెంట్రల్ లోకసభ సభ్యుడు పి.సి.మోహన్‌లు మైసూరు సంప్రదాయ తలపాగాతో వెంకయ్యనాయుడును ఘనంగా సన్మానించారు.



వెంకయ్యను సత్కరిస్తున్న దృశ్యం

### నేడు నెల్లూరుకు వెంకయ్య

నెల్లూరు: నెల్లూరులోని వీఆర్ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం జరిగే ఆత్మీయ అభినందన సభలో ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడికి సముచిత సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నగరాన్ని అందంగా ముస్తాబు చేయడంతో పాటు ప్రధాన కూడళ్లలో భారీగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేశారు. కళాశాల మైదానంలో దాదాపు 15వేల మంది ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. వెంకయ్యనాయుడు జీవిత ఘట్టాలతో ఛాయా చిత్ర ప్రదర్శన, 1500 మీటర్ల జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సారథ్యంలోని ఆహ్వాన కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

**తిరుమల చేరుకున్న వెంకయ్య**

వెంకయ్యనాయుడు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం ఆదివారం రాత్రి 8.25 గంటలకు తిరుమల చేరుకున్నారు. ఆయన సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Madhavaram Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.